అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
గురువారం 22-2-2018 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 55 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ఇదేనా దళితాభివృద్ధి!



మాట్లాడుతున్న కమిషన్ చైర్మెన్ రామ్ శంకర్

జాతీయ ఎస్సీ కమిషన్ అసంతృప్తి

- దళితులపై పెరుగుతున్న దాడులు
- బాధితులకు దక్కని న్యాయం
- సబ్‌ప్లాన్ నిధుల్లో 50 శాతం మాత్రమే ఖర్చు
- నాణ్యతలేని డబుల్ బెడ్ రూం ఇండ్లు
- అమలుకు నోచుకోని కేంద్ర పథకాలు : కమిషన్ చైర్మెన్ రామ్ శంకర్ కథేరియా వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలో దళితుల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని జాతీయ ఎస్సీ కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. దళిత సంక్షేమానికి నిధుల కేటాయింపులు జరుపుతున్నారే కాని వారి అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో ఖర్చు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. 2017– 18 వార్షిక బడ్జెట్‌లో సబ్‌ప్లాన్ కింద రూ.14,375 కోట్లు కేటాయిస్తే అందులో నుంచి దళిత సంక్షేమానికి సగం నిధులు కూడా ఖర్చు చేయలేదని అసహనం వ్యక్తం చేసింది. ఇదేం దళితాభివృద్ధి అని ప్రశ్నించింది. జాతీయ ఎస్సీ కమిషన్ బృందం రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించి దళితాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు తీరును పరిశీలించింది. అనంతరం కమిషన్ చైర్మెన్ రామ్ శంకర్ కథేరియా బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మట్లాడారు. రాష్ట్రంలో దళితుల అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉందని విమర్శించారు. "ప్రత్యేక దళితాభివృద్ధి నిధి" పథకం కింద బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 50శాతం నిధులను కూడా 9లో

నాలుగో మోడీ కూడా ఇలాగే..

- లలిత్, జతిన్, నీరవ్...జంప్ : బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా



న్యూఢిల్లీ: మోడీ సర్కార్‌కు ఎక్కడ తగలాలో...అక్కడ తగిలేట్టు బీజేపీ ఎంపీ శత్రుఘ్నసిన్హా వదులుతున్న ట్వీట్లు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. లలిత్ మోడీ, జతిన్ మోడీ, నిరవ్ మోడీ...దేశాన్ని ముంచి విదేశాలకు పారిపోయారు, నాలుగో మోడీ (ప్రధాని మోడీ) కూడా ఇలాగే దేశ ప్రజల్ని మోసం చేస్తాడని...అర్థం వచ్చేట్టు ట్విట్టర్‌లో సిన్హా చేసిన రాజకీయ వాఖ్యలు అందరి దృష్టినీ ఆకర్షించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్–నీరవ్ మోడీ ఉదంతంపై సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున వ్యంగ్య వ్యాఖ్యలు, విమర్శలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీని టార్గెట్ చేస్తూ, పాట్నా ఎంపీ శత్రుఘ్న సిన్హా 9లో

భూదందా!

కలెక్టరేట్ భూమికి రూ.కోటి..రైతుకు రూ.10లక్షలా..

- జాతీయ రహదారి విస్తరణ కోసం అడ్డగోలుగా సర్కారు భూసేకరణ
- ఆందోళనలో ఏడు రెవెన్యూ గ్రామాల అన్నదాతలు
- పరిహారంలో భారీ తేడా

భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచిన రాష్ట్ర ప్రభుత్వం అమాయక గిరిజన రైతుల కడుపు కొడుతోంది. అనాదిగా సాగుపైనే జీవనం సాగిస్తూ బతుకీడుస్తున్న దళిత, గిరిజన రైతుల విలువైన భూములను కారుచౌకగా లాక్కునేందుకు కుటిల యత్నానికి తెరతీసింది. ఖమ్మం కలెక్టరేట్ నూతన భవన సముదాయానికి సేకరించిన పడావు భూములకు ఎకరానికి రూ.కోటి ఇచ్చిన ప్రభుత్వం గిరిజనుల సాగు భూములకు మాత్రం రూ.10లక్షలకు మించి పరిహారం ఇవ్వడం కుదరదంటోంది. ఖమ్మం - సూర్యాపేట మార్గంలో రోడ్డు విస్తరణ కోసమని ఇరువైపులా ఉన్న భూముల స్వాధీనం ప్రభుత్వ దుర్మార్గానికి పరాకాష్టగా నిలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షల విలువ చేసే భూములకు రూ.10 లక్షలు చెల్లించి గిరిజనుల జీవితాలను రోడ్డు పాల్జేసేందుకు పూనుకుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గంలో దళిత, గిరిజనుల భూములను అప్పనంగా కాజేసేందుకు పన్నిన పన్నాగంపై 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం.


వివరాలు 9లో

కంది, శనగ రైతుల ఆందోళన

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో రాస్తారోకోలు

వివరాలు 3లో




సీఎం సోదరి కన్నుమూత

కేసీఆర్‌కు రెండో అక్క విమలాబాయి

- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్


(ఫైల్)

ముఖ్యమంత్రి సోదరి విమలాబాయి కన్నుమూశారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె బుధవారం హఠాన్మరణం చెందారు. తన సోదరి మరణ వార్తను తెలుసుకున్న సీఎం కేసీఆర్ అల్వాల్‌లోని సోదరి నివాసానికి వెళ్లి.. బంధుమిత్రులను పలకరిస్తూ.. సోదరి మృతదేహం వద్దకు రాగానే కేసీఆర్ విలపించారు. విమలాబాయి కేసీఆర్‌కు రెండో అక్క. వీళ్లు 9లో

పుకార్లు నమ్మొద్దు

- అభ్యర్థులు ఆందోళన పడొద్దు : టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి

వివరాలు 9లో



'జస్టిస్ ఫర్ పీపుల్'

- పార్టీ పేరు ప్రకటించిన లోకనాయకుడు
- ప్రజలకు సేవకుడినన్న కమల్‌హాసన్
- నక్షత్రాన్ని ఆరు చేతులు రక్షిస్తున్నట్టుగా గుర్తు..

వివరాలు 2లో



ఘోర రోడ్డు ప్రమాదం

9 మంది మృతి

వివరాలు 9లో

- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- టైరు పగిలి అదుపు తప్పిన కారు..
- మరో కారును ఢీకొట్టిన వైనం
- వనపర్తి జిల్లా కొత్తకోటలో ఘటన




జైలుకైనా పోతం..
భూములివ్వం

జాతీయ రహదారి భూసర్వేను అడ్డగించిన నిర్వాసితులు

- కేసులు పెడతామంటూ అధికారుల బెదిరింపులు
- ఆర్డీఓతో చర్చలు విఫలం

వివరాలు 9లో


రైతులతో మాట్లాడుతున్న ఆర్ఐ లక్ష్మణ్

కొక్కొరోకో..



మోడీ గారు "క్యాష్ లెస్ ఇండియా" చేస్తానన్నారుగా.. ముందు బ్యాంకులను చేస్తున్నట్టున్నారు...!!

ఆడశిశువుల మరణాలే అధికం

ఆరోగ్య సంరక్షణలో తల్లిదండ్రులూ నిర్లక్ష్యం : యూనిసెఫ్ నివేదిక


(ఫైల్)

ముంబయి : పసికందుల మరణాల్లోనూ ఆడపిల్లల సంఖ్యే ఎక్కువగా ఉన్నది. గర్భస్థ ఆడ శిశువులను చిదిమేసి.. భ్రూణ హత్యలకు పాల్పడుతున్న ఫలితంగా సమాజంలో అమ్మాయిల నిష్పత్తి తగ్గిపోతున్నదంటూ ఇటీవల నివేదికలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దేశంలో పుట్టీపుట్టగానే.. అంటే నెలలోపు చిన్నారుల మరణాల్లో నవజాతశిశువుల సంఖ్యే ఎక్కువని యూనిసెఫ్ నివేదికలో వెల్లడించింది.

యూనిసెఫ్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. ఏడాది లోపు చిన్నారుల మరణాల్లో భారతదేశం అగ్రభాగాన ఉంది. ఏటా అక్షరాల 6,00,000 మంది చిన్నారులు మరణిస్తున్నారని తెలిపింది. కాగా, చనిపోతున్న వారిలో ఆడశిశువుల సంఖ్య ఎక్కువని ఆ గణాంకాలు తెలిపాయి. 'బయోలాజికల్‌గా పుట్టిన పసిపిల్లల్లో అబ్బాయిలకంటే అమ్మాయిలే బలంగా ఉంటారు. విచారకరమేమంటే.. సామాజికంగా వారు చాలా బలహీనంగా ఉంటున్నారు' అని యూనిసెఫ్‌లో భారత ప్రతినిధి యాస్మిన్ అలీ హక్ తెలిపారు. 'పుట్టకముందు నుంచే వారిపై వివక్ష ప్రారంభమవుతున్నది' అని తెలిపారు. నవజాత శిశువులకు ఉచిత వైద్య సంరక్షణను అందించేందుకు భారతదేశంలో 700లకుపైగా ప్రభుత్వాస్పత్రులున్నాయి. అయితే, వీటిలో సౌకర్యాన్ని అందుకుంటున్నవారిలో 60 శాతానికిపైగా మగబిడ్డలే'నని 2017లో యూనిసెఫ్ సేకరించిన సమాచార గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 'అమ్మాయిలు తమకు 9లో

బీజేపీకి నాగం గుడ్‌బై



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. గత కొంత కాలంగా కాంగ్రెస్ నేతలతో ఆయన సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరిక దాదాపు ఖాయమన్న సంకేతాలు వెలువడ్డాయి. నాగం మాత్రం ఉగాది పండుగకు మూహూర్తం నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెప్పాయి. రాష్ట్ర కాంగ్రెస్ నేతల సమక్షంలో కాకుండా రాహుల్‌గాంధీ సమక్షంలోనే చేరే అవకాశం ఉన్నది. ఇదిలా ఉండగా నాగం కాంగ్రెస్‌లోకి వస్తున్న ప్రచార నేపథ్యంలో పార్టీ అంతర్గత సమావేశాల్లో పలు ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. కొంత మంది నేతలు ఆయన చేరికను అడ్డుకున్నట్టు విమర్శలొచ్చాయి. ముఖ్యంగా గద్వాల ఎమ్మెల్యే డికె అరుణ, ఎంపీ నంది ఎల్లయ్య, ఎమ్మెల్సీ 9లో

మా భూములను మేం పొందేందుకు...

- భానుబాయ్ ప్రాణత్యాగం చేయాల్సి వచ్చింది : దళితుడు రామా చమర్
- అంత్యక్రియల మరుసటి రోజున దక్కిన ఫలితం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని దుడ్కా గ్రామ దళితుల భూమి హక్కుల కోసం నిప్పంటించుకుని మరణించిన రాష్ట్రీయ దళిత్ అధికార్ మంచ్(ఆర్‌డీఏఎం) సభ్యుడు భాను వాంకర్ అంత్యక్రియలు జరిగిన మరుసటి రోజున ఆయన పోరాట ఫలితం లభించింది. దళితులు హేమా వాంకర్, రామా చమర్‌ల భూములకోసం పోరాడిన భాను వాంకర్ అంతిమ సంస్కారాలు ఉత్తర గుజరాత్‌లోని ఉంజా పట్టణంలో సోమవారం నిర్వహించారు. అయితే అదే రోజు రెవెన్యూ అధికారులు తమ గ్రామానికి భూమి సంబంధిత దస్తావేజులు పట్టుకుని రాత్రి 9 గంటలకు వచ్చారని.. రామా చమర్ తెలిపాడు. కానీ ఇందుబెన్(భాను వాంకర్ భార్య) చేతుల మీదుగానే స్వీకరిస్తామని స్పష్టం చేశామని అన్నాడు. భూమి దస్తావేజులను వాంకర్ నివాసంలో వారికి మంగళవారం అందజేశారు. తమ భూములు తమకు దక్కేందుకు భానుబాయ్ తన జీవితాన్ని త్యాగం చేయాల్సి వచ్చిందని రామా చమర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ చట్టాలు 1955 ప్రకారం హేమా, రామాలు భూమిని కలిగి ఉన్నారు, కానీ యజమానులుగా పేర్లు నమోదు కాలేదు. ఇలాంటి సమస్యలపై పోరాటం చేస్తున్న భాను వాంకర్ ఈ నెల 15న పటాన్ కలెక్టరేట్ ఎదుట నిప్పంటించుకుని ప్రాణ త్యాగం చేశాడు. వారి డిమాండ్లు నెరవేరే వరకు మృతదేహాన్ని రెండు రోజుల వరకు వాంకర్ కుటుంబీకులు, దళిత కార్యకర్తలు అక్కడే ఉంచారు.

విద్యార్థులపై ఫీజుల భారం
టాటా విద్యాసంస్థల్లో బంద్

న్యూఢిల్లీ : టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) అన్ని క్యాంపస్‌లలోని విద్యార్థులు బుధవారం నుంచి బంద్ నిర్వహిస్తున్నారు. కాంపస్‌లలో స్కాలర్‌షిప్‌లపై చదువుకుంటున్న విద్యార్థుల నుంచి ట్యూషన్, డైనింగ్ హాల్, హాస్టల్ ఫీజులను డిమాండ్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్ పాలకుల వైఖరిని నిరసిస్తూ టీఐఎస్ఎస్ విద్యార్థి సంఘం నేతృత్వంలో విద్యార్థులు నిరసనకు దిగారు. స్కాలర్‌షిప్‌పై ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు అటువంటి ఫీజుల నుంచి మినహాయింపు ఉన్నది. ముంబయి, తుల్జాపూర్, హైదరాబాద్, గువహతిల్లో టీఐఎస్ఎస్ క్యాంపస్‌లున్నాయి. ఈ విషయమై గత కొన్ని నెలలుగా టీఐఎస్ఎస్ అధికారులతో నిర్వహించిన చర్చలు, నెరపిన మధ్యవర్తిత్వంవిఫలమైందని విద్యార్థి సంఘం అధ్యక్షులు అర్చనా సోరెంగ్ తెలిపారు. తమ బంద్‌లో భాగంగా తరగతులు, ఫీల్డ్ వర్క్, ప్రాజెక్టు వర్క్ సమర్పణలను బహిష్కరించాలని పిలుపునిచ్చినట్టు ఆమె తెలిపారు.

ప్రియా ప్రకాశ్‌పై క్రిమినల్ ప్రొసీడింగ్స్ వద్దు
రాష్ట్రాలను ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : విడుదలకు సిద్ధంగా ఉన్న మలయాళం సినిమా 'ఒరు అదార్ లవ్' డైరెక్టర్, నిర్మాతతో పాటు నటి ప్రియా ప్రకాశ్ వారియర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టు బుధవారం స్టే ఇచ్చింది. ఆమె నటించి, విడుదలకు సిద్ధంగా ఉన్న మలయాళం సినిమాలోని ఒక పాట ముస్లింల మనోభావాలను కించపరిచేదిగా ఉన్నదన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రకాష్ వారియర్ తదితరులపై క్రిమినల్ చర్యలు తీసుకోకుండా అన్ని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది.

ఆప్ ఎమ్మెల్యేలకు జ్యుడిషియల్ కస్టడీ

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాశ్‌పై దాడి చేసిన కేసులో ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలకు ఢిల్లీ కోర్టు గురువారం వరకూ జ్యుడిషియల్ కస్టడీ విధించింది. ఇద్దరు ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాశ్ జార్వల్ బెయిల్ పిటిషన్‌ను గురువారం కోర్టు విచారించనుంది. ప్రకాష్ జార్వల్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేయగా, అమానతుల్లాను బుధవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. బుధవారం విచారణలో ముందుగా కోర్టు ఎమ్మెల్యేల కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఎమెల్యేలు విచారణకు సిద్ధంగా వున్నారని మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ షెఫలీ బర్నాలా తెలిపారు.

ఆర్థిక మోసాలపై నోరు విప్పరా?

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : బడా పెట్టుబడుదారులు, శక్తివంతమైన రాజకీయనాయకులు కుమ్మక్కైతే ఏం జరుగుతుందో 'నీరవ్ మోడీ' ఉదంతం తెలియజేస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తెలిపింది. బడా కార్పొరేట్ వర్గాలకు అనుకూలమైన విధానాల్ని మోడీ సర్కార్ అమలుజేస్తోందని, దేశంలో నేడు క్రోనీ క్యాపటలిజం (పెట్టుబడుదారుల సంక్షేమం) చెలరేగుతున్న తీరు ప్రమాదఘంటికలు మోగిస్తోందని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. ప్రభుత్వ సొమ్మును మింగి, సంపదను విదేశాలకు తరలించుకువెళ్లటాన్ని ప్రజలు చూస్తున్నారని, నిరవ్ మోడీ కుంభకోణంపై మోడీ సర్కార్ కనీసం సమాధానం కూడా చెప్పటం లేదని సీపీఐ(ఎం) విమర్శించింది. నిరవ్ మోడీ దావోస్ సదస్సులో పాల్గొని ప్రధాని మోడీతో గ్రూప్ ఫొటో దిగటంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత లేదా ? అని ప్రశ్నించింది. ఆర్థిక మోసాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేసి విచారణకు ఆదేశించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

బొగ్గురంగం ప్రయివేటీకరణ ప్రమాదకరం...

బొగ్గు రంగం ప్రయివేటీకరణను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. ప్రయివేటు కంపెనీల ఉత్పత్తికి పచ్చజెండా ఊపుతూ మోడీ సర్కార్ మంగళవారం తీసుకున్న నిర్ణయాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా తప్పుబట్టింది. పొలిట్‌బ్యూరో బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో...నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు ఇది ఉదాహరణ. ప్రస్తుతం ప్రయివేటు కంపెనీలు సొంత అవసరాల కోసం మాత్రమే బొగ్గును ఉత్పత్తి చేసుకోవడానికి అనుమతిస్తున్నారు.

మోడీ సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయం వల్ల, ఇకపై వాణిజ్య అవసరాల కోసం బొగ్గును ఉత్పత్తి చేసేందుకు బడా కార్పొరేట్ కంపెనీలకు కాంట్రాక్టులు దక్కనున్నాయి. ప్రమాదకరమైన ఈ నిర్ణయం దేశ ఇంధన భద్రతను దెబ్బతీస్తుంది. కార్మికుల ఉద్యోగ భద్రత, రక్షణ పట్ల కేంద్రం రాజీపడింది. బొగ్గురంగంలో సంస్కరణలు చాలా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు మొదట్నుంచీ హెచ్చరిస్తున్నాయి. బొగ్గురంగం ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తమతో గొంతుకలపాలని దేశంలోని ప్రజాస్వామ్యవాదుల్ని, ప్రజాసంఘాల్ని సీపీఐ(ఎం) కోరింది.

తిరోగమన చర్య : సీఐటీయూ

నాలుగు దశాబ్దాల క్రితం బొగ్గురంగాన్ని జాతీయం చేస్తే, మళ్లీ నేడు బొగ్గురంగాన్ని మోడీ సర్కార్ ప్రయివేటీకరణ చేయటాన్ని తిరోగమన చర్యగా సీఐటీయూ అభివర్ణించింది. మోడీ సర్కార్ నిర్ణయం దేశ ఆర్థికరంగానికి, జాతీయ ప్రయోజనాలకు నష్టాన్ని తెచ్చిపెడుతుందని సీఐటీయూ హెచ్చరించింది. ఉత్పత్తి చేసిన బొగ్గును ప్రయివేటు కంపెనీలు ఇష్టమొచ్చిన ధరకు, ఇష్టమున్నట్టు అమ్ముకునే అవకాశం మోడీ సర్కార్ కల్పించిందని, ఈ నిర్ణయం ప్రభుత్వ రంగంలో బొగ్గు ఉత్పత్తిని దెబ్బతీస్తుందని, ముందు ముందు ప్రజలపై పెద్ద ఎత్తున భారాల్ని మోపుతుందని సీఐటీయూ హెచ్చరించింది.

అవినీతి సాధనంగా మోడీ

- ప్రధానిపై రాహుల్ ప్రత్యక్ష దాడి

షిల్లాంగ్: ప్రధాని నరేంద్రమోడీపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రత్యక్షదాడికి దిగారు. 'అవినీతికి సాధనం'గా మోడీ మారారని విమర్శించారు. ఎన్నికలు జరుగనున్న మేఘాలయాలో రాహుల్ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిల్లాంగ్‌లో ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. "నరేంద్ర మోడీ అవినీతికి వ్యతిరేకం కాదు... అవినీతికి ఆయన ఒక సాధనం' అన్నారు. 'విజయ్ మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీ లాంటి వ్యక్తులను భారత్ నుంచి చాలా అద్భుతంగా అదృశ్యం చేయగల మాంత్రికుడు. అంతేకాదు.. మన దేశ చట్టాలకు దూరంగా వారిని తిరిగి ప్రత్యక్షం కూడా చేయగలరు' మోడీ తన మ్యాజిక్‌తో దేశంలో త్వరలో ప్రజాస్వామ్యాన్ని కూడా అదృశ్యం చేస్తాడు' అని రాహుల్ ఆంధీ విమర్శించారు. పీఎన్‌బీలో మోసం, రఫెల్ ఒప్పందంపై ప్రధాని మౌన ముద్రను రాహుల్ తప్పుపట్టారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో అవినీతిపై ఆయన ఉపన్యాసం కోసం తాను ఎదురుచూస్తున్నట్టు చెప్పారు.

'జస్టిస్ ఫర్ పీపుల్'

పార్టీ పేరు ప్రకటించిన లోకనాయకుడు



చెన్నై: ఎటు చూసినా జనమే.. హోరెత్తుతున్న హర్షధ్వానాలు.. తమిళుల హృదయాల్లో ఆనందాలు వెల్లివిరిసేలా, తమకంటూ ఒకరున్నారంటూ భరోసానిచ్చేలా లోకనాయకుడు తన రాజకీయ పార్టీని ప్రారంభించారు. 'మక్కల్ నీది మయ్యం(జస్టిస్ ఫర్ పీపుల్)' పార్టీ పేరు అంటూ కమల్ హాసన్ ప్రకటించగానే సభా ప్రాంగణం మార్మోగిపోయింది. నక్షత్రాన్ని ఆరు చేతులు చుట్టినట్టు ఉన్న పార్టీ గుర్తును ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. నక్షత్రం తెలుపు రంగులో ఉండగా.. మూడు చేతులు తెలుపు, మూడు చేతులు ఎరుపు వర్ణంలో ఉన్నాయి. తమిళనాడులోని మధురైలో బుధవారం జరిగిన పార్టీ ఆవిర్భావ సభకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బహిరంగ సభకు వచ్చే ముందు కమల్ రామేశ్వరంలోని ఏపీజే అబ్దుల్ కలామ్ నివాసాన్ని ఆయన సందర్శించారు. కలామ్ సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి.. ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడారు. అక్కడి నుంచి కలామ్ చదువుకున్న స్కూల్‌కు వెళ్లాల్సి ఉన్నా.. స్థానిక అధికారులు అనుమతి నిరాకరించడంతో ఆ కార్యక్రమం రద్దయ్యింది. అనంతరం రామేశ్వరంలోని మత్స్యకారులను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలు జాలర్లకు ఎన్నో హామీలిచ్చాయని, కానీ ఏ ఒక్కటీ అమలు కాలేదని కమల్ అన్నారు. మధురైకి వస్తున్న సమయంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. 'నేను మీ ఇంట్లో వెలుగుతున్న దీపం లాంటి వాడిని. నన్ను జాగ్రత్తగా కాపాడుకోండి' అని చెప్పారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తాను ఒక్క రోజు కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ కొనసాగించడానికే వచ్చానని తెలిపారు. తాను నాయకుడిని కాదని, సామాన్య ప్రజల్లోంచి పుట్టుకొచ్చిన ఒక వ్యక్తినని చెప్పారు. తమిళ ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకే పార్టీని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రజల నుంచి సలహాలు స్వీకరిస్తాను తప్ప సలహాలు ఇవ్వబోనని కమల్ స్పష్టం చేశారు.

ఢిల్లీ రికార్డు బద్దలు కొట్టాలి : కేజ్రీవాల్

దేశ రాజధానిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సాధించిన రికార్డును బద్దలు కొట్టాలని తమిళ ప్రజలకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. కమల్ పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. సభకు హాజరైన ఉత్సాహాన్ని చూస్తుంటే ఆప్ రికార్డును చెరిపేయడం కష్టమైన పనేం కాదన్నారు. లోక నాయకుడికి ప్రజలు అండగా నిలబడతారని తనకు బలమైన నమ్మకముందన్నారు. తన అభిమాన హీరో కమల్ హాసన్ అని కేజ్రీవాల్ కొనియాడారు. 2015లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 నియోజకవర్గాలకు గానూ ఆప్ 67 స్థానాలు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు
59శాతం మంది కోటీశ్వరులు

కోహిమా : నాగాలాండ్‌లో ఈ నెల 27న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 59 శాతం మంది కోటేశ్వరులే. రాష్ట్రంలోని 60 అసెంబ్లీ స్థానాలకుగాను 196 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో 193 మంది అఫిడవిట్లను ఎలక్షన్ వాచ్ డాగ్ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించింది. వీరిలో 114 మంది అభ్యర్థులు (59 శాతం) కోటీశ్వరులే. కాగా, సగటు అభ్యర్థి ఆస్తి రూ. 3.76 కోట్లు. పార్టీల వారీగా చూస్తే.. నాగా పీపుల్స్ ఫ్రంట్ నుంచి (ఎన్‌పీఎఫ్) 43 మంది, నేషనలిస్ట్ డెమోక్రటివ్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) 24, బీజేపీ 13, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 12, జనతాదళ్ (యునైటెడ్) 7, కాంగ్రెస్ 6, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు కోటీశ్వరులు పోటీలో ఉన్నారు. జేడీయూ నుంచి సానిస్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న రమోన్‌గో లోథా రూ. 38.92 కోట్ల ఆస్తితో మొదటి స్థానంలో నిలిచాడు. 38.20 కోట్ల ఆస్తితో అతౌజు నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి కెఎల్ చిషి, ఎన్‌డీపీపీ నుంచి పోటీ చేస్తున్న నిఫ్యూ రాయ్ వరుసగా రెండు మూడు స్థానాలను ఆక్రమించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే.. నేర చరితుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. 193 మంది అభ్యర్థుల్లో ముగ్గురు (2శాతం) అభ్యర్థులు నేరాభియోగాలను ఎదుర్కొంటుండగా, మరో ముగ్గురు 2శాతం తీవ్రమైన నేరారోపణలను ఎదుర్కొంటున్నారు. ఇక మహిళల ప్రాతినిధ్యం చాలా స్వల్పం. కేవలం ఐదుగురు (3శాతం) మాత్రమే పోటీలో ఉండటం గమనార్హం.

బాలిక పై లైంగికదాడి యత్నం - ఐటీ అధికారి అరెస్ట్

పాట్నా: సిక్కిం బాలిక పై లైంగికదాడికి యత్నించిన ఆదాయ పన్ను శాఖ అధికారిని పాట్నా పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. బీహార్‌లోని దిఘా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు మంగళవారం చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆయన పై చర్యలు తీసుకున్నారు. ఆదాయ పన్ను శాఖలో జాయింట్ కమిషనర్ అధికారైన రాంబాబు గుప్తా.. మెడికల్ ఎంట్రన్స్ కోసం శిక్షణనిచ్చే ఓ ఇన్‌స్టిట్యూషన్‌ను పాట్నాలో నడుపుతుండేవాడు. సిక్కింకు చెందిన 30మంది విద్యార్థినులు అందులో శిక్షణ పొందుతూ, ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన హాస్టల్లోనే ఉండేవారు. అయితే ఈ నెల 17న బాధితురాలి గదికి వచ్చిన రాంబాబు ఆమె పై లైంగిక దాడికి యత్నించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితురాలు విషయాన్ని తన తల్లిదండ్రులకు, స్నేహితులకు తెలిపింది.

ఫేస్‌బుక్‌లో అసభ్యకరమైన పోస్టులు పెట్టినందుకు బాలికను మందలించానని, తనను తప్పుడు కేసులో ఇరికించారని రాంబాబు అన్నాడు. కాగా న్యాయం చేయాలని ఆందోళన చేస్తుంటే గొడవను పెద్దది చేయొద్దని రాంబాబు రాయబారానికి దిగాడని బాధితురాలి తండ్రి ఆరోపించాడు. నిందితుడు రాంబాబు గుప్తా 2005 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి.

యూపీలో ఇద్దరు బాలికలపై యాసిడ్ దాడి

లక్నో: స్కూల్ నుంచి బంధువుతో కలిసి ఇంటికి వెళ్తున్న ఇద్దరు బాలికలపై గుర్తుతెలియని దుండగుడు యాసిడ్‌తో దాడి చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో సోమవారం చోటుచేసుకుంది. తమ బావ లఖాన్‌తో కలిసి శివం(15), అంజలి(13) బైక్ పై వెళ్తున్నప్పుడు ఘజియాబాద్‌లోని లింక్ రోడ్డు పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఈ దాడి జరిగింది. బాధితులు.. ఇద్దరు బాలికలు, లఖాన్‌ల ముఖం, మెడపై యాసిడ్ వల్ల గాయాలయ్యాయి. బాధితురాలు అంజలి కథనం మేరకు వీరు ముగ్గురు దాదాపు ఇంటికి చేరుకునే సమయంలోనే తలపై హెల్మెట్ ధరించిన గుర్తుతెలియని ఓ నిందితుడు పిచికారితో యాసిడ్‌ను తమ పైకి చిమ్మాడని చెప్పింది. తాము స్పందించే లోపే నిందితుడు పరారయ్యాడని వివరించింది. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన ఈ ముగ్గురు బాధితులు బుధవారం డిశ్చార్జి అయ్యారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని నిందితుడికోసం గాలిస్తున్నారు.

దక్షిణ ఆఫ్రికా పోలీస్‌స్టేషన్‌పై దుండగుల దాడి

- ఐదుగురు పోలీస్ అధికారులు మృతి



ప్రిటోరియా : దక్షిణ ఆఫ్రికాలోని పోలీస్‌స్టేషన్‌పై దుండగులు మెరుపుదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు పోలీస్ అధికారులు మృతి చెందారు. అనంతరం ఓ సైనికుడిని కాల్చి చంపారు. అయితే, ఈ ఘటనకు బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రసంస్థ కూడా ప్రకటించుకోలేదు. దక్షిణ ఆఫ్రికా పోలీస్ సర్వీస్ నేషనల్ కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం...ఉట్మామా నగరంలోని పోలీస్ స్టేషన్‌పై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌లోని తుపాకులు, మందుగుండు సామాగ్రి, కొంత నగదు, పోలీస్ వ్యాన్ ఎత్తుకెళ్లారు. దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఐదుగురు పోలీస్ అధికారులపై కాల్పులు జరిపి ఘటనాస్థలం నుంచి పారిపోయారు. ఈ ఘటనకు ఉగ్రవాదం సంబంధాలేమైనా ఉన్నాయా ? లేక ఇది దోపిడీ దొంగల పనియా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

ఆయుధాల అమ్మకాలపై ఆంక్షలు

- అమెరికాలో ట్రంప్ సర్కార్ తాజా నిర్ణయం



వాషింగ్టన్: అమెరికాలో ఆయుధాల అమ్మకాలకు సంబం ధించి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నూతన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రమాదకరమైన బంప్ స్టాక్ డివైస్‌లను నిషేధించాలని ఆయన ఆదేశించారు. లాస్ వెగాస్ కచేరీలో కాల్పులు జరిపిన షూటర్ బంప్ స్టాక్‌లను వాడారు. వాటి వల్ల అతి తక్కువ సమయంలోనే సుమారు 58 మంది మ్యూజిక్ లవర్స్ చనిపోయారు. గన్‌లకు వాడే బంప్ స్టాక్‌లతో.. కేవలం నిమిషంలోనే వందల రౌండ్ల బుల్లెట్లను ఫైర్ చేయవచ్చు. అయితే ఇటీవల వైట్‌హౌస్‌లో మాట్లాడిన ట్రంప్.. బంప్‌స్టాక్‌లను నిషేధిస్తున్నట్టు తెలిపారు. ఆ డివైస్‌లను చట్టవ్యతిరేకమని ప్రకటించేందుకు కొత్త చట్టాన్ని తయారు చేయాలని ఆయన న్యాయశాఖను ఆదేశించారు. ఇటీవల ఫ్లోరిడా స్కూల్‌లో ఓ మాజీ విద్యార్థి విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 17 మంది విద్యార్థులు మృతి చెందారు. అంతేగాకుండా, ఈ ఘటన అనంతరం దేశ వ్యాప్తంగా తుపాకుల సంస్కృతి వద్దని నినదిస్తుండడంతో ట్రంప్ కొత్త నిర్ణయాలు ప్రకటించారు. గన్ 'బంప్ స్టాక్స్'పై నిషేధం విధిస్తున్నట్టు ఆయన తెలిపారు. సెమీ ఆటోమేటిక్ రైఫిల్స్‌కు సంబంధించిన ఉపకరణాలు ఇకపై మార్కెట్లో విక్రయించబోమని ఆయన స్పష్టం చేశారు.


చైనాతో సత్సంబంధాలు కొనసాగిస్తాం

బంగ్లా ప్రధాని హసీనా



ఢాకా : చైనాతో సత్సంబంధాలు పెంపొందించుకోనున్నట్టు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తెలిపారు. తమ దేశ అభివృద్ధి కోసం చైనా సహకారాన్ని తీసుకోవాలని భావిస్తున్నామని అన్నారు. "మా ప్రభుత్వం అభివృద్ధి గురించే ఆలోచిస్తోంది. అందుకే బంగ్లాదేశ్ అభివృద్ధికి సహకారం అందించే ఏ దేశంతో అయినా కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. మాకు పెట్టుబడులు, సహకారం అవసరం. పురోభివృద్ధికి సాయపడే ఏ దేశంతోనైనా సహకారానికి తాము సిద్ధంగా వున్నామని చెప్పారు. అది ఎవరు అందించినా సరే. మా దేశాభివృద్ధిని కోరుకుంటున్నాం. మా ప్రజల గురించే మేం ఆలోచించాల్సి ఉంటుంది" అని షేక్ హసీనా అన్నారు. భారత్, చైనా, జపాన్, మధ్య ప్రాచ్య దేశాలు కూడా సహకారం అందించేందుకు వస్తున్నట్టు ఆమె చెప్పారు.

అమెరికా క్రైస్తవ మతగురువు 'బిల్లీ గ్రాహమ్' కన్నుమూత


బిల్లీ గ్రాహమ్

వాషింగ్టన్ : అమెరికాలోని ప్రముఖ క్రైస్తవ మతగురువు బిల్లీ గ్రాహమ్ (99) మృతి చెందారు. 20వ శతాబ్దానికి చెందిన ప్రభావశీల వ్యక్తుల్లో ఆయన ఒకరు. క్రైస్తవ మత ప్రచారానికి గ్రాహమ్ పూనుకున్నారు. 1954 నుంచి కొంతకాలం లండన్ కేంద్రంగా సువార్త సభలు నిర్వహించారు. గ్రాహమ్ కుటుంబ సభ్యులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమెరికా ఓ ప్రముఖ ఆధ్యాత్మిక గురువును కోల్పోయిందని అన్నారు.

అమెరికా చరిత్రలోనే పరమ చెత్త అధ్యక్షుడు ట్రంప్


- యూఎస్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ సర్వే



వాషింగ్టన్ : అమెరికా చరిత్రలోనే డొనాల్డ్ ట్రంప్ చెత్త అధ్యక్షుడంటూ యూఎస్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ (పీఎస్ఏ) పేర్కొన్నది. అమెరికన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్, ఎగ్జిక్యూటివ్ పాలిటిక్స్ సెక్షన్‌కు చెందిన 170 మంది సభ్యులు చేపట్టిన సర్వే ఆధారంగా తామీ నిర్ధారణకు వచ్చినట్టు పేర్కొన్నది. ట్రంప్ లాంటి అధ్యక్షుడిని తాము చూడలేదంటూ తెలిపింది. ప్రతీ నాలుగేండ్లకు ఒకసారి సర్వే చేపట్టి ఉత్తమ, చెత్త అధ్యక్షుల జాబితా రూపొందిస్తున్నట్టు తెలిపింది. అధ్యక్షుడి పరిపాలన, రూపొందించిన సంక్షేమ పథకాలు, సంస్కరణలు, తీసుకున్న నిర్ణయాలు తదితర అంశాల ఆధారంగా సర్వే నిర్వహించామని అమెరికా పీఎస్ఏ పేర్కొన్నది. అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త ప్రెసిడెంట్ ట్రంప్ అని ఆరోపించింది. అలాగే అబ్రహం లింకన్, జార్జ్ వాషింగ్టన్‌లు టాప్‌లో నిలిచారు. ఈ సర్వేను హ్యూస్టన్ యూనివర్సిటీకి చెందిన పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ బ్రాండన్ రొటింగస్, అసోసియేట్ ప్రొఫెసర్ జస్టిన్ వాన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సర్వే ఫలితాలు, అధ్యక్షులకు ర్యాంకుల్ని న్యూయార్క్ టైమ్స్‌లో ప్రచురించారు. మొత్తం 100 మార్కులకు సర్వే చేపట్టగా... ట్రంప్‌కు మాత్రం కేవలం 12 మార్కులే వచ్చాయి. ట్రంప్ 2022 తర్వాత కూడా ఇదే స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంటారని ప్రొఫెసర్లు పేర్కొనడం గమనార్హం. అలాగే ట్రంప్ కంటే ముందు జేమ్స్ బుచానన్, విలియమ్ హారిసన్ ట్రంప్ కంటే ముందు రెండు స్థానాల్లో ఉన్నారు. వీరిలో బుచానన్ 15వ అధ్యక్షుడు కాగా.. హారిసన్ 9వ ప్రెసిడెంట్. ట్రంప్‌కు ముందు అధ్యక్షుడు ఒబామా 8వ స్థానంలో నిలిచారు.

ఉగ్ర సంస్థలకు ఆర్థిక సాయమా!

పాక్ విదేశాంగ మంత్రి



ఇస్లామాబాద్ : ఉగ్ర సంస్థలకు పాక్ నుంచి ఎలాంటి సాయం అందడం లేదని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. ఉగ్రసంస్థలకు పాక్ స్వర్గధామంగా మారిందని అమెరికా గతవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేగాకుండా, ఉగ్రసంస్థల నిర్మూలనకు కొన్నేండ్ల నుంచి అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేసినట్టు ప్రకటించింది. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ సహకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈనేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ వ్యాఖ్యలను పాక్ విదేశాంగ మంత్రి ఖండించారు. అమెరికా ఆరోపణలపై సమీక్షిస్తామని అన్నారు. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) తమ వైపే నిలిచిందని పేర్కొన్నారు. పారిస్‌కు చెందిన ఫ్రెంచి నిఘా సంస్థ ఎఫ్ఏటీఎఫ్ తమకు అనుకూలంగా స్పందించిందని చెప్పుకొచ్చారు. "మా ప్రయత్నాలు ఫలించాయి. పాకిస్థాన్‌ను ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం అందిస్తున్న దేశాల జాబితాలో చేర్చాలన్న అమెరికా చర్యలకు అడ్డుకట్ట పడింది. ఫిబ్రవరి 20న జరిగిన ఎఫ్ఏటీఎఫ్ పారిస్ సమావేశంలో దానిపై ఏకాభిప్రాయం రాలేదు" అని ట్వీట్ చేశారు. అలా చెబుతూనే దీనికి సంబంధించిన కేసును మూడు నెలల పాటు వాయిదా వేశారని, జూన్‌లో మరో నివేదిక సమర్పించేలా ఏపీజీ (ఆసియా పసిఫిక్ గ్రూప్)కు సమావేశ పెద్దలు ఆదేశాలు జారీ చేశారని ఆయన ట్వీట్ చేశారు. అందుకు సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు అని చెప్పుకొచ్చారు.

నవాజ్ షరీఫ్‌కు ఎదురు దెబ్బ

- పార్టీ అధ్యక్షుడిగా అనర్హుడు..సుప్రీం తీర్పు



ఇస్లామాబాద్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఆ దేశ సుప్రీంకోర్టులో బుధవారం ఎదురు దెబ్బ తగిలింది. ఆయనను పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్) పార్టీ అధ్యక్ష పదవికి అనర్హుడిగా సుప్రీంకోర్టు ప్రకటించింది. ఎన్నికల చట్టం, 2017 ప్రకారం దాఖలైన పిటిషన్లపై విచారణ అనంతరం ఈ తీర్పు వెలువడింది. రాజ్యాంగంలోని అధికరణలు 62, 63 ప్రకారం అర్హులు కానివారు, రాజకీయ పార్టీ అధ్యక్ష పదవిని నిర్వహించేందుకు కూడా అనర్హులేనని స్పష్టం చేసింది. అనర్హుడైన వ్యక్తి పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టడానికి, నిర్వహించడానికి వీల్లేదని తెలిపింది. పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయన తీసుకున్న నిర్ణయాలన్నిటినీ రద్దు చేసింది. సెనేట్ ఎన్నికలకు షరీఫ్ అభ్యర్థులను ఎంపిక చేసి, జారీ చేసిన టిక్కెట్లు రద్దవుతాయని పేర్కొంది. సెనేట్ ఎన్నికలకు అభ్యర్థులను తిరిగి ప్రకటించాలని ఆదేశించింది. ఈ ఎన్నికలు వచ్చే నెలలో జరుగుతాయి. పార్టీ అధ్యక్షుల కాలమ్ నుంచి నవాజ్ పేరును తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది.

లండన్‌లో ఉన్మాది వీరంగం

- ఇద్దరు మృతి

లండన్ : బ్రిటన్ రాజధాని లండన్‌లో ఓ ఉన్మాది వీరంగం సృష్టించాడు. తనకు ఎదుటపడ్డ వారిని లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డాడు. ఉన్మాది దాడిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను అబ్దీకరీమ్ హస్సన్(17), సాదిక్ అదాన్ మొహ్మద్(20)గా గుర్తించినట్టు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితున్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ ఏడాదిలో ఉన్మాదుల దాడులు పెరిగిపోయినట్టు బ్రిటన్ నేర విభాగం పేర్కొన్నది. లండన్ నగరంలో జనవరి 1నుంచి ఫిబ్రవరి 21నాటికి కత్తులతో ఉన్మాదుల దాడుల ఘటనలు 18 జరిగినట్టు తెలిపింది. ఈ దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు తెలిపింది.

ఇజ్రాయిల్ అక్రమ నిర్మాణాలు ఆపేయాలి : ఐరాస

న్యూయార్క్ : పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఇకనైనా ఆపేయాలని ఐరాస ప్రతినిధి నికొలయ్ లెద్‌నొవ్ పేర్కొన్నారు. అక్రమ ఆవాసాల నిర్మాణానికి సంబంధించి ఇజ్రాయిల్ కార్యకలాపాలు కొనసాగించడాన్ని ఆయన ఖండించారు. భద్రతా మండలికి నెలవారీ ఇచ్చే నివేదికలో ఆయన ఈ విషయాలు పేర్కొన్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఆవాసాల నిర్మాణ కార్యకలాపాలు పూర్తిగా చట్టవిరుద్ధమని ఐరాస అభిప్రాయపడుతోందని ఆయన పునరుద్ఘాటించారు. ఇవన్నీ కూడా శాంతికి తీవ్ర అవరోధంగా మారాయని పేర్కొంటూ తక్షణమే ఇజ్రాయిల్ ఈ విధానాలను నిలుపుచేయాలని డిమాండ్ చేశారు.

కంది, శనగ రైతుల ఆందోళన

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రాస్తారోకోలు

- మద్దతు ధర కోసం వనపర్తిలో ధర్నా
- ట్రాఫిక్‌లో చిక్కుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్


వనపర్తిలో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే చిన్నారెడ్డి

నవతెలంగాణ-బోధన్‌రూరల్/వనపర్తిటౌన్

మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కంది, వేరుశనగ రైతులు బుధవారం నిజామాబాద్, కామారెడ్డి వనపర్తి జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ జిల్లా బోధన్, రెంజల్ మండలాల్లో అఖిలపక్ష నాయకులు ఆందోళనకు దిగారు. కందుల కొనుగోళ్లు నిలిపేశారని రైతులు కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో రాస్తారోకో చేశారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతులు మద్దతు ధర కోసం ధర్నా నిర్వహించారు. శనగ పంట చేతికొచ్చి 15 రోజులు దాటిందని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర గ్రామం వద్ద రైతులు రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న బోధన్ రూరల్ ఎస్సై అశోక్‌రెడ్డి అక్కడికి వచ్చి రైతులను సముదాయించేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఏఓ వెంకటేశ్వర్లు వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడి నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. రాస్తారోకో సమయంలో మహారాష్ట్రకు వెళ్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. రైతులు దారి ఇవ్వకపోవడంతో కలెక్టర్ కారు దిగి సాలూర బస్టాండ్ వరకు నడుచుకుంటూ వెళ్లారు. రైతుల ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు అల్లే రమేష్, అఖిలపక్ష నాయకులు, ఎంపీపీ గంగాశంకర్ సంఘీభావం తెలిపారు.

శనగ పంట అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రెంజల్ మండలం సాటాపూర్ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు బైఠాయించారు. ఒక్కో రైతు నుంచి కేవలం హెక్టారు శనగ మాత్రమే కొనుగోలు చేస్తున్నారని పలువురు తెలిపారు. గంటసేపు రాస్తారోకో చేయడంతో ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలతో పాటు 40 మంది పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఉప తహసీల్దార్ ఆనంద్‌కుమార్ జేసీ రవీందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కామారెడ్డి జిల్లా మద్నూర్ మార్కెట్ యార్డులో కంది కొనుగోళ్లు నిలిపేయడంతో రైతులు బుధవారం మార్కెట్ యార్డు ఎదుట ఉన్న 161 జాతీయ రహదారిపై బైఠాయించారు. గోనె సంచుల్లేకనే కొనుగోళ్లు నిలిపివేశామని మద్నూర్ సింగిల్‌విండో కార్యదర్శి బాబురావు తెలిపారు. అయితే వచ్చే నెల 7వ తేదీ వరకే కొనుగోలుకు అవకాశమున్నదని, గోనె సంచులు వెంటనే తెప్పించాలని రైతులు భీష్మించారు.

వనపర్తి జిల్లాలోనూ వేరుశనగ రైతులు మద్దతు ధర కోసం వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రూ.5 వేల మద్దతు ధర ప్రకటించేంత వరకూ కదిలేది లేదని భీష్మించారు. వీరి ధర్నాకు వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న జేసీ నిరంజన్‌రావు అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా రూ.4450 మద్దతు ధర కల్పిస్తామని హామీనిచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. అంతకు ముందు ఎమ్మెల్యే చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులను దళారులు మోసం చేస్తున్నారని అన్నారు. వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో 54,336 ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని చెప్పారు. వేరుశనగకు మద్దతు ధర రూ.5 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకరప్రసాద్, బీజేపీ నాయకులు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

బీసీల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం

- ఉద్యోగాల కోసం 8 లక్షల మంది ఎదురుచూపు
- పాలమూరు నుంచి 16 లక్షల మంది వలస : తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ రాములు


మాట్లాడుతున్న రాములు

నవతెలంగాణ-వికారాబాద్ రూరల్

తెలంగాణలో బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య రంగాల్లో వెనుకబాటు తనంపై క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేస్తున్నామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ ఎస్‌వి రాములు అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బీసీల వెనుకబాటుతనంపై కొన్ని ప్రాంతాల్లో పర్యటించి అధ్యయనం చేశామన్నారు. పాలమూరు జిల్లాలో అత్యధికంగా వలసలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 16 లక్షల మంది దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు వలస వెళ్లినట్టు తమ పరిశీలనలో తేలిందని చెప్పారు. వలస వెళ్లిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వారి పిల్లలకు సరిగ్గా ఇంటి దగ్గర తిండిలేదని, ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసినట్టు కమిషన్ దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన మిషన్‌కాకతీయ పనులతో రెండు లక్షల మందికి గ్రామాల్లో ఉపాధి కల్పించినా, ఇంకా 14 లక్షల మంది వలసపోయారని అన్నారు. కొందరు స్వదేశానికి రావడానికి కిరాయి డబ్బులు కూడా లేక అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ఏజెంట్ల మోసాల వల్ల నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లి అక్కడి జైళ్లలో చాలామంది మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 8 లక్షల మంది ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తున్నారని చెప్పారు. 89 శాతం బీస్సీలు ఉన్న తెలంగాణలో 75 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి అవసరం ఉందని అన్నారు. బీసీ కమిషన్ ఈ దిశగా ప్రభుత్వానికి నివేదిక అందజేయనుందని చెప్పారు. బీసీల్లో అనేక మంది కులవృత్తుల వారు ఉన్నారని, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించనుందని చెప్పారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో పాటు మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 119 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినా ఆశించిన స్థాయిలో విద్యార్థులకు విద్యాబోధన జరగడం లేదని చెప్పారు. తెలంగాణలో బీసీ 112 కులాలు ఉన్నాయని, అందులో కొందరు స్థిరంగా ఉండి జీవనోపాధి గడిపితే, మరికొందరు సంచార జాతులుగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు కృష్ణమోహన్ రావు, ఆంజనేయులు, టీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలతరెడ్డి, ఎఎస్‌డబ్ల్యుఓ స్వామి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలు

- అమరుల స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం



నవతెలంగాణ-అర్వపల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం అన్నారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన కమ్యూనిస్టు అమరుల స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఎల్ఎఫ్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములు మాట్లాడారు. రైతులు పత్తి వేయొద్దని, కంది పంటలను వేసుకోవాలని చెప్పిన టీఆర్ఎస్ ప్రభుత్వం కంది పంటను పండించిన రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. కౌలు రైతులకు కూడా ఎకరాకు రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు ఎల్లంల అవిలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పట్టిపెల్లి సైదులు, సీఐటీయూ జిల్లా నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు పాల్గొన్నారు.

బస్సుయాత్ర చేస్తామంటే ఎందుకంత భయం?

- టీఆర్ఎస్‌కు టీపీసీసీ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్ర చేస్తామని ప్రకటించగానే టీఆర్ఎస్ నాయకులు ఇష్టమెచ్చినట్టు విమర్శలు చేస్తున్నారని, బస్సుయాత్ర అంటే ఎందుకంత భయపడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి నగేష్ ముదిరాజ్ ప్రశ్నించారు. బస్సుయాత్ర ప్రకటన టీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి నిరోధక బస్సుయాత్ర అంటూ టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అసత్యాలు మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో సచివాలయానికి రాని ముఖ్యమంత్రిగా కేసీఆర్‌కే ఆ పేరు దక్కిందన్నారు. కేసీఆర్ చేయించిన సర్వేలలోనే ఆ పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తున్నాయని, అందుకే బస్సుయాత్రపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని, కమీషన్ల కోసం కాంట్రాక్టులు ఇచ్చిన లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఇవన్నీ బస్సుయాత్రలో ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

జంప్ జిలానీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి

- మా కార్యకర్తల జోలికొస్తే సహించం : జానా

నవతెలంగాణ - అడవిదేవులపల్లి

రాజకీయ ప్రయోజనాల కోసం, ఆర్థిక లావాదేవీల కోసం ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలోకి వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకుండా ప్రజలే బుద్ధి చెప్పాలని సీఎల్పీ నేత జానారెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం అడవిదేవులపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలపై కొందరు టీఆర్ఎస్ నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు కావడం లేదన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల్లో భారీ అవినీతి జరుగుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దామరచర్ల మండలంలో సుమారు పది వేల ఇండ్లను నిర్మించిందన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకొచ్చి నాలుగేండ్లవుతున్నా ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు.

ఒకరిని రక్షించబోయి... మరో ఇద్దరు

మృత్యువులోనూ వీడని స్నేహం

- పెండ్లికెళ్లి చెరువులో పడి ముగ్గురు మృతి
- మాందారిపేట, కొత్తవాడలో విషాదఛాయలు

నవతెలంగాణ-శాయంపేట

వారు ముగ్గురూ స్నేహితులు. పెండ్లికి వెళ్లారు. కాలక్షేపం కోసం చెరువు వద్దకెళ్లారు. అందులో ఒకరు ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతున్న స్నేహితుడిని రక్షించ బోయి అతనితోపాటు మిగతా ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన వరంగల్ రూరల్ జిల్లా శాయంపేట మండలం మాందారిపేటలోని గోగ్గుంట లో బుధవారం జరిగింది. ముగ్గురి మృతితో ఘటనా స్థలం మాందారిపేటలో, స్వస్థలం వరంగల్ నగరం లోని కొత్తవాడలో విషాదఛాయలు అలుము కున్నాయి.

ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం మాందారిపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నిమ్మల రమేష్ కూతురు వివాహం బుధవారం గ్రామంలో జరిగింది. రమేష్‌కు బంధువులైన వరంగల్ నగరంలోని కొత్తవాడకు చెందిన ఆలేటి విజయ-స్వామి దంపతులు వచ్చారు. వీరితో పాటు వీరి కుమారుడు ఆలేటి సునిల్(22), కొత్తవాడకు చెందిన రంగు సాయికృష్ణ(20), దేవులపల్లి వంశీ (18)లతో కలిసి వివాహానికి వచ్చారు. వివాహం పూర్తయిన తర్వాత సాయంత్రం వేళ గ్రామ శివారులోని గోగ్గుంట చెరు వులోకి సునిల్ స్నేహితులతో కలిసి వెళ్లారు. స్నేహి తుడు దేవులపల్లి వంశీ చెరువులోకి దిగాడు. అతనికి ఈత రాకపోవడం చెరువు లోతుగా ఉండటంతో మునిగిపోతూ కేకలు వేశాడు. గమనించిన స్నేహి తులు రంగు సాయికృష్ణ, ఆలేటి సునిల్ కలిసి అతన్ని కాపాడే ప్రయత్నం చేశారు. వారికీ ఈత రాకపోవడంతో చెరువు లోతుగా ఉండటంతో ముగ్గురు కూడా చెరువులో మునిగి మృతిచెందారు. విషయం తెలుసు కున్న గ్రామస్తులు బంధువులు పెద్దసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. గ్రామస్తు లు చెరువులోకి దిగి మృతదేహాలను బయటకు తీశారు.

పరకాల ఏసీపీ వైవీఎస్ సుధీంద్ర, సీఐ షాదుల్లా బాబా, శాయంపేట, దామెర ఎస్ఐలు రాజా బాబు, మోహన్‌బాబు ఘటనాస్థలాన్ని పరిశీలించా రు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. తోటి మిత్రులను విచారించారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం పరకాలకు తరలించారు.

పాతమేట్లను యథావిధిగా కొనసాగించాలి

గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కమిషనర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

- పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న పాతమేట్లను యథావిధిగా కొనసాగిం చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి చేసింది. కూలీలకు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం లో జాయింట్ కమిషనర్ సైదులుకు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇందులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ఉపాధ్యక్షురాలు బి.పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై సుదీర్ఘంగా చర్చిం చారు. పాతమేట్లను తొలగిస్తూ సర్క్యులర్ నెంబరు 1786 రద్దు చేయాలని కోరారు. 20 రకాల పనులు చేస్తున్న మేట్లను ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించాలని సూచించారు.

అవినీతిపేరుతో జాబ్‌కార్డు ను ఒకటి నుంచి మూడేండ్లపాటు రద్దు చేయాలనే నిర్ణయం చట్టవ్యతిరేకమైందని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ, మున్సిపల్, నగర పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలని, పనులు క్యాలెండర్‌తో సంబంధంతో లేకుండా, అడిగినప్పుడల్లా చూపిం చాలని కోరారు. పని జరిగిన మరుసటి రోజునే సామాజిక ఆడిట్‌ను నిర్వహించాలని చెప్పా రు. అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని వివరించారు. చట్టం ప్రకారం కచ్చితంగా పనులు ఇవ్వాలని, పనిలేనిచోట నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. కోరిన ప్రతికుటుంబానికి పని కల్పించాలని, పనిదినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, రోజూ కూలీ వేత నం రూ. 300కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మనుషులు చేయలేని పనుల పేరుతో యంత్రాలతో పనులు చేయించాలని కేంద్రం నిర్ణయించడాన్ని తప్పుబట్టారు.



మనిషి ప్రతిభాపాటవాలు, సూర్యకిరణాల్లా విస్తరిస్తాయి. అవి కేంద్రీకృతమైతే ప్రకాశిస్తాయి. - వివేకానంద


సంపాదకీయం

టీఆర్ఎస్ అంతర్మథనం

తెలంగాణ రాష్ట్రసమితికి ఎన్నికల జ్వరం మొదలైంది. పైకి ఎన్ని డాంబికాలు పలికినా కారు గుండెల్లో కొంత గుబులు మొదలైంది. నాయకత్వం సర్వేల మీద సర్వేలు చేయించటం దాని ఫలితమే. వందసీట్లు మావేనన్న సర్వే ఉత్తుత్తిదేనని ఎవరికైనా సులభంగానే అర్థమవుతుంది.

ఈ పరిస్థితిలో అసంతృప్తి ఏకపక్షంగా కాంగ్రెసు వైపు పోయే అవకాశం లేదని కాంగ్రెసు నేతలకు అర్థమైంది. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఒకవైపూ, కోదండరామ్ ఒకవైపూ పావులు కదుపుతున్నారు. కోదండరామ్ ఏమేరకు కాంగ్రెసుకు దగ్గరైతే.. ఆ మేరకు ఆయన ప్రతిష్టకు నష్టం జరుగుతుంది. ఆ మేరకు బీఎల్ఎఫ్ మెరుగుపడవచ్చు.

జనం కోసం చెప్పే సర్వేల ఫలితాలు ఎట్లున్నా, అంతర్గత సమీక్ష కోసం చేయించుకుంటున్న సర్వేలు నిజం చెబుతున్నాయి. సుమారు నలభై మంది శాసనసభ్యులతో బాటు, సగం మంది మంత్రుల భవిష్యత్ ప్రశ్నార్థకమేనని ముఖ్యమంత్రి చేయించిన సర్వేలో వెల్లడైంది. అధికారయుతంగా, ఈ సర్వే ఫలితాలు ప్రకటించకపోయినప్పటికీ, ముప్పు తప్పదనుకున్న నేతలు ఉప్పందిస్తున్నారు. ఆపరేషన్ ఆకర్ష్‌తోనే అన్నీ గుప్పిట్లోకి వస్తాయనుకున్న నాయకత్వానికి ఇది ఆందోళన కలిగించే విషయమే. పైగా ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ క్షేత్రస్థాయిలో అడుగు జారుతున్న విషయం ఆందోళన కలిగించటంలో ఆశ్చర్యం లేదు. ప్రతిష్ట పడిపోవటం మొదలైన తర్వాత, సాధారణంగా దాని వేగం పెరుగుతుందే తప్ప తగ్గదు. ఇప్పుడు టీఆర్ఎస్ నాయకత్వం ముందున్న ప్రత్యామ్నాయాలు రెండే. దిగజారుతున్న పరిస్థితి వేగం తగ్గించటం లేదా ఆశలు వదులుకోవటం. అంతా బ్రహ్మాండంగా ఉన్నదని చెప్పే మాటలు పైపై మాటలే. అందుకే అంతర్మథనం మొదలైనట్టున్నది. రైతు రుణమాఫీ గానీ, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రకటించిన సహాయం కానీ ఏ మేరకు రాజకీయంగా ఉపయోగపడ్డాయో ఆరా తీశారు. అవి అంతగా ఉపయోగపడలేదన్న సమాచారం నాయకత్వానికి రుచించి ఉండకపోవచ్చు. ఇప్పుడు పెట్టుబడి పథకంతో ఏమేరకు ప్రయోజనం పొందవచ్చో బేరీజు వేస్తున్నారు.



టీఆర్ఎస్ అడుగులు జారుతున్న పరిస్థితి కేవలం రుణమాఫీ లేదా ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు అందించే సహాయానికి పరిమితం చేసి చూస్తే పరిష్కారం కాదు. విత్తనం దగ్గరి నుండి పంట అమ్ముకునే వరకు ఏ దశలోనూ రైతును ఆదుకునే స్థితిలో కేంద్ర, రాష్ట్ర పాలకులు లేరు. ఆత్మహత్యలు చేసుకోవల్సిన అవసరం లేకుండా చూడాలన్న స్పృహ లేదు. పాలకుల మాటలు నమ్మి పంటలు మార్చిన రైతులు కూడా గిట్టుబాటుధర రాక, ప్రభుత్వం కొనుగోలు చేయక, దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరోవైపు కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న వాగ్దానం ఇప్పట్లో ఆచరణ రూపం దాల్చటం సాధ్యం కాదని అర్థమవుతున్నది. ఆ ప్రాజెక్టుల పేరుమీద భూములు కోల్పోయే రైతుల బాధలు మాత్రం తప్పటం లేదు. నీళ్ళు, నిధులు, నియామకాలన్న నినాదం తెలంగాణ జనాన్ని కదిలించింది. నిధులున్నాయని చెపుతూనే ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదు. నియామకాల కోసం ఎదురుచూస్తున్న యువత, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నది. కోచింగ్ సెంటర్ల యజమానులు కోట్లు కూడబెడుతున్నారు. ఉద్యోగాలు మాత్రం రాలేదు. పోస్టులు ప్రకటించటం, నోటిఫికేషన్ జారీలు, కోర్టు వివాదాలతో ఆగిపోవటం ప్రహసనంగా మారింది. ఆశలు చూపటమే తప్ప అమలు దాఖలాలు లేవు.

డబుల్ బెడ్రూం ఇండ్లు, గొర్రెల పథకాలు చూపించి ఓట్లడగవచ్చునన్న నమ్మకంతో ఉన్నారు. కానీ ఆ పథకాలు ప్రభుత్వాన్ని కాపాడగల స్థితిలో ఉన్నాయా అన్నది సందేహాస్పదం. అందుకే అంతర్గత సర్వేల ఫలితాలు పాలకులకు గుబులు పుట్టిస్తున్నట్టున్నాయి. ప్రజల పట్ల నిబద్ధత, చిత్తశుద్ధి లేకుండా కేవలం 'ఆపరేషన్ ఆకర్ష్'తో నేతలను ఆకర్షించవచ్చునేమో గానీ, ప్రజలను ఆకర్షించటం అన్ని సందర్భాలలో సాధ్యం కాకపోవచ్చు. ఈ సందేహమే ఇప్పుడు ప్రభుత్వాన్ని పీడిస్తున్నది. పార్టీ ప్రతిష్ట దిగజారడానికి కారణం కొందరు మంత్రులు, శాసనసభ్యుల వైఫల్యమేనని చెప్పడానికే ఈ సర్వేలన్న గుసగుసలు కూడా నడుస్తున్నాయి. కానీ ఈ వాదనను పరాయివారే కాదు, తన వారు కూడా ఒప్పుకోరు. ముఖ్యమంత్రి ఎవ్వరినీ స్వతంత్రంగా పనిచేయనివ్వలేదన్న అపవాదు ఇప్పటికే మూటగట్టుకున్నారు. మంత్రులు తమ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించే అవకాశం ఇవ్వలేదనీ, తమ కాళ్ళకు బంధాలు వేశారనీ అసంతృప్తితో ఉన్నమాట నిజం. శాసనసభ్యుల పరిస్థితి మరీ దీనంగా ఉన్నది. మంత్రులకే ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేనప్పుడు, వీరి పరిస్థితి ఎవరికి చెప్పుకుంటారు? శాసనసభ స్థానాలు పెరిగితే, ఇతర పార్టీల నుండి టీఆర్ఎస్ గూటికి చేరిన వారందరినీ సంతృప్తి పరిచి కొంత గట్టెక్కవచ్చు ననుకున్నారు. కేంద్రంలో మోడీ మాత్రం ఈ విషయం తేల్చటం లేదు. తమ ప్రయోజనం గురించి లెక్కలు వేసుకుంటున్నారు. ఇప్పుడు శాసనసభ స్థానాలు పెరగనట్టయితే మరో సమస్య. అందరికీ సీట్లివ్వటం సాధ్యం కాదు. వచ్చిన వారు తిరిగి పోతారు. లేదా కొత్తనీరు పేరుతో టిక్కెట్లిస్తే, పాతవారు తిరగబడతారు. ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టున్నది టీఆర్ఎస్ పరిస్థితి.

ఈ పరిస్థితిలో అసంతృప్తి ఏకపక్షంగా కాంగ్రెసు వైపు పోయే అవకాశం లేదని కాంగ్రెసు నేతలకు అర్థమైంది. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఒకవైపూ, కోదండరామ్ ఒకవైపూ పావులు కదుపుతున్నారు. కోదండరామ్ ఏమేరకు కాంగ్రెసుకు దగ్గరైతే.. ఆ మేరకు ఆయన ప్రతిష్టకు నష్టం జరుగుతుంది. ఆ మేరకు బీఎల్ఎఫ్ మెరుగుపడవచ్చు. కోదండరామ్ పెట్టబోయే పార్టీ బీఎల్ఎఫ్‌తో సఖ్యత వైపు ఆలోచించగల్గితే రాష్ట్ర రాజకీయాలలో మలుపును ఎవరూ ఆపలేకపోవచ్చు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ పరిస్థితిలో స్పష్టత రావచ్చు.

అమరవీరుల వైభవోజ్వల సాహసగాథ మేడే



ఆర్. సుధాభాస్కర్

"శ్రామిక వర్గంలో అమితమైన అసంతృప్తి పేరుకొని ఉన్న ఈ సమయంలో అమెరికా అంతటా రహస్య శ్రామిక సమాజాలు నిర్మితమౌతున్నాయి. రైలు రవాణా సంస్థలకు, ఇతర కార్పొరేషన్లకు మేము సూచించేదేమంటే మీ స్వంత ఉద్యోగుల్లో పథకం వేయగలిగే వారిని సునిశితంగా పరిశీలిస్తూ ఉండండి వీరే... ఈ సంఘాలలో చేరవల్సిందిగా ఉద్యోగులని ప్రోత్సహిస్తూ, చివరకు సమ్మెకు కారణమౌతున్నారు. ఇదంతా తరచూ జరుగుతూండేదే. ముఖ్య నాయకులను కనిపెట్టి వారి పట్ల సకాలంలో చర్యలు తీసుకునేట్టయితే ముమ్ముందు ఎదురుకానున్న ఇబ్బందులను తొలగించుకోవచ్చు" పింకర్టన్ గూఢచారి సంస్థ 1885 అక్టోబర్‌లో అన్ని కంపెనీలకు రాసిన లేఖ ఇది.

ఈ పుస్తక పరిచయం ఈ కొటేషన్‌తోనే ఎందుకు ప్రారంభించానంటే ఆ నాటి స్థితికి ఇది నిలువెత్తు నిదర్శనం. ఈ పుస్తకం మనం అధ్యయనం చేస్తే కార్మికులపైన, కార్మిక సంఘాలపైనా ఎటువంటి నిర్బంధం ఉండేదో అర్థమౌతుంది. అదీ మన లాంటి వెనకబడిన, ఫ్యూడల్ సంబంధాలు బలంగా ఉన్న, పెట్టుబడిదారీ దేశంలో కాక ఆధునిక పెట్టుబడిదారీ దేశంగా (1885లో) ఎదుగుతున్న, ఎదిగిన అమెరికాలో తామే సిసలైన ప్రజాస్వామ్య విలువలకు పవర్ ఆఫ్ అటార్నీ పుచ్చుకున్న పట్టాదారులమని చెప్పుకునే అమెరికాలో జరిగింది. పూర్తి వర్గ దృక్పథంతో రాయబడ్డ ఈ పుస్తకం చదువుతున్నంతసేపు పెట్టుబడిదారీ విధానమంటే ద్వేషం మనల్ని ఆవహిస్తుంది.

"మేడే - అమరవీరుల వైభవోజ్వల గాథ" చదివేవారు ముందుగా ఎం.కె.పాంథే ముందుమాట చదవాలి. మేడేలోని "విప్లవాంశాన్ని విస్మరించి కేవలం మొక్కుబడిగా జరుపుకునే" ధోరణి పెరుగుతున్న నేటి దశలో ఈ పుస్తక పఠనం తప్పనిసరి. అయితే భారత దేశంలో సంఘటిత రంగంలోని (పబ్లిక్, ప్రయివేట్) ఫ్యాక్టరీల్లో తప్ప 8 గంటల పని విధానం దాదాపు పోతున్న లేదా పోయిన దశలో 8 గంటల పనిదినం కోసం అదీ సుదూర దేశం అమెరికా (చికాగో)లో జరిగిన "వైభవోజ్వల సాహసగాథ" పునఃశ్చరణ అవసరమా? అని కొందరు ఆశ్చర్యపోవచ్చు. పెట్టుబడి ఏలుబడిని వ్యతిరేకించడం దేశ దేశాల్లోని కార్మికులు తమ అనుభవంలో నుండి నేర్చుకున్నారు. ఆడాడి మళ్ళీ విశ్వవ్యాపితమౌతున్న నేటి దశలో ఆ "వీరగాథ" చదువుకోవడానికే కాదు. ఆచరణకు సిద్ధం చేయడానికే ఈ పుస్తకం. ఇక్కడొక విషయం గమనార్హం. అధిక పనిగంటలు పెట్టుబడిదార్ల జేబులు నింపుతున్నాయి తప్ప తమ జీవితాలను మెరుగు చేయటంలేదని అర్థం చేసుకుంటున్న కార్మికులు అన్ని దేశాల్లోను పోరాడారు. చికాగో ఘటనకు సరిగ్గా 26 ఏండ్ల ముందు, 1862లో హౌరా రైల్వే కార్మికులు 8 గంటల పనిదినం కోసం సమ్మె చేశారని ఎందరు ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు తెలుసు? పని గంటల తగ్గింపు కోసం పోరాటమంటే పెట్టుబడిదారుల లాభాలపై యుద్ధమే!

హేమార్కెట్ ఉదంతం చికాగోలోనే ఎందుకు జరిగింది? అనేది ముఖ్య విషయం. 1880 నాటికే చికాగో ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో అగ్రగామిగా నిలిచింది. అది పెద్ద పారిశ్రామిక, వ్యాపార కేంద్రం. వివిధ దేశాల నుండి పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం ఆ రోజుల్లో ఈ "కొత్త భూమి" (అమెరికా)లో కాళ్ళూనడం ఆనవాయితీ. (క్రిష్టఫర్ కొలంబస్ అమెరికా ఖండాన్ని కనుగొన్న తర్వాత అప్పటికే పారిశ్రామికవంతమైన ఐరోపా నుండి పెద్ద ఎత్తున వలసలు-ముందు ధనికులు, వారి వెంట సామాన్య జనం వెళ్ళారు. స్థానికుల్ని ఊచకోత కోయడం ద్వారా భూములు సంపాదించుకున్నారు. కొందరు ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. వాటిలో ఉపాధి పొందడానికి రెండు, మూడు శతాబ్దాల పాటు వలసలు జరిగాయి. పెట్టుబడిదారీ విధాన ప్రారంభ దినాల్లో తీవ్రంగా ఉన్న నిరుద్యోగం ఈ పరిణామం తరువాత ఐరోపాలో నియంత్రణలో ఉండటానికి ఇదొక కారణం.) కొత్త పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధిచెందుతున్న చికాగోలో బోహీమియా, చెక్, పోలెండ్, ఐర్లండ్ మొదలైన దేశాల నుండి వలసలు జరిగాయి. జర్మన్లు, ఐరిష్ జాతీయులు సంఘటితమై అమెరికన్లవలె తమకూ హక్కులు కావాలని అడగడం మొదలిడగానే చెక్, బోహీమియా దేశస్తులను స్థానిక పెట్టుబడిదారులు వారికి వ్యతిరేకంగా నిలబెట్టారు. అయినా జరుగుతున్న దోపిడీ కార్మికుల్ని ఐక్యమే చేసింది.

ఐక్యమౌతున్న కార్మికులు కలుసుకోకుండా ఉండేందుకు ముఖ్యంగా ఆదివారాలు, సెలవు దినాల్లో బీర్ షాపులను, గెస్ట్‌హౌస్‌లను మూసివేయాలని నిర్ణయించారు. వాక్, సభ స్వాతంత్రాలని అడ్డుకోవడం వారి రాజ్యాంగం ప్రకారం సాధ్యం కాదు. కాబట్టి కార్మికులు కలవకుండా నగర యంత్రాంగం దీనికి ఒడికట్టింది. అయినా కార్మికులు కలుసుకున్నారు. సంఘటిత మయ్యారు. పోరాడారు. 1872 జరిగిన "రొట్టెల దొమ్మి" ఆనాటి పరిస్థితికి నిలువెత్తు నిదర్శనంగా చరిత్రలో నమోదైన ఘటన. శీతాకాలంలో బ్రెడ్ కూపన్ల కోసం వెళ్ళిన వేలాది మందిని ఒక బిలంలోకి మందగా తోలి విపరీతంగా కొట్టారు పోలీసులు. ఆర్థిక వ్యవస్థలో ఎగుడు, దిగుడులు కార్మికుల బతుకుల్ని దెబ్బతీశాయి. కార్మికుల జీతంలో ఎక్కువ భాగం తిండికే ఖర్చవుతోందని 1880 బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ పేర్కొంది. ఆనాడు జరిగిన ట్రామ్‌ల సమ్మె, రైల్వే సమ్మె లాంటివి, వాటిపై జరిగిన పోలీసు దమనకాండ మొదలైనవన్నీ ఈ పుస్తకంలో వివరించారు రచయిత.

పని గంటల తగ్గింపు పోరాటం అమెరికాలో ఆండ్రూ జాక్సన్ అధ్యక్షుడుగా (1829-37) ఉన్న కాలం నుండి సాగుతోంది. 10, 12 గంటల పని దినం సాధించుకున్నాక బహుశ చికాగోలోనే 8గంటల పని దినం కోసం పోరాటం రూపుదిద్దుకుంది. 1867లో జరిగిన ఉద్యమం విఫలమైంది. ఆ ఉద్యమంలో కీలక పాత్ర మెకార్మిక్ కర్మాగార కార్మికులదే. 1886 ఉద్యమంలోనూ అదే మెకార్మిక్ కార్మికులదే! పట్టుదలగా రెండు దశాబ్దాల పాటు పోరాడిన ఆ కార్మికులు అభినందనీయులు కదా!

నేడు ప్రపంచ శక్తుల బలాబలాల్లో తాత్కాలికంగానైనా పెట్టుబడికి అనుకూలంగా మార్పు వచ్చింది. మన దేశంలో మోడీ సర్కార్ ప్రతిష్ఠితమవడం దానిలో భాగమే. కొన్ని కార్మిక చట్టాలు మార్చారు. కొన్ని మార్చబోతున్నారు. ప్రధానంగా బలైనవి పని గంటలే! విస్తృతంగా పెరిగిన కొరియర్ సర్వీసులు, క్యాబ్‌లు, టూరిస్టు బస్సుల్లో పని చేసే సిబ్బందికి, ప్రభుత్వ శాఖల్లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇంకా అనేక క్యాటగిరీల వారికి పని గంటలే లేవు. కార్పొరేట్ ఆస్పత్రులతో సహ ప్రయివేట్ ఆస్పత్రులు, విద్యాలయాలు, అన్ని రకాల సెక్యూరిటీ సిబ్బందికి, సర్వవ్యాపితమైన కాంట్రాక్టు కార్మికులకు మొదలైనవారికి 12 గంటల పని విధానం అమల్లోకొచ్చింది. ఏదో ఒక కొలువు దొరికిందిలే, హక్కులడిగితే అదీ మిగలదేమోనన్న భయం మన యువతను వెన్నాడటమే నేటి ఈ స్థితికి కారణం.

> **పశ్చిమ దేశాల్లో కార్మికులు ఏ విధంగా స్పందించారో ఈ పుస్తకంలో వివరంగా రాశారు ప్రొ॥విలియం అడెల్మెన్. 1912లో "ఈ మేడే నుండి నేను 8 గంటలకంటే ఎక్కువ పనిచేయను, మరినువ్వో?" అన్న ప్రశ్నతో వేలాది కరపత్రాలు, పోస్టర్లతో అమెరికా, కెనడాల్లో కార్మికులు ఆందోళన చేశారు. ఈ పుస్తకంలో యాజమాన్యాల దాడి ఉంది. ప్రభుత్వాలు పెట్టుబడిదార్లతో షరీకైన తీరుంది. ఉద్యమాల ఓటమి గురించి ఉంది. ఓడి గెలవడం గురించి ఉంది. ఇక ఆలస్యమెందుకు పుస్తకాన్ని తెరవండి.!**

ఇది మారదా? ఈ కార్మికులు పోరాటాల్లోకి రారా? ఎందుకు రారు? దాదాపు అన్ని మహానగరాల్లో ఉబర్, ఓలా క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేయలేదా? గ్రామ సేవకులుగా (వీఆర్ఏ) చేరిన ఎంబీఏలు/ఎంసీఏలు తెలంగాణలో వారంతట వారే సమ్మె చేయలేదా? తిరుపతి గుడి పూజార్లు ఎర్రజెండాలు పట్టుకుని తిరుమలలో



ప్రదర్శనలు చేసి తమ హక్కులు సాధించుకోలేదా? బెంగుళూరు, విశాఖల్లోని మహిళా టెక్స్‌టైల్ కార్మికులు లక్షల్లో వారంతట వాళ్ళే ప్రభుత్వంపై తిరగబడలేదా?

దేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమం తన బలహీనతలను అధిగమించి అటువంటి స్పాంటేనియస్ ఉద్యమాల్లోకొచ్చిన కార్మికుల్ని ప్రభుత్వంపై మళ్ళించగలిగితే!!!

ఎక్కడైనా తెగనాడే వారి జాతంతా ఒకటేనని హేమార్కెట్ విమర్శకులు మరోసారి రుజువు చేశారు. పత్రికలు సంపాదకీయాలు రాశాయి. అల్బనీ లా జర్నల్ 1886 మే 15న "చాలా కాలంగా మనలో ఉన్న కోరికలు, అంటే వలసలు నిరోధించడం, దేశ బహిష్కరణ శక్తి, అత్యుత్తమ రీతిలో పోలీసులను సాయుధం చేయడం, అల్లర్లు తలెత్తిన వెంటనే (కార్మికుల హక్కులకై రోడ్లెక్కితే-ఆరెస్సీ) కఠినంగా వ్యవహరించడం వంటివి బలంగా పునఃప్రతిష్ఠించబడ్డాయి. మహానగరంలో ఉత్తములు, సాహసికులైన పురుషులు, అమాయక స్త్రీలు, పిల్లల జీవితాలకు రక్షణ, సంపద సంరక్షణ బాధ్యత పెద్ద జులపాలు పెంచుకున్న నాస్తికుల చేతుల్లో ఉండరాదు. ధనికుల పట్ల ఉన్మత్త పూరిత అసూయ కలిగి ఉండే విదేశీ నీచుల చేతిలో ఉండకుండా చూడాలి. ఇలాంటి విష సర్పాలు పడగ విప్పి కాటేయక ముందే వాటిని అణచగల చట్టాలు కావాలి. దేవుడు లేడనే ఈ దెయ్యాలను హంతకులుగా భావించి శిక్షించే శక్తి ఇల్లినాయిస్ రాష్ట్ర శిక్షాస్మృతికి ఉండాలి." (చికాగో ఈ రాష్ట్రంలో ఉంది.) వీళ్ళెవరు కమ్యూనిస్టులు కాదు, నాస్తికులు అంతకంటే కాదు.

అనేక ఆదివారాలు చర్చీల్లో ఈ "అరాజక వాదుల్ని" ఖండిస్తూనే ఉన్నారు. వ్యాపారస్తులు, పెట్టుబడిదార్లు కలిసి ప్రయివేటు సైన్యాన్ని సమీకరించారు. మన దేశంలో, రాష్ట్రంలోని పాలకులు ట్రేడ్ యూనియన్లను "అభివృద్ధి నిరోధకులు" అన్నట్లుగానే ఆనాటి పాలకులు నిందించారు. సారీ! వారిలాగే వీరూ తిట్టారు. తిట్లు కామన్. తిట్టబడే కార్మికులు, కార్మిక సంఘాలు కామన్. స్థల కాలల్లోనే తేడా!

సమస్యను దారి మళ్ళించడంలో పెట్టుబడిదారి విధానం ఘనాపాటీనే. 1894 అంటే హేమార్కెట్ స్క్వేర్ ఘటన జరిగిన ఎనిమిదేళ్ళకి ఆనాటి అమెరికా (22వ) అధ్యక్షుడు గ్రోవర్ క్లీవ్‌ల్యాండ్ ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ మొదటి సోమవారాన్ని "లేబర్ డే" గాను, ఆ రోజును జాతీయ సెలవు దినంగాను ప్రకటించాడు. ఇది మేడే ప్రాధాన్యతను తగ్గించడానికేనని వేరే చెప్పక్కర్లేదు. మన దేశంలో ఆర్ఎస్ఎస్/బిఎంఎస్‌లు చేసే విశ్వ కర్మదినం కూడా సెప్టెంబర్‌లోనే ఉంది. దేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఏ మాత్రం బలహీనపడ్డా మోడీ సర్కార్ విశ్వ కర్మ దినాన్ని (సెప్టెంబర్ 17ను) జాతీయ సెలవు దినంగా ప్రకటిస్తుంది. పని గంటల తగ్గింపునకై జరిగిన పెద్ద వర్గ పోరాటాన్ని కనుమరుగు చేసే ఈ ప్రయత్నాన్ని కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలి.

ఒక మిలిటెంట్ పోరాటం అణిచివేయబడ్డ తర్వాత ఏయే తరగతులు ఎలా ఏకమౌతాయో హేమార్కెట్ ఘటన ఒక నిదర్శనం. మన భాషలో చెప్పుకోవాలంటే సేట్లందరూ ఏకమైనారు. అటు చికాగో యంత్రాంగం ఇటు ఫెడరల్ (కేంద్ర) ప్రభుత్వ యంత్రాంగం అండ దొరికింది. కోర్టులు పచ్చిగా ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచాయి. బడా పత్రికలు వంతపాడాయి. తెలంగాణ సాయుధ పోరాటంపై సాగిన దుష్ప్రచారం, ఆ తర్వాత 1955 ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల్లో కమ్యూనిస్టులపై సాగిన దుష్ప్రచారం, చివరికి విద్యుత్ ఉద్యమం సందర్భంగా సాగిన దుష్ప్రచారం, 2010-16 మధ్య సార్వత్రిక సమ్మెల సందర్భంగా ట్రేడ్ యూనియన్‌లపై జరిగిన, జరుగుతున్న దుష్ప్రచారం మనం చూస్తూనే ఉన్నాం కదా!

రెండో పక్క కార్మికులు ఆ ఉద్యమానికి అండగా నిలిచారు. ఇంగ్లండులోని 49 నగరాల్లో కార్మిక వర్గం ప్రదర్శనలు చేసింది. జార్జి బెర్నార్డ్ షా (ప్రపంచ ప్రఖ్యాత కవి) "ఏ ఉద్యమమైతే కోట్లాది అణగారిన జీవుల నుంచి పుట్టుక వచ్చిందో, ఎవరైతే అనుక్షణం జీవించే హక్కు కోసం శ్రమిస్తూ, దారిద్ర్యంలో మునిగివున్నారో, వారు చేపట్టిన ఉద్యమాల్ని ఉరితీయడం ద్వారా అణగదొక్కగలమని మీరు భావిస్తే-మమ్మల్ని కూడా ఉరితీయండి. ఇక్కడ మీరు నిప్పు రవ్వను తొక్కివేసేట్లయితే, అక్కడా, ఇక్కడా, మీ ముందు, వెనుక ప్రతి చోట అగ్ని జ్వాలలు ఎగిసి పడతాయి. ఇది బడబాగ్ని. మీరు దీన్ని ఆర్పలేరు" అని గర్జించారు.

సెల్: 9490098025



డాక్టర్ చుక్కా రామయ్య

ఆకాంక్షలు ప్రతిబింబించని బడ్జెట్!

దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ఎంతో కీలకం. దీంతోనే ప్రభుత్వ ప్రాథమ్యాలు ప్రజలకు అర్థమవుతాయి. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక ఇది నాలుగో బడ్జెట్. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన అనేక ప్రజాకర్షక హామీలను నెరవేర్చేందుకు ఏవైనా కేటాయింపులు చేస్తారేమోననే ఆశ వారిలో ఉంటుంది. సగటు ఉద్యోగి కూడా తాము చెల్లించే పన్నులు తగ్గుతాయేమోనని ఎదురు చూస్తారు. అయితే, 2018- 19 సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు మాత్రం దేశ ప్రజల్ని నిరుత్సాహ పరిచాయి. 2016 డిసెంబర్‌లో ప్రధాని మోడీ తనదైన శైలిలో అకస్మాత్తుగా దేశంలో పెద్ద కరెన్సీ నోట్లను రద్దు, ఆ తర్వాత జీఎస్టీని ప్రజలపై రుద్దడం తదితర నిర్ణయాలతో సామాన్యుడు కుదేలయ్యాడు. కరెన్సీ నోటు దొరక్క, హొటల్‌కు వెళ్లి టిఫిన్ చేసినా జీఎస్టీ బాదుడుకు బెంబేలెత్తిపోయాడు. వాస్తవానికి, ఎన్నికల హామీల్లో ప్రకటించిన హామీల అమలు కన్నా తమకు తోచిన విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల నెత్తిన భారాలు మోపే విధానాలను ఎన్డీయే జోరుగా అమలుచేసుకుంటూ పోతోంది. ఇటీవలి బడ్జెట్ ప్రతిపాదిత కేటాయింపుల్లో అంకెల గారడీయే తప్ప వాస్తవికత ఎక్కడా కానరావడంలేదు. రైతు పైనా, వ్యవసాయంపైనా భారీగా కేంద్రీకరించినట్టు ఊదరగొడుతున్న ఈ ప్రభుత్వం.. వాస్తవికంగా గతేడాది కంటే తక్కువగానే కేటాయింపులు చేసింది. గతేడాది వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి జీడీపీలో 1.15 శాతం నిధులు కేటాయింపులు చేస్తే.. ఈ ఏడాది మాత్రం దాన్ని 1.08 శాతానికి తగ్గించేశారు.

రామయ్యమాట

విద్యకు 0.49శాతం నిధులు గతేడాది కేటాయింపులు చేయగా.. ఈ ఏడాది 0.45కి కత్తెర వేశారు. ఆరోగ్య బీమాకు 'మోడీ కేర్' అంటూ కొత్త పథకం ప్రకటించినా ఎక్కడా నిధుల కేటాయింపుల ఊసే లేకపోవడం ఈ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పాలి.

బ్యాంకుల్లో నేడు భారీ కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. వీటిపై ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మా హయాంలో కుంభకోణాలు జరగలేదంటూ కాంగ్రెస్‌పైకి నెట్టే ప్రయత్నాలే ఎన్డీయే చేస్తోంది తప్ప వాటిని బాధ్యతతో పరిష్కరించేందుకు చొరవ ప్రదర్శించేలా వ్యవహరించకపోవడం బాధాకరం. వేల కోట్లు బ్యాంకుల నుంచి తీసుకొని ఆనక దర్జాగా విదేశాలకు చెక్కేసిన విజయ్ మాల్యా, నీరవ్ మోడీ ప్రభుత్వాల అండ లేకుండానే దేశం దాటారంటే ప్రజలు విశ్వసించరు. ప్రజా ధనాన్ని కాపాడాల్సింది పోయి ప్రభుత్వాలు ఇంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తుండడాన్ని చూసి ప్రజలు బాధపడుతున్నారు. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతన్నకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వాలు, బ్యాంకులు పట్టించుకున్న దాఖలాలు కనబడటంలేదు. ఎందుకంటే బడా కార్పొరేట్ సంస్థలకు అడిగిందే తడవుగా కోట్లాది రూపాయలు కట్టబెడుతున్న మన బ్యాంకులు రైతులు పంటలు పండించుకొనేందుకు మాత్రం బ్యాంకులచుట్టూ తిప్పించుకుంటున్నారు. దీంతో విసిగివేసారిన రైతు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగుచేసే పరిస్థితులు దేశంలో షరామామూలైనా ప్రభుత్వాలు మాత్రం చూసీచూడనట్టే వ్యవహరిస్తున్నాయి. అప్పులు తీర్చలేక, కుటుంబ పోషణ కష్టమైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు మాత్రం కండ్లు తెరవవు. కంటితుడుపు చర్యగా పరిహారం ప్రకటించడం, ఆనక చేతులు దులుపుకోవడమే తప్ప ఓ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ లేదు. అలాగే దేశంలో నిరుద్యోగం విపరీతంగా విస్తరిస్తున్నా అందుకు సరైన నిర్ణయాలు గానీ, కేటాయింపులు గానీ చేయకపోవడం శోచనీయం.

ఏపీని ఆదుకుంటామని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. పాలకులు ఇచ్చిన మాటను తప్పితే ఇక ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం ఉంటుందా? సాక్షాత్తు ప్రధాని మోడీయే తిరుపతి, విజయవాడ బహిరంగ సభల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోతే ఇంతకన్నా దారుణం మరొకటి ఉంటుందా? విభజన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీల ఊసుకూడా కేంద్ర బడ్జెట్‌లో లేదు. ఇప్పటికే పలువురు రాష్ట్రమంత్రులు, సీఎం కేసీఆర్ కూడా అనేకసార్లు ఢిల్లీకి వెళ్లి నివేదించినా కేటాయింపులు మాత్రం చేయకపోవడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగే ప్రమాదం ఉంది.

-ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు.

వాస్తవాలను విస్మరించడం అవివేకమే...

వప్పల బాలచంద్రన్
సుధీంద్ర కులకర్ణి

జవహర్‌లాల్ నెహ్రూ పట్ల నరేంద్ర మోడీకి ఉన్న ద్వేషం, సర్దార్ వల్లభాయ్ పటేల్ పట్ల ఉన్న అభిమానం అందరికీ తెలిసిందే... కానీ ఒక వ్యక్తిపై ద్వేషం కానీ... అభిమానం కానీ... వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. రక్తంతో తడిసిన భారతదేశ విభజనకు కేవలం కాంగ్రెస్సే కారణమా? భారతదేశం విడిపోవాలని కాంగ్రెస్ కోరుకోలేదని వాస్తవాల పట్ల విశ్వాసంగా ఉండే రచయితలందరూ చెపుతారు. ఇండియాను, పాకిస్థాన్‌ను చివరకు విరోధులుగా మార్చే ఈ విభజన పాకిస్థాన్ ఆర్కిటెక్ట్ మహమ్మద్ అలీ జిన్నాకు కూడా ఇష్టం లేదు.

ముస్లింలకు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేసిన 'ద కమ్యూనల్ ముస్లిం లీగ్ (1940 లాహోర్ తీర్మానంలో 'ముస్లిం రాష్ట్రాల' ప్రస్తావన ఉంది. కానీ పాకిస్థాన్ గురించీ... రెండు దేశాల గురించి లేదు), బ్రిటిషు వారి 'విభజించు - పాలించు' పాలసీలే విభజన ప్లాన్ ఒప్పుకునే పరిస్థితులను కాంగ్రెస్‌కు ఏర్పరచాయి. అయినప్పటికీ... ఇందులో తన పాత్రను కాంగ్రెస్ తిరస్కరించలేదు. ఎందుకంటే... స్వాతంత్ర్యోద్యమంలో విభజన అడ్డుకునే అవకాశాలు ఎన్నో వచ్చాయి... కాంగ్రెస్ - ముస్లిం లీగ్ మధ్య స్నేహభావాలను పునరుద్ధరించడం లాంటి అవకాశాలు... కానీ, ఉపయోగించుకోలేదు.

దేశ విభజనకు కారకులు, విలన్లు మహాత్మా గాంధీ, నెహ్రూలేనని చెప్పే సంఘ్ పరివార్‌కు రెండువిషయాలు గుర్తుచేయాలి :


మొదటిది... దేశ విభజనను సమర్థించిన కాంగ్రెస్ నాయకుల్లో పటేల్ మొదటి వ్యక్తి అని "ఇండియా విన్స్ ఫ్రీడమ్" పుస్తకంలో అబుల్ కాలం ఆజాద్ రాసారు. (గాంధీ చివరి వ్యక్తి).

సంఘ్ పరివార్‌కు ఆజాద్ ఫేవరేట్ కాదు కాబట్టి... మోడీ తన సహచరుడైన ఎం జె అక్బర్ నుంచి దీనిపై కొంత జ్ఞానాన్ని పొందాలి. 1988లో "నెహ్రూ - ద మేకింగ్ ఆఫ్ ఇండియా" అనే పుస్తకంలో "సర్దార్ వల్లభాయ్ పటేల్, జవాహర్‌లాల్ నెహ్రూ కంటే ముందే విభజనను అంగీకరించారు" అని రాసారు. (పేజీ 406). కాబట్టి దేశ విభజనకు "విషపు విత్తనాలు నాటినందుకు" కాంగ్రెస్‌ని నిందించడానికి ముందు పటేల్‌ని నిందించాలని గుర్తించాలి.

- రెండవది... ఇంకా ముఖ్యమైన విషయం. మోడీ నాయకత్వం వహిస్తున్న బీజేపీ మాతృ సంస్థ సంఘ్ పరివార్. ఇది హిందూత్వ, హిందూ రాష్ట్రాన్ని, అఖండ భారత్‌ను కోరుతున్నది. ఈ సిద్ధాంతం విభజనకి కారణం కాదా? దీనిపై డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా ఏం చెప్పారో చూడాలి. భారత దేశ రాజకీయ ఆలోచనలను తీర్చిదిద్దిన 'ముగ్గురు గొప్ప భారతీయుల్లో లోహియా ఒకరు' అని మోడీ వర్ణించారు. (మిగిలిన ఇద్దరు గాంధీ, పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ)

హిందూ రాష్ట్రం, అఖండ భారత్‌కు విమర్శకుడైన లోహియా "గిల్టీ మెన్ ఆఫ్ ఇండియాస్ పార్టిషన్" అనే పుస్తకంలో "హిందూత్వ తీవ్రవాదులు విభజనను వ్యతిరేకించడంలో అర్థంలేదు. ఎందుకంటే విభజనకు కారణమైన శక్తుల్లో ముఖ్యమైనది ఈ హిందూత్వ తీవ్రవాదమే. అఖండ భారత్ కోసం గర్జించిన ఆ గొంతులే.... అంటే... జనసంఘ్, వారి పూర్వీకులే... దేశ విభజనలో బ్రిటన్‌కు, ముస్లిమ్‌లీగ్‌కు సహాయపడ్డారు. హిందువులను, ముస్లిమ్‌లను ఒకే దేశంలో ఐక్యం చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోగా.. విభజించడానికే అన్ని ప్రయత్నాలూ చేశారు. ఇదే దేశ విభజనకు కారణమైంది. విభజనకు మద్దతిస్తూ... అదే సమయంలో అఖండ భారత్ గురించి మాట్లాడడం... ఆత్మ వంచనే." అని రాశారు.

కాశ్మీర్, పటేల్‌కు సంబంధించి మోడీ వాదనలపై వాస్తవాలు ఇప్పుడు చూద్దాం. స్వాతంత్ర్యం తరువాత 560కు పైగా రాచరిక రాష్ట్రాలను భారతదేశంలో అనుసంధానం చేయడంలో పటేల్‌ది కచ్చితంగా ప్రధాన పాత్రే. కానీ మూడు రాచరిక రాష్ట్రాలు (హైదరాబాద్, జునాగఢ్, జమ్మూకాశ్మీర్) ఇండియా, పాకిస్థాన్‌కు మధ్య వివాదానికి ప్రధాన కారణాలు. జునాగఢ్ విలీనం (ప్రజాభిప్రాయం ద్వారా)లో, హైదరాబాద్ విలీనం (పోలీస్ చర్య ద్వారా)లో పటేల్ చేసిన పరిష్కారం దఢమైనది. కానీ, కాశ్మీర్‌కు మాత్రం ఇండియా, పాకిస్థాన్... రెండిటినీ నైతికంగా, ఆర్థికంగా, వేలాది మంది జీవితాల పరంగా... ఎటువంటి పరిష్కారం దక్కలేదు.



1947-48లోనే కాశ్మీర్ సమస్యకు పటేల్ కచ్చితమైన పరిష్కారం అందించే వారనే మోడీ వాదనలు తప్పు అని వాస్తవాలు చెపుతున్నాయి. నిజానికి, కాశ్మీర్‌ను భారత్‌కు కాకుండా పాకిస్థాన్‌కు ఇవ్వాలని పటేల్ మొదట్లో అనుకున్నారు. దీని గురించి తెలుసుకోడానికి కొందరు చరిత్రకారుల ఏకగ్రీవ గళాన్ని వినాలి.

రాజమోహన్ గాంధీ రచించిన పటేల్ జీవిత చరిత్ర "పటేల్: ఏ లైఫ్"లో.. పటేల్ అనుకూలమైన బేరం కుదర్చాలని అనుకున్నారని రాశారు. జునాగఢ్‌ను, హైదరాబాద్‌ను భారత్‌కు ఇవ్వడానికి మొహమ్మద్ అలీ జిన్నా ఒప్పుకుంటే... కాశ్మీర్‌ను పాకిస్థాన్‌కు ఇవ్వడానికి అభ్యంతరం చెప్పాలనుకోలేదు. జునాగఢ్‌లోని భావుద్దీన్ కాలేజ్‌లో పటేల్ ప్రసంగాన్ని రాజమోహన్ గాంధీ వీక్షించారు. భారతదేశ విలీనం గురించి "మీరు హైదరాబాద్‌కు ఒప్పుకుంటే, మేం కాశ్మీర్‌కు ఒప్పుకుంటాం" అని ఆయన అన్నారు. (పేజీ 407-8, 438)

ఇక పటేల్ మరొక అధికారిక జీవిత చరిత్రకారుడి విషయానికి వస్తే... మోడీకి బాగా తెలిసిన, ప్రఖ్యాతిగాంచిన గుజరాతీ చరిత్రకారుడు డా. దినకర్ జోషి. "సర్దార్: ద సావరిన్ సైంట్" అనే పుస్తకం పేజీ 220లో "మహారాజ హరిసింగ్ సంశయం వెనుక కారణాలు సర్దార్‌కు బాగా తెలుసు... అంటే కాశ్మీర్ భౌగోళిక, జనాభా పరిస్థితులు (ముస్లిం మెజారిటీ రాష్ట్రం పశ్చిమ పాకిస్థాన్‌కు పొరుగు రాష్ట్రం అయ్యి ఉండడం). హరిసింగ్ పాకిస్థాన్‌తో కలవాలని నిశ్చయించుకుంటే... జమ్మూ, లడఖ్‌ను భారత్‌కు, కాశ్మీర్ లోయను పాకిస్థాన్‌కు అడగాలన్నది సర్దార్ వ్యూహం".

ఆర్ఎస్ఎస్ నాయకత్వ క్రమంలో రెండో స్థానంలో ఉన్న మాజీ నేత హెచ్‌వి శేషాద్రి దీన్ని ధృవీకరించారు. "ద ట్రాజిక్ స్టోరీ ఆఫ్ పార్టిషన్" అనే పుస్తకంలో శేషాద్రి, మెనన్‌ని కోట్ చేస్తూ... "కాశ్మీర్ పాకిస్థాన్‌లో కలవడంలో పటేల్‌కు ఎటువంటి అభ్యం తరం లేదు" అని పేర్కొన్నారు. (పేజీ 215)

మోడీని, అతని భక్తులను ఒప్పించేందుకు ఇది సరిపోకపోతే... ఎస్‌సి దాస్ రాసిన "ద బయోగ్రఫీ ఆఫ్ భారత్ కేసరి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ - విత్ మోడ్రన్ ఇంప్లికేషన్స్" అనే పుస్తకంలోని పేజీలు 186-7 తిప్పి చూడాలి. "భారతీయ జన సంఘ్ వ్యవస్థాపికుడు, బీజేపీ చిహ్నం అయిన ముఖర్జీ... తూర్పు పాకిస్థాన్‌కు బదులుగా కాశ్మీర్ లోయను పాకిస్థాన్‌కు ఇవ్వడానికి పటేల్ మొగ్గుచూపారు" అని దాస్ రాశారు. మరింత స్పష్టంగా "డా॥ ముఖర్జీకి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌కు మధ్య ఈ అంశంపై ఏకాభిప్రాయం ఉండేది" అని పేర్కొన్నారు.

భారతదేశ ఉక్కు మనిషి కాశ్మీర్‌ను పాకిస్థాన్‌లో విలీనం చేయడంలో ఎందుకు మొగ్గుచూపారు? పటేల్ ఆచరణాత్మక స్వభావమే దానికి కారణమని చాలామంది చరిత్రకారులు అంటారు. నెహ్రూలాగా కాశ్మీర్‌పై భావోద్వేగాలు పటేల్‌కు లేవు. పాకిస్థాన్ సరిహద్దుల్లో ముస్లిం మెజారిటీ రాష్ట్రముంటే.. భారతదేశానికి ఇబ్బందులొస్తాయని ఆయన అనుకొని ఉండొచ్చు.

(మిగతా రేపటి సంచికలో)

అనువాదం : ఎం. శ్వేత
సెల్: 8333040365



జిత్కాలా-షా (1899-1938)

హక్కుల కోసం..

ఏ దేశంలో జీవించినా.. మనుషులకు స్వేచ్ఛగా బతికే హక్కు ఉండాలన్నది ఆమె ఆలోచన. వలస వచ్చిన వారికి సమాన హక్కుల కోసం పోరాడిన చరిత్ర ఆమెది. విద్యావేత్త, రాజకీయ కార్యకర్త, సంగీత కళాకారిణిగా పేరుగాంచిన ఆమె జిత్కాలా-షా. గెర్ట్రూడ్ సిమోంన్స్ బోనిన్‌గా పిలవబడిన ఆమే ఎందరో ప్రముఖుల గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియచేశారు.

దక్షిణ డకోటాలోని యాంకటన్ సియుక్స్‌లో జిత్కాలా జన్మించారు. ఆమె తండ్రి, యూరోపియన్ అమెరికన్. తల్లి అమెరికన్. జిత్కాల చిన్నతనంలోనే తండ్రి కుటుంబాన్ని వదిలేసి ఎటో వెళ్లిపోయాడు. సింగిల్ పేరెంట్‌గా తల్లి ఎన్నో కష్టాలు పడి ఆమెను పెంచారు. 1884 లో ఆమె ఎనిమిదేండ్ల వయసులో ఉన్నప్పుడు భారతీయులకు విద్యను అందించడానికి క్వాకర్ జోషియా వైట్ స్థాపించిన మాన్యువల్ లేబర్ ఇనిస్టిట్యూట్‌లో ఆమెను చేర్చారు. 1887 వరకు మూడేండ్ల పాటు ఆమె అక్కడే చదువుకున్నారు. స్కూలు జీవితంలో తాను పడిన మానసిక వేదనను ఆమె తన స్వీయచరిత్ర 'ది స్కూల్ డేస్ అఫ్ ఎ ఇండియన్ గర్ల్ 'లో వివరంగా తెలియజేశారు. కుటుంబానికి దూరంగా ఉంటున్న ఆమె మానసిక సంఘర్షణను సంగీత సాధనతో జయించారు. పుస్తకాలు చదవడం, తనకు తోచింది రాయడం, వయోలిన్ వాయించడం ఈ మూడు పనులే తనకు జీవితంపై నమ్మకాన్ని కల్పించాయని ఆమె చెప్పేవారు.

WOMEN of the day

ఉన్నత విద్య పూర్తిచేసిన తర్వాత 1895లో ఇండియానాలోని రిచ్మండ్‌లోని కాలేజీలో స్కాలర్‌షిప్‌తో చేరారు. ఆ రోజుల్లో మహిళలు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా అరుదు. ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని ఆమె జీవితంలో ముందుకు సాగారు. 1899 లో పెన్సిల్వేనియాలో కార్లిస్లేలోని 'కార్లిస్లే ఇండియన్ ఇండస్ట్రియల్ స్కూలు' లో సంగీతం మాస్టర్‌గా ఉద్యోగంలో చేరారు. అట్లాంటిక్ మంత్లీ, హర్పర్స్ మంత్లీ వంటి జాతీయ ప్రచురణలలో స్థానిక అమెరికన్ జీవితం గురించి వ్యాసాలు రాయడం ప్రారంభించారు. తనతో పాటు ఉన్నవారి జీవితాలను నిశితంగా గమనించే జిత్కాలా తన తోటి స్థానిక అమెరికన్ల జీవితాలను మెరుగుపర్చడానికి ఎంతో కృషి చేశారు.

స్థానిక అమెరికన్ల నుండి సేకరించిన కథలను 1901 లో స్థానిక బోస్టన్ ప్రచురణకర్త గిన్ అండ్ కంపెనీ ఏర్పాటుచేసిన 'ఓల్డ్ ఇండియన్ లెజెండ్స్' లో ఆమె రచించారు. ఆ తర్వాత కొంత కాలం పాటు బ్యూరో ఆఫ్ ఇండియన్ వ్యవహారాల కార్యాలయంలో క్లర్క్‌గా ఉద్యోగం చేశారు. అట్లాంటిక్ మంత్లీలో ఆమె రాసిన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 'ఇండియన్ టీచర్ ఎట్ ఇండియన్స్', 'ది ట్రయల్ పాత్'లో ఆమె వ్యాసాలున్నాయి. 'ఇంప్రెషన్స్ ఆఫ్ యాన్ ఇండియన్ చైల్డ్ హుడ్', 'స్కూల్ డేస్ ఇండియన్ గర్ల్ ', 'ఏ వారియర్స్ డాటర్', ఆమె జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలను, సమస్యలను పాఠకులకు పరిచయం చేస్తాయి.

ఆమె రాసిన రచనలను రెండు విభాగాలుగా చెప్పవచ్చు. 1900 – 1904 మధ్య రాసిన కథలను ప్రచురించారు. వాటిలో అమెరికన్ సంస్క తి, స్థానికంగా సేకరించిన పురాణాల ప్రస్తావన కనిపిస్తుంది. ఆ తర్వాత ఆమె రచనా వ్యాసాంగాన్ని కొనసాగించినా.. వాటిని ప్రచురించలేదు. ఇవి ఆమె చనిపోయిన తర్వాత 2001 లో డ్రీమ్స్ అండ్ థండర్: స్టోరీస్, పోయమ్స్‌గా ప్రచురితమయ్యాయి.

1926 లో 'నేషనల్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అమెరికన్ ఇండియన్' ను స్థాపించి 1938 లో చనిపోయే వరకు అధ్యక్షురాలిగా కొనసాగారు. స్థానిక అమెరికన్ పరిజ్ఞానం, మొదటి ప్రపంచ యుద్ధంలో భారతీయ సైనికుల సేవ తదితర వివాదాస్పద అంశాలపై ఆమె అనేక వేదికలపై ప్రసంగించారు. ❄

టమాట రైస్



కావల్సిన పదార్థాలు: కొర్రల అన్నం – పది కప్పులు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు – రెండున్నర కప్పులు, నూనె, నెయ్యి – పావు కప్పు చొప్పున, లవంగాలు – మూడు, దాల్చినచెక్క – అంగుళం చొప్పున మూడు ముక్కలు, ఉల్లిపాయముక్కలు – ముప్పావు కప్పు, పచ్చిమిర్చి – నాలుగు, ఉప్పు –తగినంత, అల్లంవెల్లుల్లి మిశ్రమం ముద్ద – అరచెంచా, కారం – చెంచా, నీళ్లు – రెండు కప్పులు.

తయారు చేసుకునే విధానం: బాణలిలో నెయ్యి, నూనె వేసి పొయ్యిమీద పెట్టాలి. అవి వేడయ్యాక లవంగాలూ, దాల్చినచెక్క ముక్కలూ వేయాలి. నిమిషం తరవాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలూ, కొంత ఉప్పూ, కారం వేసి వేయించుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు వేగాక అల్లంవెల్లుల్లి మిశ్రమాన్ని వేయించాలి. అందులో టమాటా ముక్కలు వేసి మంట తగ్గిస్తే.. కాసేపటికి అవి మగ్గుతాయి. అప్పుడు నీళ్లూ, మిగిలిన ఉప్పు చేర్చి మంట తగ్గించాలి. అవి ఒక్క పొంగు వచ్చాక ముందుగా వండి పెట్టుకున్న కొర్ర అన్నం వేసి మూత పెట్టేయాలి. ఒకటిన్నర నుంచి రెండు నిమిషాలయ్యాక దింపేస్తే చాలు.



టమాటాలో ఆరోగ్యంతోపాటు సౌందర్యాన్ని మెరుగుపరిచే పోషకాలు ఎన్నో ఉన్నాయని నిపుణులు ఎప్పుడో తేల్చి చెప్పేశారు. కాబట్టి.. ప్రతిఒక్క వంటకంలోనూ టమాటాలు చేర్చుకోవడం ఎంతో శ్రేయస్కరం. అయితే చాలావరకు ఇతర వంటకాల్లో టమోటాలను చాలా తక్కువ మోతాదులో వేస్తారు. దీనివల్ల ఎక్కువ ప్రయోజనాలు కలగవు. అదే నేరుగా టమాటాలతో గ్రేవీయో, ఇతర వంటకాలో చేసుకుంటే.. పోషకాలు అందడంతోబాటు రుచికరమైన రిసిపీని ఆస్వాదించొచ్చు. ై ఇప్పుడు మార్కెట్లో టమాటాలు విరివిగా దొరుకుతున్నాయి. మరి ఈరోజు కొన్ని టమాటా వంటకాల గురించి తెలుసుకుందామా...

టమాటాతో టేస్టీగా...

టమాట గ్రేవీ...

కావల్సిన పదార్థాలు : టమాటాల గుజ్జు–1 లేదా 2 కప్పులు, ఉల్లిపాయల గుజ్జు– అర కప్పు, కొబ్బరి తురుము– అర కప్పు, పచ్చిమిర్చి పేస్ట్– 1 టీ స్పూన్, కారం– 1 టీ స్పూన్, కరివేపాకు– పది రెబ్బలు, ఆవాలు– అర స్పూను, ఉప్పు– రుచికి సరిపడా, పసుపు– కొద్దిగా.

తయారు చేసే విధానం: స్టౌవ్ మీద ఒక పాన్ పెట్టి అందులో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత అందులో కొద్దిగా ఆవాలు వేయాలి. అవి చిటపటలాడిన తర్వాత పచ్చిమిర్చి వేసి ఫ్రై చేసుకోవాలి. ఫ్రై చేసిన తర్వాత అందులో టమాటా గుజ్జును వేసి పచ్చి వాసన పోయేంతవరకు బాగా ఫ్రై చేసుకోవాలి. ఇలా ఫ్రై చేస్తుండగానే అందులో కాసింత నీరు చేర్చుకోవాలి. మరోవైపు మిక్సీ జార్‌లో కొబ్బరి తురుము, ఉల్లిపాయలు, కొద్దిగా నీళ్ల పోసి మెత్తగా పేస్టులా రుబ్బు కోవాలి. ఈ మిశ్రమాన్ని ఉడుకుతున్న టమాటా గ్రేవీ మిశ్రమంలోకి చేర్చుకుని ఉడికించాలి. రెండు నిముషాల తర్వాత అందులో కారం, పసుపు, ఉప్పు, కరివేపాకు తదితర పదార్థాలు వేసి మొత్తం మిశ్రమాన్ని కలగలుపుకొని ఉడికించాలి. తర్వాత ఇందులో కొద్దిగా నీళ్ళు పోసి మరో 10 నిముషాలు ఉడికించుకుంటే టమాటా గ్రేవి రెడీ...





టమాట రసం

కావల్సిన పదార్థాలు: టమాటాలు– రెండు, చింతపండు– పెద్ద నిమ్మకాయ సైజులో (రసం తీసి పెట్టుకోవాలి), ఉప్పు– రుచికి తగినంత, తాలింపుకు: కరివేపాకు– పది రెబ్బలు, జిలకర్ర, ఆవాలు– అరస్పూను, ఎండుమిర్చి– రెండు, చిన్నుల్లి రెబ్బలు– నాలుగు, కొత్తిమీర– కొద్దిగా, చారు మసాలా– రెండు స్పూన్లు, నూనె– తాలింపు కోసం.

తయారు చేసే విధానం: ముందు టమాటాలను ముక్కలు చేసుకొని కొద్దిగా ఉప్పు వేసి గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. తర్వాత స్టౌపై పాన్ పెట్టుకొని తాలింపు కోసం కొద్దిగా నూనె పోయాలి. నూనె కాస్త వేడెక్కిన తర్వాత తాలింపు గింజలు, వెల్లుల్లి వేయాలి. అవి కాస్త వేగిన తర్వాత ఎండు మిరపకాయలు, కరివేపాకు వేసుకొని ఒక్క నిమిషం తర్వాత ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకున్న టమాటా రసం పోయాలి. రెండు నిమిషాల తర్వాత చింత పండు రసం, ఒకటిన్నర క్లాసు నీళ్లు పోసి బాగా వేడైన తర్వాత రెండు స్పూన్లు చారు మసాల వేసి కలియ తిప్పాలి. రసం బాగా మరిగేంత వరకు ఉంచి రుచికి సరిపడా ఉప్పు వేసి మళ్ళీ చారు బాగా మరగనివ్వాలి. చారు బాగా తెర్లేటప్పుడు కొత్తిమీర వేసి ఒక్కసారి కలియతిప్పి దింపేయాలి. అంతే వేడి వేడి టమాటా రసం రెడీ...

పచ్చడి

కావల్సిన పదార్థాలు: టమాటాలు – అరకేజీ, మెంతులు – పది గ్రాములు, ఉప్పు – తగినంత, చింతపండు – యాభై గ్రాములు, పసుపు – చిటికెడు, కారం – యాభై గ్రాములు, నువ్వుల నూనె – యాభై గ్రాములు. తాలింపు కోసం: ఆవాలు – అరచెంచా, మినప్పప్పు, శనగపప్పు – చెంచా చొప్పున, ఎండుమిర్చి – ఐదు, పల్లీలు – యాబై గ్రాములు, ఇంగువ –చిటికెడు, కరివేపాకు – మూడు రెబ్బలు.

తయారు చేసే విధానం:

టమాటాలను శుభ్రంగా కడిగి తుడుచుకోవాలి. బాణలిలో రెండు చెంచాల నూనె వేడిచేసి టమాటాలను వేసి మగ్గించాలి. అవి కొద్దిగా మగ్గినట్టు అయ్యాక పసుపూ, చింతపండూ వేయాలి. ఐదు నిమిషాలయ్యాక తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు మరో పొయ్యి మీద బాణలి పెట్టి మెంతుల్ని నూనె లేకుండా వేయించుకుని వేడి చల్లారాక పొడి చేసుకోవాలి. అదే బాణలిలో మిగిలిన నూనె వేడిచేసి కరివేపాకు తప్ప తాలింపు కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ వేయించాలి. చివరగా కరివేపాకు వేయాలి. ఇప్పుడు మెంతిపిండీ, కారం, వేయించుకున్న తాలింపును మగ్గిన టమాటాలపై వేసి బాగా కలిపి రెండు నిమిషాలయ్యాక పొయ్యి కట్టేయాలి. ఈ పచ్చడి వారం దాకా నిల్వ ఉంటుంది.



అందం కోసం వందలా..!

అందం కోసం వందలు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా సహజసిద్ధంగా ఇంట్లోనే సౌందర్యాన్ని పెంచుకోవచ్చు. ఏ ఏ పదార్థాలు మనకి ఎలా ఉపయోగపడతాయో తెలుసుకుందాం.

మాయిశ్చరైజర్: మార్కెట్లో మాయిశ్చరైజర్ క్రీమ్‌లు చాలా దొరుకుతున్నాయి. వాటి కన్నా తేనె మంచి మాయిశ్చరైజర్‌గా మనకి ఉపయోగపడుతుంది.

క్లెన్సర్: చర్మాన్ని శుభ్రపరిచే గుణాలు పెరుగులో చాలా ఎక్కువ. పెరుగు ముఖానికి రాసుకున్న పావుగంట తరవాత చల్లని నీళ్లతో కడిగేసుకుంటే చర్మగ్రంథులు శుభ్రపడ తాయి. తేనెను కూడా క్లెన్సర్ లా వాడుకోవచ్చు.

స్క్రబ్: మెంతి గింజలు నానబెట్టి మెత్తని పేస్టులా చేసి దానిని ఒక డబ్బాలో వేసుకుని ఫ్రిజ్‌లో ఉంచుకోవాలి. ఆ పేస్టును పదిరోజుల వరకు స్క్రబ్ లా వాడుకోవచ్చు.

బ్లీచ్: పార్లర్‌లలో పెట్టే బ్లీచ్ కొందరికి పడదు. దాని వల్ల ఇతర సమస్యలు కూడా వస్తుంటాయి. పెరుగు, తేనె, నారింజ, నిమ్మ, పైనాపిల్ పండ్ల రసాలు బ్లీచింగ్ బాగా చేస్తాయి.

కండిషనింగ్: సాధారణ, జిడ్డు చర్మతత్వాలు ఉన్న వారు గుడ్డులోని తెల్ల సొనను, పొడి చర్మం ఉన్న వారు గుడ్డులోని పచ్చసొనను కండిషనింగ్‌కు వినియోగించుకోవాలి.

మచ్చలు పోయేందుకు: ఇంట్లోనే చిన్న కలబంద మొక్కని పెంచుకోవడం చాలా సులువు. కాలిన గాయాలకి, ఎండ వల్ల కమిలిన చర్మానికి కలబంద జెల్ బాగా పనిచేస్తుంది. దీనిని రోజు రాసుకుంటే నల్లటి మచ్చలు కూడా మాయమవుతాయి. ❄



ఇట్లచేద్దాం

రక్తహీనతతో బాధపడే వారు రోజుకు నాలుగు ఖర్జూరాలను తినాలి. ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా తీసుకుంటే హిమోగ్లోబిన్ శాతం ొ రుగుతుంది.



రంగుల్లో ఏముంది?

కంటికింపైన రంగులు మనసును హత్తుకుంటాయి. హాయినిస్తాయి. మరి అంత ప్రభావం ఉన్న రంగుల్ని పడక గదిలో ఉపయోగించేప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వంటిల్లు, మధ్యగది, పడకగది.. అవసరాన్ని బట్టి ఒక్కో గదిలో ఒక్కో రంగుతో అలంకరించుకోవచ్చు అంటున్నారు మనస్తత్వ నిపుణులు.

తెలుపు .. రంగు మనసుకు హాయినిస్తుంది. పసిపిల్లల గదిలో, పిల్లలు చదువుకునే గదిలో ఆ రంగును ఉపయోగిస్తే చాలా మంచిది. ఈ రంగు ప్రభావం మనసుకు ప్రశాంతతనిస్తుంది. అందుకే చిన్నారుల కోసం ఉపయోగించే దుస్తుల దగ్గర్నుంచీ.. దుప్పట్లు, కర్టెన్లు.. గోడల రంగుల వంటివన్నీ.. ధవళవర్ణంలో ఉండేలా చూసుకుంటే మంచిది.

నీలం .. మనసుకు ఆహ్లాదాన్నందించడంలో నీలం వర్ణానిది ప్రధాన పాత్ర. ఇది మెదడుపై చూపించే ప్రభావంతో భావోద్వేగాలు నియంత్రణలోకి వస్తాయి. అందుకే ఈ రంగుని టీనేజీ పిల్లల గదిలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఒకవేళ గోడలకు అలాంటి రంగు లేకపోతే కనీసం ఆ వర్ణంలో ఉండే పోస్టర్లు.. కర్టెన్లు.. ఇతర అలంకరణ వస్తువులు ఉంచితే చక్కగా నప్పుతాయి.

ఆకుపచ్చ...ప్రకృతిలో కాసేపు ఉంటే చాలు ఎంత ఒత్తిడైనా ఉఫ్‌మని దూరమవుతుంది. ఆందోళనల స్థాయిల్ని తగ్గించి పునరుత్తేజం కలిగించేందుకు తోడ్పడుతుంది. కండ్లను తొందరగా ఆకర్షించే రంగూ ఇదే. అందుకే విశ్రాంతి గదిలో, స్టడీరూమ్‌లో ఈ రంగుని వేసుకోవచ్చు.

పసుపు .. ఈ రంగు చూసినప్పుడు మెదడు చురుగ్గా పని చేస్తుంది. అందుకే .. మధ్య గదులు, భోజనాల బల్ల దగ్గర్లో లేత పసుపు వర్ణం అలంకరణ ఎంపిక చేసుకోవాలి. ఈ రంగు స్నేహ పూర్వక వాతావరణాన్ని పెంచుతుందని నిపుణుల సూచన.

ఎరుపు .. ప్రమాద సంకేతం అని చాలామంది అనుకుంటారు. కానీ నిజానికి అది రొమాంటిక్ కలర్. కొత్తగా పెళ్లైన వారు తమ పడకగదిలో ఆహ్లాదంగా కనిపించే ఎరుపు రంగుని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. ఈ వర్ణం ప్రభావం భాగస్వామితో సాన్నిహిత్యాన్ని పెంచుతుంది. ❄

'మానవి' మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక,
ఎంహెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.


నొప్పి నివారణకు...



నెలసరి సమయంలో పొత్తి కడుపులో వచ్చే నొప్పిని నివారించాలంటే గోరువెచ్చని నీళ్ల సేవిస్తే మంచి ఫలితం వుంటుంది. నెలసరి సమయంలో శరీరంలోని టాక్సిన్లను తొలగించేందుకు గోరువెచ్చని నీరు సేవించడం ఉత్తమం. అలాగే నెలసరిలో కడుపు నొప్పి తగ్గాలంటే.. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలి. జంక్ ఫుడ్‌ను పక్కనబెట్టాలి. ప్రోటీన్లను మితంగా తీసుకోవాలి. కంటి నిండా నిద్రపోవాలి. ఇలా చేస్తే నెలసరి నొప్పులకు చెక్ పెట్టవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే గోరువెచ్చని నీటిని రోజంతా తీసుకోవడం ద్వారా జీర్ణ క్రియను మెరుగుపరుచుకోవచ్చు. చెడు కొలెస్ట్రాల్‌ను దూరం చేసుకోవచ్చు. ఇంకా గోరువెచ్చని వేడి నీటిలో నిమ్మరసాన్ని కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

కాస్త వేడిగా ఉన్న నీళ్ల తాగడం వల్ల ఒంట్లో ఉష్ణోగ్రత పెరిగి చెమట ఎక్కువగా వస్తుంది. దీని ద్వారా ఎక్కువ క్రిములు బయటికి పోయే అవకాశం ఉంటుంది. గోరువెచ్చని నీటితో వృద్ధాప్యఛాయలు తగ్గిపోతాయి. చర్మఛాయ మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ❄

విన్నపాలు వినవలెను



ప్రొఫెసర్ వెంకట్ దాస్

మిత్రమా
నువ్వు నేను
ఒకే కొమ్మకు
పుట్టిన
రెమ్మలం
అంతా నేనే
అన్నవాడు...
ఏమి చేయడని
ఎరిగిన వాడ్ని
అజ్ఞానం
గాఢాంధకారం
అలుముకున్నది
ఆకాశాన్నంతా...
కలిసి నడవాల్సిన
తరుణంలో
విడిగా నడిస్తే
కాలం (రాబోయే)
మనల
శపిస్తది
మంత్రాలకు చింతలు
రాలవని
ఎంత చెప్పినా
వినని...
వామచారం
పసికూనల తలల్ని
సైతం
విశ్వనగర నడిబొడ్డులో
విసురుతోంది
సవాలుగా...

భారత సమాజాన్ని అర్థం చేసుకోవడంలో నిర్వచించడంలో ఎన్నో శ్రవంతులుగా విడిపోయాం. భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొంటూ ఎన్నికలను ఒక అస్త్రంగా వాడుకొని సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేయాలని కోరుకునే శ్రవంతులలో మనము న్నాం. హిందూమతాన్ని మనువాదాన్ని నెత్తికె త్తుకున్న పార్టీలను చూసి భయపడి కాంగ్రెస్ పార్టీని గత 70 ఏండ్లుగా కేంద్ర అధికారపీఠం లో కూర్చోబెడుతూనే ఉన్నాం. కాంగ్రెస్‌కు మనువాద లక్షణాలేవీ లేవనే, సెక్యులర్ అని గట్టిగా చెప్పగలమా? కాంగ్రెస్ పైన మనమెం త ప్రేమను ఒలకబోసినా బీజేపీని గద్దెనెక్కకుం డా నిలువరించలేకపోయామే. కాంగ్రెస్ పాలన లో దళితులపైనా దాడులు జరుగలేదని చెప్ప గలమా? మతకలహాలు జరగలేదా? బాబ్రీ మ సీదు కూలలేదా? కాంగ్రెస్ ఏవిధంగా బీజేపీ కన్నా మెరుగైంది. ఉత్తర భారతంలో ఖాప్ పంచాయత్‌లు కాంగ్రెస్, బీజేపీ పాలనన్న తేడా లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. మనసుకు నచ్చినవారిని వరించిన పాపానికి యువతీ యువకుల తలలు తెగుతూనే ఉన్నాయి. మంటల్లో మాడి మసి అవుతూనే ఉన్నాయి. ఇక బీజేపీ గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనేం లేదు. కౌ పాలిటిక్స్ పేరుతో మనుషులను కాల్చుకు తింటూనే ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో వేలకోట్ల రూపాయల స్కామ్స్ భోఫోర్స్ కుంభకోణం (1980), 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం, (2008), సత్యం కుంభ కోణం (2009), కామన్‌వెల్త్ క్రీడల కుంభకో ణం (2010), బొగ్గు కుంభకోణం (2012), చాపర్ కుంభకోణం (2012), తాత్రా ట్రక్కు కుంభకోణం (2012), ఆదర్శ్ కుంభకోణం (2012) మొదలైనవి) జరిగినాయి. అదేవిధం గా గత నాలుగేండ్లలో బీజేపీ పాలనలో మోడీ గేట్ కుంభకోణం (2014), మైనింగ్ కుంభకో ణం (2014), నూల్మ్ కుంభకోణం (2015), ప్రజా పంపిణీ కుంభకోణం (2015), గృహ రు ణాల కుంభకోణం (2015), అడ్మిషన్ల కుంభ కోణం (2015), చిక్కి కుంభకోణం (2015), కేజీ బేసిన్ కుంభకోణం (2015), విజయ్ మాల్యా కుంభకోణం (2017), కార్పొరేట్ రుణాల మాఫీ కుంభకోణం (2016-17), నా లియా కుంభకోణం (2017), నీట్ కుంభకోణం (2017), ఉజ్వల యోజన కుంభకోణం (2017), రోడ్ కాంట్రాక్టు కుంభకోణం (2017), దొంగనోట్ల కుంభకోణం (2017), ఎంసీఐ కుంభకోణం (2017), నీరవ్‌మోడీ కుంభకోణం (2018) మొదలైనవి) జరిగినాయి. కాబట్టి దొందూ దొందే.

ఒకరికి భయపడి మరొకరికి మద్దతిచ్చే పద్ధతి మానుకుందాం. మనువాదాన్ని (బీజేపీ ని) ఓడించడం కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తూ పోతే ఇక్కడి నుంచి మరో వంద ఏండ్లయినా మనం ఎదగలేం. యుద్ధంలో ఆవలి పక్షం ఎత్తుగడలు, పోరాట పద్ధతులు అర్థం కానప్పుడ ే మాత్రమే.. తాత్కాలికంగా ఆత్మరక్షణ పద్ధతు లు అవలంభించాలనే మరిచితిమేమో ... పోరు బాటలో దీర్ఘకాలిక ఆత్మరక్షణ వ్యూహం మనకు లేదన్నసంకేతం శత్రువుకు తెలియపరుస్తుందని మరిచితిమేమో. ఫలితం... మార్క్స్ మహోపా ధ్యాయులు చెప్పిన మార్పును తీసుకురాలేక పోయామేమో. పోని హిందూ వాదానికి, మ ను వాదానికి బయపడి కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడం వలన సమాజానికి ఒరిగిందేమీ లేదు కదా? సోషలిస్ట్ విప్లవానికి కొత్త ద్వా రాలేమి తెరుచుకోలేదు కదా? మన సహజ మిత్రులైన అంబేద్కరిస్టులను ఇన్నేండ్లుగా గు ర్తించకపోవడం ఒక చారిత్రక తప్పిదమేనని గ మనిద్దాం. అంబేద్కరిస్టులు సామాజిక దోపిడీ కుల దోపిడీ పోవాలంటున్నారు. మనమేమో ఆ ర్థిక దోపిడీ అంతమైతే అన్ని దోపిడీలు వాటం తటవే అంతమవుతాయని నమ్ముతున్నాం. అనగా కుల దోపిడైనా, ఆర్థిక దోపిడైనా... దోపిడీ... దోపిడే కదా. దోపిడీ గురించి మా ట్లాడే అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి కదా? మేము కొన్ని దశాబ్దాల అంతర్మ ధనం తరువాత అంబేద్కరిస్టులు కమ్యూని స్టులు కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకో వడం జరిగింది. దానికి తెలంగాణ వేదికైంది. ఈ సంఘటనల పర్యవసానమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావం. సిద్ధాంత పరంగా మరింత లోతైన చర్చ జరగాలని మీరు భావిస్తే దానికి సిద్ధమేనని కమ్యూనిస్టు, అంబేద్కరిస్టు మిత్రులకి విన్నవిస్తున్నాం.

సెల్ : 94404 88428

జనం గురించి.. జనంకోసం... జనంలోకి ....



దయ్యపు రాధాకృష్ణ

మనది పెద్ద ప్రజాస్వామ్య దేశం, ఈ దేశంలో ప్రజలు తమ గురించి, తమ కోసం, తమచేత తమను పరిపాలించుకోవడానికి, బాగోగులు చూసుకోవడం కోసం నాయకులను ఎన్నుకుంటారు. నాయకులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని పరిపాలన చేస్తారు. "ఎన్నుకున్న నాయకులు, ప్రభుత్వం ఏ ప్రజల కోసం పనిచేయాలి? ఏ విధానాలు అమలు చేయాలి" అనే విచక్షణా అధికారాలు ప్రభుత్వాలకు ఉంటాయి. సహజంగానే ప్రజలకు తమ ఆర్థిక, సామాజిక స్థాయిని బట్టి, విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఉపాధి, భూమి, ఆహారం పదవులు వంటి ఆశలు, కోరికలుంటాయి. ఆ కోరికలు తీర్చాలని కోరుకోవడం, తీరుస్తారని భ్రమలలో ఉండటం, అమలు కాకపోతే అందోళన చెందడం, నిరసన తెలపడం, చివరికి ఉద్యమాలు చేయడం జరుగుతుంది. అంతేగాదు ప్రభుత్వ విధానాలను, పనితీరును, పోకడలను తమ జీవితాలకు పోల్చుకోవడం తీరకపోతే మార్పును ఆశించడం జరుగుతుంది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు గతంలో ఉద్యమం నడిపి, నేడు పరిపాలన చేస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తమ కోరికలు తీర్చాలని కోరుకుంటున్నారు. తీరుస్తారని ఆశపడుతున్నారు. కొందరు భ్రమల నుండి బయట పడుతున్నారు. గతంలో చెప్పిన మాటలు, ఎన్నికల హామీలు, ప్రభుత్వ ఆచరణను, దిశను గమనిస్తున్నారు. ప్రజల దైనందిన సమస్యలను ప్రభుత్వానికి అప్రధాన మైనవని, జీవితాలకు, జీవన ప్రమాణాలకు సంబంధం లేని విధానాలు, కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. అంకెల గారడీ, అభివృద్ధి సూచికల పేరుతో తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని మాయమాటలతో ప్రజలను నమ్మించాలని ప్రయత్నిస్తున్నారు. అసలు అభివృద్ధి అంటే ఏమిటో చెప్పరు. అన్నింటినీ అద్భుతమే అంటారు. ఉద్యమానికి ఊపిరి పోసిన నినాదాలు, ఎన్నికల మ్యానిఫెస్టో వాగ్దానాలు, అనంతర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు పూర్తిగా విరుద్ధమైనవి. నియామకాల ప్రక్రియ నిరంతర ఘోషగా ఉన్నది. భూపంపిణీ భూటకంగా మారింది. యజ్ఞ యాగాలు, పూజలు, మొక్కుబడులు మత గురువులకు మర్యాదలు, అర్చకులకు అందలం, భక్తులకు బట్టలు, నైవేద్యం, కులాలకుంపట్లు కులగోత్రాల సమీకరణలు, కుల "బంగ్లా"లు వాస్తు పేరుతో భవన నిర్మాణాలు తెలుగు మహాసభలు, అతిథి రాచమర్యాదలు వీటికి తోడు ప్రచార ఆర్భాటాలు వీటన్నింటిని ప్రజలు పరిశీలిస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం మాటలతో కడుపునింపాలని ప్రయత్నిస్తున్నది. ఎదురు మాట్లాడకుండా గమ్మునుండాలని, దొర చెప్పిందే వేదం, వినకపోతే మీ బతుకులు ఘోరమంటూ ప్రజల గొంతులను మూయించే పని పెట్టుకున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేస్తున్న పనులు ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడుతున్నాయి, ప్రజలు ఏయే సమస్యలతో ఉన్నారు. ఏం చేస్తే రాష్ట్రం సమగ్రాభివృద్ధి జరుగుతుందని, ప్రజల సమస్యల అధ్యయనంతో "సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి పేర సుదీర్ఘ మహాజన పాదయాత్ర జరిగింది. అయితే ప్రజల సమస్యల పరిష్కారం కోసం నివేదికల రూపంలో ప్రభుత్వానికి అందించడంలో "సామాజిక న్యాయమే" ప్రధాన అంశంగా తెరపైకి వచ్చింది. ఇది ప్రభుత్వంలో ప్రకంపనలే కాదు, ప్రభుత్వంతోపాటు, పలు రాజకీయ పార్టీలు, మేధావులు సంఘాలు సామాజిక న్యాయం గురించి మాట్లాడకుండా ఉండలేని, ఆచరణలో అమలు చేయకుండా తప్పలేని పరిస్థితి ఏర్పడింది.

మహాజన పాదయాత్రలో " సామాజిక న్యాయం" డ ిమాండుకు ప్రతిస్పందనల ఫలితమే దేశంలో ఎక్కడా జ రగని, ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో 280కి పె ్గా కుల, సామాజిక, వర్గ ప్రజాసంఘాల ఐక్యవేదిక - టి-మాస్ ఏర్పడటానికి అంకురార్పణ జరిగినది. ఇది దేశ చరిత్రలో కొత్తమలుపు. రాష్ట్రస్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు నిర్మాణం ఏర్పర్చుకుని, బలపడటానికి కృషి చేస్తున్నది. టి-మాస్ నేడు అన్ని వర్గాలలో చర్చనీయమైనది. కులాలు, గోత్రాలుగా విడిపోతున్న ఈ కాలంలో అన్ని కులాలను కలిపి ఉంచే ప్రయత్నాన్ని మేధావులు, అభ్యుదయవాదులు, సామాజిక ఉద్యమకారులు అభినందిస్తున్నారు. అంబేద్కర్, మార్క్స్, పూలే మహనీయుల బాటలో సామాజిక న్యాయం, సమానత్వమే ప్రధాన ఎజెండాగా ముందుకెళ్తున్నది. సిద్ధాంత భావజాలాన్నే కాదు, అందుకు కార్యాచరణను కూడా రూపొందించి అమలు చేస్తున్నది. చదువుల తల్లి సావిత్రి భాయిపూలే జయంతి వేడుకలను ఎన్నడూ లేనివిధంగా అన్ని ప్రాంతాలలో, వాడలలో ఘనంగా నిర్వహించింది. పూలే-అంబేద్కర్ వర్ధంతులను సామాజిక ఉద్యమ వారోత్సవాలుగా జనభోజనాలతోపాటు అనేక కార్యక్రమాలను నిర్వహించింది. నేడు సామాజిక న్యాయం, సమా నత్వం అనే అంబేద్కర్, పూలే, మార్క్స్‌ల ఎజెండా కుల, సామాజిక, వర్గ సంఘాలను కదిలిస్తున్నది. వ్యక్తిగత సంఘ కార్యక్రమాలకన్నా అందరికీ ఆమోదయోగ్యమైన సామాజిక న్యాయం ఎజెండా ప్రధానంగా భావించే స్థాయికి వెళ్తున్నది. దీనిద్వారా సంఘాల మధ్య ఐక్యతేకాదు, భావజాల సారూప్యత, ఐక్యతకు కూడా దోహదం చేస్తున్నది.

వివిధ ప్రజాసంఘాలకు నేతృత్వం, వహిస్తున్న నాయకులు కూడా తమసంఘాలకు, కార్యకర్తలకు కార్యక్రమాలలో టి-మాస్ గురించి చెప్పాలనీ, టి-మాస్ కార్యక్రమాలకే ప్రాధాన్యతనివ్వాలనీ, అంతిమంగా టి-మాస్ అందరికీ ప్రధానం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్నారంటే "సామాజిక న్యాయం" ఎంత ఉత్తేజ పరుస్తున్నదో అర్థమవుతుంది. ఇటీవల నా వ్యాసానికి స్పందించిన ఒక అట్టడుగు వర్గాల సంఘ నాయకుడు నేను వికలాంగున్ని, 20 సంవత్సరాల నుండి నిద్ర లేవగానే అంబేద్కర్ ఫొటోకు మొక్కి మాత్రమే బయటకి వస్తున్నా, టి-మాస్ ఆవిర్భావంతో అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం సాధ్యమవుతుందని భావించి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ గ్రామ కమిటీలు వేస్తున్నాం. మీరు కూడా టి-మాస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరుకోవడం నిజంగా ఉద్యమం గొప్పదనంగా అర్థమవుతుంది. ఈ స్ఫూర్తిని కొనసాగించాలి. ఆచరణ అమలు కోసం ఐక్యతతో అడుగులేయాలి. ప్రజలతో మమేకం కావాల్సిన అవసరమున్నది. రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలు చేయాలనీ సమరోత్సాహంతో ముందుకెళ్లాలి. ప్రజల జీవన విధానాలను, సమస్యలను, ఆకలి దప్పులను అర్థం చేసుకోవడానికి, అవగాహన చేసుకుని పరిష్కారం కోసం టి-మాస్ పిలుపును జయప్రదం చేయాల్సిన అవసరమున్నది. ధర్నాలు, నిరాహార దీక్షలు, మహాధర్నాలతో ప్రజలను సంఘటిత పరిచి ప్రభుత్వాన్ని కదిలించాలి. ఈ సందర్భంగా ప్రజలను కదిలించే, ఉత్తేజపరిచే ఆట-పాట కళ, కవిత, రచన వంటి అనేక సాంస్కృతిక రంగాలను ఆందోళనలో భాగం చేయాల్సిన అవసరమున్నది. ఐక్యతను కార్యాచరణలో భాగస్వామ్యం చేయాలి. ఇంకా వేచి చూస్తున్న సంఘాలను, నాయకులను ప్రభావితం చేయాలి. ఆ దిశగా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం పునాదుల నిర్మాణం కోసం జనం గురించి, జనంకోసం, జనంలోకి వెళ్లాలి, ప్రజలలో విశ్వాసాన్ని, భరోసాను కల్గించాలి.


సెల్ : 7730877841

శ్రమ దోపిడీలో భాషోపాధ్యాయులు



డాక్టర్ ఎస్.విజయభాస్కర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పంచాయతీ రాజ్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషలను బోధించే భాషోపాధ్యాయులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషోపాధ్యాయుల సమస్యలను వారం, పది రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలలు గడిచినా భాషోపాధ్యాయుల సమస్యలకు ఎలాంటి పరిష్కారం దొరకలేదు. 2018-19 విద్యా సంవత్సరం నుండి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తెలుగు అమలు చేయాలంటే భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి. అప్పుడే వారు చిత్తశుద్ధితో పని చేస్తారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సామాన్యశాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధిస్తారు. తెలుగు, హిందీ గ్రేడ్ 2 బోధిస్తూ, ఇంగ్లీష్, సామాన్య శాస్త్రం, గణితం, సాంఘిక శాస్త్రాలను స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తున్నారు. పని సమయం చేసే పని ఒక్కటే అయినప్పటికీ వేతనాల్లో మాత్రం వ్యత్యాసం చాలా ఉంటుంది. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ఎస్జీటీలు బోధిస్తారు. వారి విద్యార్హత ఇంటర్మీడియట్ తత్సమానం, టీటీసీ (టీచర్స్ ట్రైనింగ్ కోర్స్), డీఎడ్ (డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్), ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు



బోధిస్తారు. వారి విద్యార్హత డిగ్రీ తత్సమాన, బీఎడ్ (బ్యాచ్‌లర్ ఇన్ ఎడ్యుకేషన్) కానీ భాషోపాధ్యాయులకు గ్రేడ్1, గ్రేడ్ 2, రెండింటికీ డిగ్రీ తత్సమాన, తెలుగు, హిందీ, ఉర్దూ మిగతా దేశీయ భాషల పండిత్ కోర్సులను పూర్తి చేసి ఉండాలి. గ్రేడ్ 2, గ్రేడ్ 1లలో విద్యార్హతలు ఒక్కటే ఉన్నాయి. కానీ జీతంలో మాత్రం వ్యత్యాసం ఉంది. 20 ఏండ్లు గడిచినా లభించని పదోన్నతులు 1996 డీఎస్సీ ద్వారా భాషోపాధ్యాయులుగా ఎంపికైన వారు ఇప్పటికీ పదోన్నతులకు నోచుకోకుండా భాషోపాధ్యాయులుగానే చేస్తున్నారు. కొంతమంది భాషోపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరి భాషోపాధ్యాయులుగానే పదవీ విరమణ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు తమ సర్వీస్ కాలంలో కనీసం మూడు పదోన్నతులు పొందాలనే నియమ నిబంధనలు ఉన్నప్పటికీ భాషోపాధ్యాయుల విషయంలో మాత్రం అవి అమలు కావడం లేదు. భాష పండితులను అప్‌గ్రేడ్ చేసి భాషోపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ఎన్నిసార్లు ఉద్యమాలు, పోరాటాలు చేసినా పదోన్నతులు మాత్రం కల్పించడం లేదు.

2017లో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భాష పండితులకు అప్‌గ్రేడ్ చేస్తూ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని జీవో 17, 18ను విడుదల చేసింది. భాష పండితులు గత 20 ఏండ్ల కల నెరవేరిందని ఎంతో ఉత్సాహంతో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారు. కానీ భాష పండితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర

సమైక్యాంధ్ర రాష్ట్రంలో భాష పండితులకు పదోన్నతులు రావడం లేదని ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ ఉద్యమంలో భాష పండితులు తమ కవితలూ, ఉపన్యాసాలూ, పాటలూ, నాటకాల ద్వారా, వివిధ సాహిత్య, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను జాగృతం చేస్తూ తమ ఉద్యోగాలను సైతం లెక్కచేయకుండా చురుకైన పాత్రను పోషించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దాదాపు నాలుగు ఏండ్లు కావస్తున్నా భాష పండితులకు ఎలాంటి పదోన్నతులు దక్కక నిరాశ, నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా భాష పండితులకు ప్రయోజనం దక్కలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఉన్నత చదువులు చదివినా ప్రయోజనం శూన్యం

భాషోపాధ్యాయులు భాష పండిత శిక్షణను పూర్తి చేసిన తర్వాత ఇన్ సర్వీస్‌లో ఉంటూ బిఎడ్, ఎంఎడ్, ఎంఎ, పీహెచ్‌డీలు చేసినా లాభం లేకుండా పోతున్నది. డి ప్లమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఎడ్), కళా శాలల్లో ఉపన్యాసకులుగా, బీఎ డ్ (బ్యాచ్లర్ ఇన్ ఎడ్యుకేషన్) కళాశా లల్లో ఉపన్యాసకులుగా, రాష్ట్ర వి ద్య పరిశోధన సంస్థ (ఎస్సీఆర్టీ)లో ఉప న్యాసకులుగా, ప్రొఫెసర్లుగా పదోన్న తులు పొందాలంటే స్కూల్ అసి స్టెంట్లు ఉండాలి. గ్రేడ్ 2 ఉపాధ్యా యులు స్కూల్ అసిస్టెంట్ల వి ద్యార్హతతో సమానం. కాబట్టి గ్రేడ్ 2 భాషోపాధ్యాయులకు కూడా పదోన్నతుల విషయంలో అవకాశం ఇవ్వాలని కోరు తున్నా రు. ముఖ్యమంత్రులు, విద్యాశాఖాధికారులు, విద్యా శాఖ మంత్రులు విద్యాశాఖ కార్యదర్శులు ఎంతమంది మారి నా భాష పండితుల సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

మాతృభాష దినోత్సవం వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తూ మాతృభాష కోసం ఎంతో కృషి చేస్తామని ప్రగల్భాలు పలికే నాయకులు మాతృభాషలను బోధించే ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యపై దృష్టి నిలపకపోవడం విచారించదగిన విషయం. డిసెంబర్ 15 నుండి 19 వరకు ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను రక్షించడానికి కట్టుబడి ఉన్నామని భాష పండితుల సమస్యలను పరిష్కరిస్తానని ప్రపంచ తెలుగు భాషాభిమానుల ముందు దేశ ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ భాష పండితులకు అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని భాష పండితులు కోరుతున్నారు.

సెల్ : 9290826988

బీజేపీ పాలనలో కొత్తదనమేమీ లేదు



శ్రీనివాస్ సార్ల

మూడేండ్ల భాజ పా పాలన కూలంక షంగా విశ్లేషిస్తే కొన్ని ఆసక్తికరమైన అంశా లు వెల్లడవుతాయి. ఈ మూడేండ్లలో భా జపా విధానాలు, సా ధించిన విజయాలను సమగ్రంగా చర్చించే ప్రయత్నమే ఈ వ్యాసం. 2014 సాధారణ ఎన్నికల్లో అఖండ మెజారిటీ సాధించి అధికారంలోకి వచ్చిన బీజేపీ తన పాలన విధానాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఇక్కడ ఆకట్టుకునే అనే పదం ఉపయోగించడానికి కారణం ఏంటంటే "గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జనాకర్షక పథకాలతో దేశాన్ని అరవై ఏండ్లుగా దోపిడీ చేసింది" అని ప్రచారం చేసిన భాజపా అప్పుడు కాంగ్రెస్ అనుసరించిన విధానాలకు ఏ మాత్రం తీసిపోకుండా పరిపాలన చేస్తుందనేది మూడేండ్ల బీజేపీ పాలన తేట తెల్లం చేసింది. సుదీర్ఘ బ్రిటిష్ పాలన అనంతరం స్వతంత్ర భారత దేశానికి అనుగుణంగా రాసుకున్న రాజ్యాంగానికి వ్యతిరేకంగా భాజపా విధానాలను గమనించవచ్చు. రాజ్యాంగంలో ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థలను ఒక పద్ధతి ప్రకారం విచ్ఛిన్నం చేసే కుట్ర భాజపా విధానాలలో స్పష్టంగా కనిపిస్తోంది. మొదటగా అధికారంలోకి వచ్చీ రాగానే కాంగ్రెస్ హయాంలో నియమించిన గవర్నర్లను తొలగించి గవర్నర్ పదవులకు ఉన్న ఔనత్యాన్ని దెబ్బ తీసింది. రెండో ప్రయత్నంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిరంతరం కాపాడుతూ బాధ్యతగా మెదిలే అర్‌బీఐ సంస్థ స్వతంత్ర ప్రతిపత్తిని విచ్ఛిన్నం చేసే కుట్ర జరిగింది. రాజ్యాంగ సంస్థలలో అర్‌బీఐ ప్రత్యేకమైన ప్రాధాన్యత కలిగిన వ్యవస్థ. దేశంలో డబ్బు ముద్రణ, పంపిణీ, నియంత్రణ అధికారం కలిగి, ఆర్థిక వ్యవస్థకు ఇది అత్యున్నత వ్యవస్థ. ఆర్‌బీఐ తన స్వయం ప్రతిపత్తి కోల్పోతే ఏం జరుగుతుందో ఒకసారి చూద్దాం. దానికన్నా ముందు అది చేసే పనులు ఒకసారి పరిశీలిద్దాం. 1934 చట్టం ద్వారా 1935లో దేశంలో ఏర్పడిన కేంద్ర బ్యాంక్ ఈ ఆర్‌బీఐ. దీనికి రాజ్యాంగ బద్ధతతోపాటు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారముంది. అంటే ఈ సంస్థలో రాజకీయ జోక్యానికి అవకాశం తక్కువ. దేశంలో వస్తు సేవల ఉత్పత్తికి డిమాండ్ సప్లైకి అనుగుణంగా ద్రవ్య ముద్రణ చేసి పంపిణీ చేస్తుంది.

ద్రవ్య సప్లై అధికమై ధరలు పెరిగినప్పుడు తన ద్రవ్య విధానం ద్వారా ధరలను అదుపులో ఉంచుతుంది. దేశంలో ఉన్న అన్ని బ్యాంకులను మానిటరింగ్ చేసి ప్రజల సొమ్ముకు వాచ్‌డాగ్‌ల పని చేస్తుంది. ఇందులో రాజకీయ జోక్యానికి అవకాశం ఉన్నప్పుడు ఆర్థిక వ్యవస్థపై తన నియంత్రణ కోల్పోయి ప్రభుత్వ ఆజ్ఞలకు అనుగుణంగా తన నిర్ణయాలు తీసుకుంటుంది. సరిగ్గా భాజపా అధికారంలోకి వచ్చిన అనంతరం ఆర్‌బీఐ సంస్థలో ఇదే జరిగింది. తన విధానాలకు అనుగుణంగా ఒక రాజ్యాంగ బద్ధమైన సంస్థను కీలుబొమ్మగా మార్చేసింది. దీంట్లో భాగంగా రఘురాం రాజన్ లాంటి ప్రతిభ గలిగిన ఒక గొప్ప ఆర్థిక వేత్తని అవమానాలకు గురి చేసి పదవికి రాజీనామా చేసేలా సుబ్రహ్మణ్యం ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి ఆర్‌బీఐని చెప్పుచేతుల్లో పెట్టుకుంది. అనంతరం ఆర్‌బీఐ గవర్నర్‌గా తనకు అనుకూలంగా ఉండే వ్యక్తిని తీసుకొచ్చి నోట్ల రద్దులాంటి నిర్ణయాలను అమలు చేసి అతి పెద్ద అధికారిక కుంభకోణానికి బాటలు వేసింది. మూడవ ప్రయత్నంగా దేశంలో కీలక వ్యవస్థ అయిన న్యాయ వ్యవస్థలో విబేధాలు తీసుకొచ్చి తొలిసారిగా న్యాయ వ్యవస్థ బజారుకు ఎక్కేలా చేయడంలో విజయవంతమైంది. దీనికి కారణం ఇటీవలి కాలంలో న్యాయ వ్యవస్థ ప్రాధాన్యత పెరగడం, ప్రభుత్వానికి అనుగుణంగా పని చేసే జడ్జిల ద్వారా ప్రభుత్వ కేసులకు సంబంధించి అనుగుణమైన తీర్పులను తెచ్చుకోడానికి సుప్రీంలో ఇటీవలి కాలంలో జరిగిన సంఘటనలు రూఢి పరుస్తున్నాయి. ఇక సామాజిక విషయాలకు సంబంధిస్తే దేశంలో ప్రజలను కులాల వారిగా, మతాల వారిగా చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ది పొందడానికి ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగా హిందువుల నుండి గో రక్షణ పేరుతో దళితులను వేరు చేసింది. ఒక వైపు ఐక్యత అని ప్రకటనలు గుప్పిస్తూనే వివాదాస్పద వ్యాఖ్యలతో హిందు ముస్లింల మధ్య ద్వేష భావాన్ని మరింతగా పెంచుతుంది. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం నెలకొన్న పరిస్థితుల్లో పెట్టుబడులు తీసుకొస్తామంటూ మోడీ గారు ప్రపంచ యాత్రలు చేస్తున్నారు. అమెరికా లాంటి అగ్ర దేశాలకు దగ్గరవ్వాలనే ఆత్రుతతో అమెరికాకు దగ్గరైన ప్రయోజనం మాత్రం నెగెటివ్‌లో ఉంది. ట్రంప్ తన ఆర్థిక విధానాలతో భారతీయులకు నష్టం జరిగేలా వ్యవహరిస్తున్నారు. మోడీ ప్రపంచ యాత్రల మోజులో పడి దేశంలోని సమస్యలను గాలికి వదిలేసారు. సమాఖ్య వ్యవస్థ బలోపేతం అంటూనే రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బ తినేలా జీఎస్‌టీని తెచ్చారు. ఇలా చెబుతూ పోతే మోడీ ప్రభుత్వం వల్ల ప్రజలకు జరిగిన లాభం కంటే నష్టమే అధికంగా ఉంది. ఏ ప్రభుత్వ పథకాలలోనైనా 100శాతం లాభం ఉండదు. కానీ గరిష్ట ప్రయోజనం మాత్రం ప్రజలకు అందాలి. అప్పుడే ప్రభుత్వాల మీద ప్రజలకు విశ్వాసం ఉంటుంది.

సెల్ : 7793941842

కులాల విభజనను చెరిపేయాలి



దుర్గం వెన్నెల

ప్రస్తుత కాలంలో డిగ్రీలు, ఇతర కోర్సులు చేసిన విద్యార్థులకు ఒక ప్రశ్న. ఈ కాలంలో కులం ఉందా లేదా అని అడిగితే సగం మంది వేరే ఆలోచన, తడబాటు లేకుండా "ఈ రోజుల్లో కులం ఎక్కడిది....? మేమూ మా ఫ్రెండ్ అందరం కుల బేధాలు లేకుండా కలిసిమెలిసి ఉంటాం" అంటా రు. ఒక పరిధి దాటి విద్యార్థులు ఆలోచించకుండా చేసేలా చరిత్ర పుస్తకాలు తయారు చేయబడ్డాయి. చరిత్రలో అమలు చేయబడ్డ కుల వ్యవస్థ, అంటరానితనం, దళితుల దుస్థితి గురించి పాఠ్యపుస్తకాలలో కూడా కనబడనీయకుండా కనుమరుగు చేశారు. ఇల్లు దాటని విద్యార్థులు, కళాశాలలను, పాఠ్యపుస్తకాలను దాటని వాళ్ల మనస్సులు తమను తాము సంతృప్తి పరిచే ఇలాంటి సమాధానాలే వాళ్లకిష్టం. కులం రుగ్వేద, మలివేద కాలాల్లో ఉన్న దానికంటే ఇప్పుడు కొద్దిగా మార్పు చెందింది. దానర్థం ఆ మార్పు కుల వివక్షలో కాదు, దాన్ని అమలు చేయడంలో. ఒకప్పుడు కులానికి ప్రత్యేక శాసనం ఉండేది. ఇప్పుడు కులానికి వ్యతిరేకంగా చట్టాలు, న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ కులానికి సమాజంలో అంతే ప్రాధాన్యత ఉంది. చట్టాలు, న్యాయాలు కుల వివక్షను అడ్డుకోలేకపోతున్నాయి. కారణం అవి భారతీయుడి మనసులో కాకుండా కాగితాలపైనే ఉండడం. కనుక కులనిర్మూలన కోసం భారత దేశానికి కావలసింది ప్రాథమికంగా సామాజిక, ఆర్థిక సమానత్వం. సమాజంలో మనుషుల మధ్య, వారి మనస్సుల మధ్య సమానత్వం లేనిదే రాజకీయ, రాజ్యాంగ సమానత్వాలు ప్రజలకు ఆశించిన రీతిలో ఉపయోగపడవు. కులం ఎన్ని జీవితాలను కాలరాసిందో చెప్పాలంటే ఆ కాలం కూడా సరిపోదేమో.! కంచికచెర్ల, చుండూరులో నర మేధం, లక్ష్మీపేట, మెట్‌పల్లి ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలోని ఏ ఒక్క ప్రదేశం కూడా మిగలదు. అది ఎన్ని ప్రేమ జంటలకు విష కౌగిళి బిగించిందో ఆ బాధ అనుభవించిన వారికే తెలుస్తుంది. మంథనిలో మధుకర్‌ని హత్య చేసింది. 2 ఏండ్ల క్రితం సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల అనే దళిత పరిశోధక విద్యార్థిని బహిష్కరించి ఆత్మహత్యకు పురికొల్పింది కూడా ఈ కుల జాడ్యమే. ఇలా ఒక వర్గం ఇంకొక వర్గాన్ని అణిచివేయడం అనేది కేవలం మన దేశంలోనే కాదు, ఇతర దేశాలలో కూడా ఒకప్పుడు ఉండేది. ఒక దేశంలో ధనిక వర్గం, పేద వర్గంపై అణిచివేతను పాటిస్తుంది. ఒక దేశంలో యజమాని వర్గం, కార్మిక వర్గం, ఒక దేశంలో తెల్ల జాతి, నల్ల జాతి. ఆయా దేశాలలో సామాజిక విప్లవం తీసుకురాబడింది. అది సమాజ శ్రేయస్సు కోసం సామాజిక సమానత్వాన్ని బోధించింది. దానికి ఆ ప్రజలు ఈ నాటికీ కట్టుబడి ఉన్నారు. దురదృష్టవశాత్తూ మన దేశంలో సామాజిక విప్లవం ఇంకా రాలేదు. దానికి మన ప్రజలు కూడా సిద్ధంగా లేరు. కారణం ఏమిటి? భారతీయుడు సమానత్వాన్ని అగ్రవర్ణాల వాడు అంటరాని వాడు అంగీకరించలేకపోతున్నాడు. కారణం చాతుర్వర్ణ కుల వ్యవస్థను గుడ్డిగా నమ్మడం. దేవుడిని గాఢంగా పూజించే ఒక తక్కువ కులపు వ్యక్తికి ఆ దేవుడే నిన్ను అంటరాని వాడిగా బతకమని నిర్ణయించాడు అని చెబితే ఆ శాస్త్రాలపై, పురోహితుడి మాటలపై పూర్తి నమ్మకాన్ని కలిగి ఉన్న ఆ వ్యక్తి మరో జన్మలోనైనా అగ్రకులపు వాడిగా పుట్టించమని వేడుకోవడం తప్ప, సమానత్వాన్ని ఎలా ఆహ్వానించగలడు? ఇదే ఒక విదేశీయుడిని "అమెరికాలో మీలో తెల్ల జాతి, నల్ల జాతి అనే బేధాలు ఉండేవి కదా" అని అడిగితే.. ఆ విదేశీయుడు" అవును! ఒకప్పుడు ఉండేవి, అప్పుడు మేం అనాగరిక స్థితిలో ఉండేవాళ్లం. ఇప్పుడు మేం నాగరికులం. ఒక వ్యక్తి స్వభావం, ప్రతిభను బట్టే ఆ వ్యక్తికి విలువ ఇవ్వడం జరుగుతుంది" అంటాడు. మన దేశం ఇంకా అనాగరిక స్థితిలోనే ఉంది అని చెప్పడానికి నేనేమాత్రం సంకోచించను. ప్రజలు అంత సులువుగా సమానత్వాన్ని అంగీకరించకపోవడానికి కారణం "ఈ కులాలు నేను పుట్టించినవి, జాగ్రత్త" అనే హెచ్చరిక పురోహిత వర్గం దేవుడి చేత చేయించడం... తక్కువ కులాల వారితో సంబంధాల కారణంగా మైల పడిపోతామనే మూఢనమ్మకాల మీదనే కులం కుర్చీ వేసుకుని దర్జాగా కూర్చుంది.

సెల్:8008861369

ప్రేమతో మనం పరిపూర్ణం అవ్వాలి



విరాజిత

ప్రేమ.. ఇది రెండే అక్షరాలు కానీ సమస్త విశ్వాన్ని నడుపుతున్న వాహనం. మనిషి ఎప్పుడూ ఏదో ఒకటి తనలో ఐక్యం చేసుకోవాలని తపిస్తూ ఉంటాడు. అందులో భాగంగానే ప్రేమను కూడా ఇమిడ్చుకోవాలని తహతహలాడుతుంటాడు. ప్రేమ చాలా రకాలుగా విభజించవచ్చు. ఆర్థిక, సామాజిక, భావపరమైన, శారీరక, ఇలా ఎన్నో...? శారీరకంగా ఒక మనిషిని తనకు ఇష్టం లేకుండా కోరుకుంటున్నాం అంటే వారి దేహాన్ని క్రూరంగా ప్రేమిస్తున్నాం అనే కదా ! అవతలి వ్యక్తి వద్దన్నా వారిని అనుభవించాలి. ఇలాంటి ప్రేమ వల్ల పరుల జీవితాలు నాశనం అవుతాయి. అసలు ఒక మనిషికి ఇష్టం లేకుండా ప్రేమించకూడదా? అంటే ప్రేమించవచ్చు కానీ ఆ మనిషిని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టకుండా... తన శరీరాన్ని కూడా ప్రేమించవచ్చు. కానీ అనుభవించాలి అనే రాక్షస ప్రేమ ఉండకూడదు. అసలు ప్రేమలో అనుభవించడం ఏమిటి? ప్రేమ మనసుకు సంబంధించినది కదా? అని చాలా మంది వ్యర్థ మాటలు మాట్లాడుతుంటారు. ప్రేమ కేవలం మనసుకు సంబంధించినది కానే కాదు. ప్రేమ అన్ని విషయాలకు, శరీరంలో అన్ని భాగాలకు సంబంధించినది. ఎందుకంటే ప్రేమ ఎప్పటికీ మనసునే ప్రేమించలేదు. కనీసం కొన్ని క్షణాలైనా శరీరాన్ని లేదా అవతలి వ్యక్తిలో ఉన్న ఇతర విషయాలను కూడా ప్రేమిస్తుంది, అదే ప్రేమంటే. కానీ నేడు శతిమించిన ప్రేమ రాక్షసంగా మారి అమాయక ఆడపిల్లలను బలి చేస్తున్నది. ఇక్కడ మరో విషయం చెప్పాలి. ప్రేమలో పరిపూర్ణం ఎప్పుడు అంటే తన పార్ట్‌నర్‌తో పడక గదిలో ఉన్నప్పుడు తన శరీరాన్ని ప్రేమించాలి. ఆమె/అతనికి ఇష్టం ఉన్న విధంగా ఇరువురు కలిసి సుఖపడాలి. కానీ మన దేశంలో స్త్రీని పడకగదిలో తక్కువగా లేదా యాక్టివ్‌గా ఉండేలా చేయలేదు. అంటే ఆమె తన కోరికలను అణచి వేసుకొని బతుకుతున్నది. మగాడు ఏమైనా చేయవచ్చు... ఏమైనా పార్ట్‌నర్‌ని అడగవచ్చు.. స్త్రీ అడిగితే అది తప్పు. ఆ పార్ట్‌నర్ కూడా కొత్తగా చూస్తాడు. నిజానికి ఇద్దరు ఒకరిని ఒకరు అర్థం చేసుకొని శారీరకంగా ఇద్దరు ఆనంద పడాలే తప్ప ఒకరు ఒకరికి లొంగి వారిని సుఖపెడ్డటం శారీరక ప్రేమ ఎప్పటికీ కాలేదు. అది శారీరక క్రూరమైన ప్రేమ మాత్రమే అవుతుంది. దీని వల్ల ఆడపిల్లలు నరకయాతన అనుభవిస్తున్నారు. చాలా మంది ప్రేమ రెండు రకాలుగా ఉంటుందని అది ఒకటి స్వార్థమైనది. మరొకటి నిస్వార్థమైనదని. నిస్వార్థ ప్రేమకు ఉదాహరణగా తల్లీ బిడ్డల ప్రేమను ఉదాహరిస్తారు. కానీ అందులో కూడా స్వార్థం ఉన్నది. అది చిన్నదో పెద్దదో మొత్తానికి స్వార్థం అయితే అన్నింటిలో ఉన్నది. బిడ్డకు పెండ్లి అయిన తర్వాత కూడా నాకే ప్రాముఖ్యత ఇవ్వాలి అన్నది కూడా అత్యాశే, స్వార్థమే అవుతుంది. నిజంగా తల్లి ప్రేమ కన్నా గొప్పది ఈ సష్టిలో లేదు. కానీ అందులో స్వార్థం లేదంటే ఒప్పుకోను. కాకపొతే అది స్వచ్ఛమైన స్వార్థం అది కూడా ఉండకూడదు మరి. కావున ప్రేమలో అన్నీ ఉండాలి ఉగాది పచ్చడిలా. హద్దులు లేని ప్రేమ బ్రేకులు లేని వాహనం లాంటిది. ఎప్పటికైనా ఎవరినో ఒకరిని బలి తీసుకుంటుంది. పరిమిత ప్రేమతో ఉండాలి. ప్రేమ గొప్పదని, విలువలు ఉన్నదని చెప్పడం సబబు కాదు. నిజానికి ప్రేమ ఎన్నో నేరాలు చేస్తుంది, చేయిస్తుంది. కొన్ని బంధాలను తెంచుతుంది. మరి గొప్పది ఎలా అవుతుంది. కావున ప్రేమలో కూడా మంచీ చెడు అన్నీ ఉన్నాయి. దానిని అమితంగా ఉంచుకుంటే జీవితం సుందరవనం లేదంటే చీకట్లే. మొత్తం మీద ప్రేమ పరిధులు దాటకూడదు. దాటితే నాశనమే.

సెల్ : 9700747280

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

బీఎల్‌ఎఫ్‌కు రూ.1.03 లక్షల విరాళం




నవతెలంగాణ-సంగారెడ్డి ప్రతినిధి

రాష్ట్రంలో 'సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి' సాధన కోసం ఏర్పడిన బీఎల్‌ఎఫ్(బహుజన లెఫ్ట్ ఫ్రంట్) బలోపేతానికి ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 26 కార్మిక సంఘాల నాయకులు స్వచ్ఛందంగా లక్షా 3 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు జిల్లా నాయకులు బీరం మల్లేశం బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. సభ విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ బీఎల్‌ఎఫ్ జిల్లా కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. 2వేల మంది హైదరాబాద్‌లోని లింగంపల్లి నుంచి సంగారెడ్డి వకు రోడ్‌షో నిర్వహించినట్టు తెలిపారు. రాజకీయ ప్రత్యామ్నాయం, బహుజన రాజ్యాధికారం కోసం పేదల సంక్షేమానికి బీఎల్‌ఎఫ్ నిర్మాణమైందని పేర్కొన్నారు. పటాన్‌చెరు నుంచి మొదలుకుని జహీరాబాద్ వరకు ఉన్న సీఐటీయూ పరిశ్రమలు, యూనియన్లు ఫ్రంట్ బలోపేతానికి రూ.1లక్షా 3వేల ఫండ్‌ను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎల్‌ఎఫ్ బలోపేతానికి మున్ముందు ఇదే తోడ్పాటునందించి సహాయ సహకారాలందించాలని జిల్లా ప్రజలను మల్లేశం కోరారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

- లైన్‌మెన్ నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆందోళన



నవతెలంగాణ-కోదాడరూరల్

విద్యుద్ఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గణపవరం శివారులో బుధవారం జరిగింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబసభ్యులు రాస్తారోకో చేశారు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం దూదియాతండాకి చెందిన బాదావత్ గోపి(22) జహంగీర్ అనే ప్రయివేట్ విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. గణపవరం గ్రామ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపో వడంతో లైన్‌మెన్ ఎల్‌సీ చెక్ చేయకుండా గోపిని స్తంభం ఎక్కించాడు. విద్యుత్ సరఫరా ఉండటంతో గోపి విద్యుద్ఘాతంతో స్తంభంపైనే చనిపో యాడు. ఇది గమనించిన విద్యుత్ అధికారులు అక్కడినుంచి వెళ్లిపో యారు. గోపి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ విద్యుత్‌స్తంభం వద్దకు చేరుకున్నారు.

తమ కుమారుడు మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని విద్యుత్‌స్తం భం పైనుంచి తీయకుండా రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. లైన్‌మెన్‌పై, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు లు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్ప డంతో ఆందోళన విర మించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ రవి తెలిపారు.

ఎమ్‌వి రావుకు ఆర్టీసీ పీఆర్ విభాగం అభినందనలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎమ్ వెంకటేశ్వరరావుకు ప్రజాసంబంధాల విభాగం అధికారులు అభినందనలు తెలిపారు. సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీఆర్ కిరణ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటేశ్వరరావు రీజినల్ మేనేజర్ (హైదరాబాద్)గా సమర్ధవంతంగా పనిచేశారని, ప్రస్తుత హోదాలో మరిన్ని సేవల్ని సంస్థకు అందిస్తారని అభిలషించారు. ఆయనతోపాటు ప్రజాసంబంధాల విభాగం అధికారులు జి రాధాకృష్ణ, వి సుధాకర్, బీడిపి కుమార్, ఎమ్ఎస్ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. సంస్థ ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కువైట్ నుండి స్వదేశానికి చేరిన తొలి బృందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కువైట్ నుండి బయలుదేరిన మొదటి బృందం మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత హైదరాబాద్ చేరుకుంది. కువైట్ నుండి వచ్చిన 9 మందికి శంషాబాద్ విమానాశ్రయంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జాగృతి యువత అధ్యక్షులు కొరబోయిన విజయ్ తదితర నాయకులు స్వాగతం పలికారు. తమను స్వదేశానికి రావడానికి సహకరించిన ఎంపీకవితకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఏడు సంవత్సరాల తర్వాత కువైట్ ప్రభుత్వం తొమ్మిదిమందికి క్షమాభిక్ష ప్రకటించింది. స్వదేశానికి వచ్చేందుకు విమాన టికెట్ చార్జీలకు డబ్బులు లేకపోవడంతో ఎంపీ కవిత ఆదుకున్నారని బాధితులు తెలిపారు. కువైట్ జాగృతి శాఖకు కవిత అభినందనలు తెలియజేశారు.

రూ.220 కోట్లతో రాష్ట్రంలో 'విప్రో' యూనిట్

హైదరాబాద్ : రాష్ట్రంలో సబ్బులు, సౌందర్య సాధనాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రముఖ సంస్థ విప్రో సంసిద్ధత వ్యక్తం చేసింది. వరల్డ్ ఐటి కాంగ్రెస్ సందర్భంగా విప్రో సంస్థ ఛీఫ్ స్ట్రాటెజీ అఫీసర్ రిషద్ ప్రేమ్ జీ తో పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం సమావేశం అయ్యారు. విప్రో కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ విభాగం అద్వర్యంలో సబ్బులు, మరియు ఇతర సౌందర్యసాధనాల తయారీ కేంద్రాన్ని మహేశ్వరం మండలంలో ఏర్పాటు చేయనున్నట్టు ప్రేమ్‌జీ తెలిపారు. రూ. 220 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.

మోడీ నీడ.. పెట్టుబడిదారుల పడగ



గత ప్రధాని మన్మోహన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ ఆశ్రిత పెట్టుబడిదారుల గుప్పిట్లో చిక్కు కున్నట్టు విన్నాం. ఇప్పుడు మోడీ హయాంలో అదే వైనాన్ని కండ్లారా చూస్తున్నాం. వజ్రాల వ్యాపారులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ వంటి వారి ఆధ్వర్యం లోని కంపెనీలు బ్యాంకులను దాదాపు రు.20 వేల కోట్లకు పైగా మోసగించినా, ప్రధాని మోడీ ఇప్పటి వరకూ దీనిపై పెదవి విప్పలేదు. ఈ బ్యాంకు మోసం మొత్తాన్ని పారు బాకీల కింద పరిగణించే ప్రయత్నం చేస్తున్నా ప్రధాని నుండి కనీస స్పందన కరువైంది. తన హయాంలో వ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశానంటూ ప్రధాని మోడీ పదేపదే చెబుతున్న మాటలన్నీ నీటి మూటలేనన్న విషయాన్ని ఇటీవలి కాలంలో తరచు వెలుగు చూస్తున్న బ్యాంకు కుంభకోణాలు స్పష్టం చేస్తున్నాయి.



న్యూఢిల్లీ: రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద నమోదయిన దాదాపు 3 లక్షలకు పైగా డొల్ల కంపెనీలను తమ ప్రభుత్వం డి రిజిస్టర్ చేసిందంటూ ప్రధాని మోడీ పదేపదే చెబుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ డొల్ల కంపెనీలలో నీరవ్ మోడీ, చోక్సీలకు సంబంధించిన దాదాపు 200 కంపెనీలకు స్థానం దక్కలేదు. మోడీ, చోక్సీలు బ్యాంకుల నుండి మోసపూరితంగా తీసుకున్న దాదాపు రు.11,400 కోట్ల మొత్తాన్ని ఈ కంపెనీలలోనే పెట్టుబడులు పెట్టారన్న విషయాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు వెల్లడించాయి. ఇంటర్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ మెస్సేజింగ్ సిస్టమ్ (స్విఫ్ట్)ను స్వతంత్రంగా నిర్వహించగల సామర్థ్యాన్ని తమ కంపెనీ ఉద్యోగులకు కల్పించి వారిని నీరవ్‌మోడీ, మెహుల్ చోక్సీ బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రవేశపెట్టటం ద్వారా ఈ మోసానికి పాల్పడ్డారన్నది వాస్తవం. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన వివిధ అధికారుల లాగిన్ సమాచారాన్ని ఉపయోగించి వీరు ఈ మోసానికి పాల్పడ్డారన్న విషయం బ్యాంకింగ్ వ్యవస్థ పెట్టుబడిదారుల చేతుల్లో ఏ విధంగా చిక్కుకున్నదీ విశదం చేస్తోంది. బ్యాంకులు అంతర్గత సంస్కరణలకు కచ్చితంగా కట్టుబడి తమ పాలనావిధానాలను మెరుగుపర్చుకోవాలన్న షరతుపై గత ఏడాది ఆరంభంలో బ్యాంకులకు పెట్టుబడులు(రీ కాపిటలైజేషన్) అందచేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించిన సమయంలోనే పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుండి మోసపూరితంగా భారీ సంఖ్యలో హామీపత్రాలు (ఎల్‌ఓయూ)లు జారీ అయ్యాయి. కేంద్రం అందచేసిన పెట్టుబడుల్లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రు.5 వేల కోట్లు అందాయి. అయితే దురదృష్టవశాత్తూ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇందుకు మూడు రెట్లకు పైగా ఇప్పటికే నష్టపోయింది. రానున్న ఏడాది, రెండేండ్ల కాలంలో బ్యాంకులకు రు.2 లక్షల కోట్ల మేర పెట్టుబడులు సమకూర్చాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ తాజా పెట్టుబడుల్లో ఒక్క రూపాయి కూడా మోసాలు కేసుల్లోకి, ఎన్‌పీఏలలోకి పోకూడదనే ఎవరైనా ఆశిస్తారు. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రకటిత ఎన్‌పీఏలు రు.9 లక్షల కోట్ల పైమాటే. ఇందులో దాదాపు 30 శాతం మేర గత లాభాల నుండి సర్దుబాటు చేసేందుకు ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిలో దివాలా తీసినట్టు కోర్టులు ప్రకటించిన వాటి సంఖ్య కూడా 30 శాతానికి మించటంలేదు. బ్యాంకులు అందచేసిన మొత్తం రుణాలలో సుమారు 40 శాతం మేర ఎన్‌పీఏలుగా మారాయనుకున్న ప్పటికీ దీని విలువ సుమారు రు.4 లక్షల కోట్ల పైమాటే. ప్రభుత్వం అందచేసిన తాజా పెట్టుబడు ల్లో రు.2లక్షల కోట్లు ఇందులో సగంమేర సర్దుబాటు చేయటానికే సరిపోతోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కు చెందిన కంప్యూటర్ వ్యవస్థలను నీరవ్‌మోడీ బృందం అనధికారికంగా తమాధీనంలో వుంచుకుని తమ కార్యకలాపాలను నడిపించుకుంది.

అదానీ నుండి అంబానీ వరకు

ఆదానీ నుండి అంబానీ వరకూ బొగ్గు దిగుమతుల్లో ఓవర్ ఇన్వాయిసింగ్‌కు పాల్పడి బ్యాంకులను మోసం చేసిన వైనం కూడా ఇదే తరహాలో కొనసాగింది. పెట్టుబడిదారులందరిదీ ఒకటే సూత్రం... మోడీ అధికారం చేపట్టినప్పటి నుండి ఆర్థిక, బ్యాంకింగ్ వ్యవస్థలతో ఆటలాడుకోవటమే.. బ్యాంకు రుణాలను చెల్లించని దివాలా సంస్థల ఆస్తులను వేలానికి పెట్టినపుడు, వాటి యజమానుల దూరపు బంధువులే ఆ సంస్థలను కారు చౌకగా కొట్టేసేందుకు బిడ్డింగ్ దాఖలు చేస్తుంటారు. తద్వారా ఈ ప్రక్రియ అంతా ఒక నాటకంలా మారుతోంది. ఈ కార్పొరేట్ గ్రూపుల్లో కొన్ని మోడీ సర్కారుతో ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవటం ద్వారా తమ వ్యాపారాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రక్షణ ఉత్పత్తులు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టుల వంటి వాటిలో కొన్నింటిని చేపట్టిన ఈ కంపెనీలలో కొన్ని సంస్థలు ఇప్పటికీ బ్యాంకులకు రు.3 లక్షల కోట్లకు పైగా బాకీలు చెల్లించాల్సి వుంది. ఈ సంస్థలు తీసుకున్న రుణాలలో అధిక మొత్తాలను ఓవర్ ప్రైసింగ్ విదేశీ దిగుమతులపై వెచ్చించినట్లు ఆర్థిక మంత్రిత్వ దర్యాప్తులో స్పష్టమైనప్పటికీ బ్యాంకులు కానీ, ఆర్బీఐ కానీ వీటిపై చర్యలు తీసుకోలేదు. సొంత ప్రభుత్వంలోని విభాగాలే స్వయంగా దర్యాప్తు చేసి నిగ్గు తేల్చిన విషయాలపై అటు ప్రధాని కానీ, ఇటు ఆర్థిక మంత్రికానీ స్పందించకపోవటం ఎవ్వరికీ అంతుపట్టని విషయంగా మారింది.

రాంగోపాల్ వర్మపై విశాఖలో కేసు


విశాఖ :మహిళల పోరాటం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మపై కేసు నమోదుకు అంగీకరించింది. ప్రభుత్వం నుండి అందిన ఆదేశాలతో బుధవారం రాత్రి విశాఖ పోలీసులు రాంగోపాల్‌వర్మపై కేసు నమోదు చేశారు. వర్మ తీసిన జీఎస్టీ సినిమా సమాజంపై చెడు ప్రభావం చూపుతుందని మహిళలు కొద్దికాలంగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మహిళల నుద్దేశించి వర్మ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. వీటిపై అటు హైదరాబాద్‌లోనూ, విశాఖలోనూ పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

జులైలో విద్యార్థులకు హెల్త్‌కార్డులు

- విద్యార్థినులకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్:
సమీక్షా సమావేశంలో డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, మంత్రి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని సర్కారు బడుల్లో చదివే 30లక్షల మంది విద్యార్థులకు జూలై నుంచి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్‌కార్డులు ఇవ్వనున్నట్టు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రకటిచారు. ఆరునెలల్లో విద్యార్థులందరికీ పరీక్షలు పూర్తి చేయనున్నట్టు చెప్పారు. బుధవారం సచివాలయంలో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, హెల్త్‌కిట్స్ పంపిణీ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖ గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ, జిల్లా పరిషత్



పాఠశాలల్లోని సుమారు 8 లక్షల మంది విద్యార్థినులకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇప్పటికే కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలోని 3లక్షల మందికి విద్యాశాఖ ఈ కిట్స్ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే ఏడు నుంచి పదో తరగతి విద్యార్థినులందరికీ యుక్తవయస్సులో వచ్చే ఆరోగ్య సమస్యలు, సంరక్షణపై కూడా అవగాహన తరగతులు నిర్వహించాలని , దీనికి పాఠశాలల్లోని మహిళా ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వాలని చెప్పారు.

ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్, ఎన్.హెచ్.ఎం చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, మోడల్ స్కూల్స్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

93 మంది బీఈడీ విద్యార్థులకు అన్యాయం

నవతెలంగాణ-చేవెళ్ల

రంగారెడ్డి జిల్లాలో బీఈడీ విద్యాసంస్థ తప్పిదంతో 93 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. యాజమాన్యం గడువులోగా ఉన్నత విద్యామండలికి పరీక్ష ఫీజులను కట్టకపోవటంతో హాల్‌టికెట్లు అందక విద్యార్థులు పరీక్షను బుధవారం రాయలేకపోయారు. విద్యార్థులంతా పోలీస్‌స్టేషన్‌లో విద్యాసంస్థపై ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్‌లో గల రవీంద్రనాథ్ ఠాగూర్ కళాశాలలో ఈ ఏడాది ఆగష్టులో 93 మంది విద్యార్థులు బీఈడీ కోర్సులో చేరారు. వీరిలో కొంత మంది ఎడ్‌సెట్ పరీక్ష రాసి కౌన్సిలింగ్‌లో సీటు పొందగా, మరికొందరు యాజమాన్య కోటాలో ప్రవేశాలు పొందారు. ఎక్కువగా ఇతర జిల్లాల విద్యార్థులే అడ్మిషన్లు పొందారు. వారి నుంచి కళాశాల యాజమాన్యం డిసెంబర్, జనవరి నెలలో పరీక్ష ఫీజులు వసూలు చేసిం ది. ఉన్నత విద్యామండలికి పంపలేదు. దీంతో విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ కాలేదు. బుధవారం నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరు గుతాయని ప్రకటించడంతో హాల్‌టికెట్ల కోసం వారం రోజులుగా విద్యార్థు లు కళాశాలకు వచ్చి వెళ్తుతున్నారు. రేపు మాపు వస్తాయంటూ మంగళ వారం వరకు తిప్పుకున్నారు. తీరా పరీక్ష జరిగే రోజు కూడా ఇవ్వకపో వడంతో విద్యార్థులు ఆందోళనకు గురై చేవెళ్ల పోలీసులను ఆశ్రయించా రు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్ విషయం తెలుసుకుని కళాశాల కు వెళ్తే అక్కడ ఎవరూ లేరు. కళాశాల యాజమాన్యాన్ని ఫోన్‌లో సంప్ర దించగా హాల్‌టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. మధ్యా హ్నం రెండు గంటలకు పరీక్ష ఉండగా ఆ సమయం వరకు వేచి చూసిన విద్యార్థులకు హాల్‌టికెట్లు అందకపోవడంతో పరీక్ష రాయలేకపోయారు.

తమకు న్యాయం చేయాలంటూ హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి అధికారులను, ఉస్మానియా ఎడ్‌సెట్ కన్వీనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని విద్యార్థులు తెలిపారు. హాల్‌టికెట్లు అందక పరీక్ష రాయలేకపోవడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నత విద్యామండలి అధికారులు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇప్పించి రెండో రోజు నుంచైనా పరీక్షకు అనుమతించాలని కోరుతున్నారు.

మిషన్ కాకతీయ మీడియా అవార్డులు ప్రకటించిన నీటిపారుదల శాఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మిషన్ కాకతీయ అవార్డులకు ఎంపికయిన మీడియా ప్రతినిధుల జాబితాను నీటిపారుదల శాఖ విడుదల చేసింది. 2017 సంవత్సరానికి ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా విభాగాల్లో 'మిషన్' అవార్డుల కోసం వచ్చిన ఎంట్రీల ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. ప్రింట్ మీడియా విభాగంలో నోముల రవీందర్ రెడ్డి (ఆంధ్రజ్యోతి), అక్కలదేవి శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), కె. మల్లిఖార్జునరెడ్డి (సాక్షి) ఎంపికయ్యారు. తెలంగాణ టుడే ప్రతినిధి పిల్లలమర్రి శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ప్రతినిధి యాట్ల చిన్నారెడ్డి స్పెషల్ జ్యూరీ అవార్డులకు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో కె. శ్రీశైలం (ఈటీవీ), బి. గురుప్రసాద్ (టీవీ 1), కె. విక్రమ్‌రెడ్డి (సాక్షి టీవీ) ఎంపికయ్యారు. డి. సూర్యనారాయణ (ఈటీవీ), అంజి (టీవీ 1) స్పెషల్ జ్యూరీ అవార్డులకు ఎంపికయ్యారు. దూరదర్శన్ యాదగిరి ప్రతినిధి శ్రీరాములు గౌడ్ జ్యూరీ ప్రత్యేక బహుమతికి ఎంపికయ్యారు.

కాకతీయ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం 2016లో నవంబర్‌లో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో సమర్పించిన వ్యాసాల సంకలనానికి ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది. జ్యూరీ చైర్మన్‌గా ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ, సభ్యులుగా బాల కోటేశ్వరరావు (తెలంగాణ టుడే), టి. కృష్ణమూర్తి (ఆంధ్రజ్యోతి) వ్యవహరించారు. మిషన్ కాకతీయ అవార్డులకు ఎంపికయిన మీడియా ప్రతినిధులను నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో అభినందించారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయాలి : మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ ఏప్రిల్ 2017 చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆ ప్రకటన చేయలేదని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి చెప్పారు. వెంటనే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు ఎస్‌డబ్ల్యుయూ(ఐఎన్‌టీయూసీ అనుబంధం సంఘం) నేతలు ఇదే అంశంపై మల్లు రవికి వినతిపత్రం సమర్పించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ కండక్టర్స్, డ్రైవర్స్, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. చిన్న చిన్న విషయాలకే సస్పెన్షన్లు, రిమూవల్ అంటూ వేధింపులకు గురిచేస్తోందన్నారు. ఆర్టీసీ నష్టాల్లో ఉందని పేర్కొంటూ గత బడ్జెట్‌లో రూ 670 కోట్లు కేటాయించి, రూ 260 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలో వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన టీఎన్‌ఎంయూ సంఘం కూడా ఏమీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుయూ నేతలు అబ్రహం, హఫీజ్ తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాడుగులపల్లి మండలం ధర్మపురం గ్రామపంచాయతీ పరిధి గోపాలపురానికి చెందిన రైతు బోడ యాదయ్య ఎస్సెల్బీసీ-37 కెనాల్‌కు గండి పెట్టి నీళ్లు వాడుకుంటున్నాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి సైదులు గండి పెట్టొద్దని వారించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. యాదయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడ్తానని సైదులు బెదిరించాడు. బెండకాయలు అమ్మడానికి బుధవారం ఉదయం నల్లగొండ పట్టణ కేంద్రానికి వచ్చిన యాదయ్య పురుగుల మందు డబ్బా కొనుక్కుని కలెక్టరేట్‌కు వచ్చాడు. ఫీల్డ్ అసిస్టెంట్ తనను బెదిరిస్తున్నాడని అధికారులకు వినతిపత్రం అందజేశాడు. వారు స్పందించకపోవడంతో పురుగుల మందు తాగాడు. కార్యాలయ సిబ్బంది గమనించి వెంటనే యాదయ్యను జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరిబాబు తెలిపారు.

టీటీడీలో హైందవేతరులను తొలగించొద్దు

హైకోర్టు ఉత్తర్వులు



హైదరాబాద్: హైందవేతరులను ఉద్యోగాల నుండి తొలగించవద్దని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ను హైకోర్టు అదేశించింది. ఈ మేరకు బుధవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. అన్యమతస్తులను తొలగించకూడదని, ఉద్యోగాల్లో కొనసాగించాలని పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని పేర్కొంది. హైందవేతర ఉద్యోగులను విధుల నుండి ఎందుకు తొలగించకూడదంటూ ఇఓ నోటీస్ జారీ చేయడంపై దాఖలపై పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా ఎన్నో ఏండ్ల కిందట ఉద్యోగాల్లో చేరిన అన్యమతస్తులను ఇప్పుడు ఎలా తొలగిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. విధుల్లో చేరే సందర్భంగా తాము హైందవేతరలమేనంటూ ఇచ్చిన డిక్లరేషన్‌ను కూడా ప్రస్తావించింది. డిక్లరేషన్ తీసుకుని ఉద్యోగాలు ఇచ్చిన తరువాత ఇప్పుడెలా తొలగిస్తామనడాన్ని ఎలా సమర్ధించుకుంటారని ప్రశ్నించింది. ఇవో ఇచ్చిన నోటీసులకు స్పందించి ఎవరైనా వివరణ ఇచ్చినా, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఉద్యోగాల్లో చేరేప్పుడు అన్యమత ప్రచారం చేయమని ఉద్యోగాల్లో చేరే సమయంలో హామి ఇచ్చారని, దానికి అనుగుణంగా ఆదేశాలు ఇవ్వాలని టిటిడి తరపు లాయర్ ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఉద్యోగులు ఎవరైనా ఆ హామీని ఉల్లంఘిస్తే వారిపై దేవస్థానం చర్య తీసుకోవాలని హైకోర్టు సూచించింది. ఈ కేసులో ఈవో తమ వాదనతో కౌంటర్ దాఖలు చేయాలని బెంచ్ నోటీసులు ఇచ్చింది. విచారణను వాయిదా వేసింది.

హైకోర్టు తీర్పుపై టీటీడీ ఉద్యోగుల పరిరక్షణ కమిటీ హర్షం

తిరుమల తిరుపతి దేవస్థానంలో మూడు దశాబ్దాల పాటు విశేష సేవలందిస్తున్న హైందవేతరులను ఎలా తొలగిస్తారంటూ హైకోర్టు ధర్మాసనం స్టే విధించడం పట్ల టీటీడీ ఉద్యోగుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు పెనుమూరు గుర్రప్ప, కన్వీనర్ కందారపు మురళి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో ఈఓ నోటీసులను జారీ చేయడంతో 30 ఏండ్లుగా పనిచేస్తున్న తమను ఉన్నపళంగా తొలగించడం అన్యాయమంటూ ఆందోళనకు దిగారనీ, వీరికి టీటీడీ ఉద్యోగుల పరిరక్షణ కమిటీ మద్దతుగా నిలిచిందనీ వారు వివరించారు. ఓ పక్క పోరాడుతూనే....మరో పక్క న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, బుధవారం వీరి తొలగింపుపై ఏకంగా స్టే ఇచ్చిందని ఆయన చెప్పారు. తిరుపతి ప్రశాంతతను కాపాడడానికి అన్ని ప్రజాతంత్ర శక్తులూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

నవచిత్రం


నితిన్, మేఘా ఆకాష్

సరికొత్త ప్రేమ కథ ఛల్ మోహన్‌రంగ

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నికితా రెడ్డి సమర్పణలో పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ట్ మూవీస్ పతాకాలపై సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. నితిన్ నటిస్తున్న 25వ చిత్రమిది. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్రానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన లభించింది. టీజర్ సైతం ఆకట్టుకుంటోంది. ఎస్.ఎస్.థమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గా.. ఘ.. మేఘా..' అంటూ సాగే మొదటి పాటను ఈ నెల 24న విడుదల చేయబోతున్నారు. సరికొత్త ప్రేమ కథతో కూడిన కుటుంబ కథా చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

హై టెక్నికల్‌గా అహం బ్రహ్మాస్మి


క్రిష్

'కంచె', 'గౌతమిపుత్ర శాతకర్ణి' వంటి వైవిధ్యమైన సినిమాలను రూపొందించిన దర్శకుడు క్రిష్ తాజాగా బాలీవుడ్‌లో 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆ తర్వాత ఆయన తెలుగులో ఓ సినిమా చేయబోతున్నారు. తాజాగా ఆ సినిమాకు 'అహం బ్రహ్మాస్మి' అనే టైటిల్‌ను రిజిస్టర్ చేయించారు. ఈ చిత్రాన్ని సాయిబాబు జాగర్లమూడి, రాజీవ్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్ర విశేషాలను చిత్ర బృందం తెలియజేస్తూ, 'విలక్షణ దర్శకుడు జాగర్లమూడి రాధాకృష్ణ(క్రిష్) గతేడాది 'గౌతమిపుత్ర శాతకర్ణి'తో బ్లాక్ బస్టర్ హిట్‌ను అందుకోవడమే కాకుండా తెలుగువారి చరిత్రను, ఘనతను ప్రపంచానికి చాటి చెప్పారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'మణికర్ణిక' చిత్రాన్ని రూపొందిస్తూనే తెలుగులో మరో సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభించాడు. భారీ బడ్జెట్‌తో ఈ 'అహం బ్రహ్మాస్మి' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఇందులో ఓ స్టార్ హీరో నటించనున్నారు. ప్రస్తుతం సదరు హీరోతో కథా చర్చలు జరుగుతున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించ బోతున్నారు. ఆగస్ట్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి' అని తెలిపింది.

ఎన్టీఆర్ ఆన్ సైలెంట్ మోడ్


ఎన్టీఆర్

ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తొలిసారి ఓ సినిమా రూపొందుతుంది. ఆ మధ్య పవన్ అతిథిగా ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోబోతుంది. హారికా అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై రాధాకృష్ణ(చినబాబు) నిర్మించనున్నారు. ఇందులో ఎన్టీఆర్ సరసన నటించే కథానాయికగా పూజా హెగ్డేను ఫైనల్ చేశారు. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాలో మరో కీలక పాత్ర కోసం సీనియర్ నటీమణులను తీసుకోబోతున్నారట. 'అత్తారింటికి దారేదీ'లో నదియా, 'అజ్ఞాతవాసి'లో ఖుష్బు తరహాలో ఈ సినిమాలో కూడా ఓ లేడీ పాత్ర ఉందట. ఆ పాత్ర కోసం లయ, మీనా, సిమ్రాన్ వంటి పేర్లను పరిశీలిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి ఓ ఆసక్తికర టైటిల్ వినిపిస్తోంది. గతంలో 'రాముడు భీముడు', 'సోల్జర్' వంటి పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ తాజాగా 'ఆన్ సైలెంట్ మోడ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట. అయితే సినిమా టైటిలే ఇదా, లేక కేవలం క్యాప్షన్‌గానే ఉంటుందా, మెయిన్ టైటిల్ వేరే ఉందా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఈ సినిమాలో ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపించనున్నారు. అందుకోసం హాలీవుడ్ ట్రైనర్లతో తన బాడీ లాంగ్వేజ్‌ను మార్చుకునే పనిలో బిజీగా ఉన్నారట. ఈ చిత్రానికి అనిరుథ్ స్థానంలో దేవిశ్రీప్రసాద్ సంగీతం సమకూర్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. ఈ సినిమా తర్వాత రాజమౌళి రూపొందించబోయే మల్టీస్టారర్ చిత్రంలో ఎన్టీఆర్ నటించ నున్నారు. రామ్‌చరణ్ మరో హీరోగా నటించే ఈ సినిమాలో ఓ కథానాయికగా రాశీఖన్నాను అనుకుంటున్నారట.


ప్రకాష్ రాజ్, మోహన్‌లాల్

రెండు దశాబ్దాల తర్వాత..

మణిరత్నం రూపొందించిన చిత్రాల్లో 'ఇద్దరు' సినిమా ఓ సంచలనం. తమిళనాడు రాజకీయాలను ఇతివృత్తంగా తీసుకుని పొలిటికల్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో మోహన్‌లాల్, ప్రకాష్ రాజ్‌ల నటన సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళింది. 1997లో వచ్చిన ఈ సినిమా కమర్షియల్‌గా సత్తా చాటింది. ఈ సినిమాతో మోహన్‌లాల్, ప్రకాష్‌రాజ్‌లకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తర్వాత మోహన్‌లాల్, ప్రకాష్ రాజ్ కలిసి ఇంత వరకు నటించలేదు. దాదాపు 20ఏండ్ల తర్వాత ఈ ఇద్దరూ వెండితెరపై మెరిసేందుకు సిద్ధమవుతున్నారు. ఫాంటసీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న మలయాళ చిత్రం 'ఒడియన్'లో నటించనున్నారట. ఇందులో మోహన్‌లాల్ హీరోగా నటిస్తుండగా, ప్రకాష్‌రాజ్ విలన్‌గా కనిపించనున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి శ్రీకుమార్ మీనన్ దర్శకత్వం వహిస్తుండగా, మంజు వారియర్ కథానాయికగా నటించనుంది. మార్చి 6నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మోహన్‌లాల్ ప్రస్తుతం 'నీరలి', 'కయమకులమ కొచున్ని' చిత్రాల్లో, ప్రకాష్‌రాజ్ తెలుగు, తమిళం, మలయాళ, కన్నడలో భాషల్లో అరడజనుకుపైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.


రకుల్ ప్రీత్ సింగ్

శివకార్తీకేయన్‌కు జోడీగా!

గతేడాది వరకు తెలుగు సినిమాలతో బిజీగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం కోలీవుడ్, బాలీవుడ్‌పై దృష్టి సారించింది. అక్కడ వరుస అవకాశాలు దక్కించుకుంటూ దూసుకెళ్తోంది. ఇప్పటికే బ్యాక్ టు బ్యాక్ సూర్య, కార్తీల సినిమాల్లో నటిస్తున్న రకుల్ తాజాగా మరో తమిళ యువకథానాయకుడితో జోడీ కట్టేందుకు పచ్చజెండా ఊపింది. తమిళ స్టార్ శివకార్తీకేయన్ సరసన నటించనుంది. ఆర్.రవికుమార్ దర్శకత్వం వహించనున్న ఈచిత్రాన్ని ఫిక్షన్ కథాంశంతో తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కనుంది. రకుల్ నటించిన బాలీవుడ్ చిత్రం 'అయ్యారీ' ఇటీవల విడుదలై ప్రేక్షకుల అభినందనలతోపాటు విమర్శకుల ప్రశంసల్నీ సొంతం చేసుకుంటోంది. దీంతోపాటు అజయ్ దేవగన్ సరసన మరో సినిమాలో నటిస్తోంది. అకివ్ అలీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 19న విడుదల కానుంది. ఈ చిత్రం కోసం రకుల్ జీరో సైజ్‌కి చేరటం విశేషం. ఇదిలా ఉంటే రకుల్‌కి ప్రస్తుతం తెలుగులో ఒక్క సినిమా కూడా లేకపోవడం గమనార్హం.

బ్రేక్ ఇస్తుందని ఆశిస్తున్నా


రంజిత్

"దిక్కులు చూడకు రామయ్య' తరహా లవ్ స్టోరీలో కొత్త రకమైన కథాంశంతో అన్ని అంశాల మేళవింపుగా తెరకెక్కిన చిత్రమే 'జువ్వ" అని అంటున్నారు హీరో రంజిత్. త్రికోటి దర్శకత్వంలో రంజిత్, పాలక్ లల్వాని జంటగా నటించిన 'జువ్వ' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో రంజిత్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'మాది వైజాగ్. నాన్న వ్యాపారి, అన్న భరత్ డాక్టర్. హైదరాబాద్‌లోనే ఎంబీఏ పూర్తి చేశా. చిన్నప్పట్నుంచి సినిమా అంటే ఇష్టం. నన్ను నేను హీరోగా చూసుకోవాలనుకునేవాడిని. ఇంటర్ చదువుకునే టైమ్‌లో వైజాగ్ సత్యానంద్ వద్ద నటనలో శిక్షణ తీసుకున్నా. ఎంబీఏ పూర్తి చేశాక సొంతంగానే ఛాన్స్‌ల కోసం ట్రై చేశా. ఈ క్రమంలో 'నువ్వు నేను ఒకటవుదాం' చిత్రంలో నటించా. నాకిది రెండో సినిమా. మంచి కథతో సినిమా చేయాలనుకున్నప్పుడు త్రికోటి కలిశారు. ఆయన ముందుగా రెండు కథలు చెప్పారు. కానీ రత్నంగారు చెప్పిన ఈ కథ బాగా నచ్చింది. మూడు నెలలు స్క్రిప్ట్‌పై వర్కౌట్ చేసి ఈ సినిమా తీశాం. డాక్టర్ అయిన అన్నయ్య భరత్ నా కోసం ఈ సినిమాతో నిర్మాతగా మారారు. హైదరాబాద్, వైజాగ్, మలేషియా వంటి లొకేషన్లలో షూటింగ్ చేశాం. సినిమా కోసం సీనియర్ టెక్నీషియన్లు పనిచేశారు. లవ్ స్టోరీలో కొత్త అప్రోచ్‌తో సినిమా ఉంటుంది. కామెడీ, రొమాన్స్, పాటలు, యాక్షన్ ఇలా అన్ని అంశాల మేళవింపుగా సినిమా ఉంటుంది. నేను రానా అనే సరదాగా తిరిగే అబ్బాయి పాత్రలో కనిపిస్తా. హీరోల పోస్టర్స్ వేస్తుంటాను. ఈ క్రమంలో ఓ అందమైన అమ్మాయిని చూసి ఆమె ప్రేమలో పడతా. ఆ తర్వాత చోటు చేసుకున్న ఆసక్తికర సన్నివేశాల సమాహారమే సినిమా. రత్నం అద్భుతమైన కథను అందించారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం, ఆర్.ఆర్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. ఇందులో అర్జున్ అనే మలయాళ నటుడిని విలన్‌గా పరిచయం చేస్తున్నాం. దర్శకుడు త్రికోటి సినిమాను చాలా బాగా తెరకెక్కించారు. ఆయనకు నాలెడ్జ్ ఎక్కువ. షూటింగ్ చాలా విషయాలు నేర్చుకున్నాం. ఈ చిత్ర టీజర్‌ను చిరంజీవి విడుదల చేయడం ఆనందంగా ఉంది. టీజర్‌తోపాటు నాది ఫొటోజెనిక్ ఫేస్ అంటూ ఆయన ప్రశంసించారు. ఈ చిత్రానికి మొదట 'జింతాత' అనుకున్నాం. 'విక్రమార్కుడు'లో రవితేజ వాడిన పదం కాబట్టి అది పెద్దదై పోతుందని భావించి 'జువ్వ'ను దర్శకుడు ఫిక్స్ చేశారు. సినిమాను చూసి మొదటగా కీరవాణి ప్రశంసించారు. అదే నాకు అందిన ఫస్ట్, బెస్ట్ కాంప్లిమెంట్. సినిమా చూశాక ఆడియెన్స్ కూడా ప్రశంసిస్తారని ఆశిస్తున్నాం. కెరీర్ పరంగా నాకు మంచి బ్రేక్ ఇస్తుందని నమ్ముతున్నా. నెక్ట్స్ ఓ లవ్ స్టోరీతో సినిమా చేస్తున్నా. నాకు వ్యక్తిగతంగా స్పోర్ట్స్ బేస్డ్ చిత్రాలంటే ఇష్టం. అలాంటి చిత్రాల్లో ఎప్పటికైనా నటిస్తా' అని అన్నారు.


మహేష్ ఖన్నా, ప్రభాస్, సాత్విక్ ఈశ్వర్, అక్షిత

అనాథలకు పరిష్కారం చూపేలా...

సాత్విక్ ఈశ్వర్, అక్షిత జంటగా ప్రభాస్ దర్శకత్వంలో సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్ ఖన్నా నిర్మిస్తున్న చిత్రం 'సత్యగ్యాంగ్'. ఇటీవల విడుదలైన ఆడియోకు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత మహేష్ ఖన్నా మాట్లాడుతూ, 'సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి రూపొందించిన చిత్రమిది. అనాథలు ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. హీరోగా పరిచయమవుతున్న సాత్విక్‌కు మంచి భవిష్యత్ ఉంది. దర్శకుడు ప్రభాస్ మంచి సంగీతాన్ని అందించాడు. చంద్రబోస్‌తోపాటు నేను కూడా ఓ పాట రాశాను. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను మార్చి 15న విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'నాకు లైఫ్ ఇచ్చింది మా తల్లిదండ్రులైతే సినీ జీవితాన్నిచ్చింది మహేష్ ఖన్నాగారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. అనాథలుగా జన్మించిన నలుగురు యువకులు తమలా మరే అనాథ ఇబ్బంది పడకూడదని దానికో పరిష్కారం కనిపెడ తారు. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న సవాళ్ళేంటనేది సినిమా. వినోదం, సందేశం మేళవింపుగా ఉంటుంది. నిర్మాత కోసం సినిమా హిట్ కావాలి. విజయం సాధిస్తే నాలాంటి మరికొంత మందికి ఆయన లైఫ్ ఇస్తారు' అని దర్శకుడు ప్రభాస్ తెలిపారు. హీరో సాత్విక్ చెబుతూ, సినిమా కోసం దర్శకుడు, నిర్మాతలు చాలా కష్టపడ్డారు. సినిమా బాగా వచ్చింది' అని చెప్పారు. 'దర్శకుడిపై నమ్మకంతో సినిమా చేశా. మాకు మంచి పేరును తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నాం' అని హీరోయిన్ అక్షిత తెలిపారు.

అప్పడాలు అమ్మిన హృతిక్

హృతిక్ రోషన్ చిరు వ్యాపారిగా మారిపోయాడు. జైపూర్ రోడ్లపై అప్పడాలు అమ్మి ఆశ్చర్యానికి గురి చేశారు. ఆ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మధ్యమాల్లో హల్‌చల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూస్తే.. బిహార్‌కు చెందిన గణిత ఉపాధ్యాయుడు ఆనంద్ కుమార్ జీవిత చరిత్ర ఆధారంగా వికాల్ బల్ తెరకెక్కిస్తున్న 'సూపర్ 30' చిత్రంలో హృతిక్ నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ జైపూర్‌లో జరుగుతుంది. చిత్రీకరణలో భాగంగా హృతిక్ ఎవరూ గుర్తుపట్టనంతగా మారిపోయి సైకిల్ మీద అప్పడాల బుట్ట పెట్టుకొని, వీధులు చుట్టూ తిరుగుతూ అప్పడాలు అమ్మారు. అయితే హృతిక్ రోడ్డుపై సైకిల్ మీద తిరుగుతున్నా అక్కడి వారు గుర్తించలేకపోవడం విశేషం. ఇందులో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుంది.


సైకిల్‌పై అప్పడాల బుట్టతో హృతిక్ రోషన్

తుమ్హారి సులు రీమేక్‌లో...!


జ్యోతిక

మూడేండ్ల క్రితం '36 వయదినిలె' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన జ్యోతిక గతేడాది 'మగలిర్ మట్టుమ్' చిత్రంలో నటించింది. ప్రస్తుతం 'నాచియార్', 'చెక్కా చివంత వానమ్' చిత్రాల్లో నటిస్తున్న ఆమె తాజాగా బాలీవుడ్‌లో రీమేక్‌లో నటించేందుకు సిద్ధమవుతుంది. విద్యాబాలన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తుమ్హారి సులు'. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమాలో రాత్రి సమయాల్లో పనిచేసే రేడియో జాకీగా, హౌస్‌వైఫ్‌గా విద్యా నటించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో రాధామోహన్ దర్శకత్వంలో రీమేక్ చేయబోతున్నారు. ఇందులో విద్యా బాలన్ పాత్రలో జ్యోతిక నటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది.


సోనమ్ కపూర్

"నీర్జా' చిత్రంలో నటించడం నాకు ఆశీర్వాదం లాంటిది. నీర్జా భానోత్ ధైర్యమే రియల్ లైఫ్‌లో కూడా నన్ను ముందుకు నడిపిస్తుంది' అని అంటోంది సోనమ్ కపూర్. హైజాక్‌కు గురైన విమానంలో టెర్రరిస్టుల నుంచి ప్రయాణికులను కాపాడి తన ప్రాణాలను వదిలిన ఎయిర్ హోస్ట్ నీర్జా భానోత్ జీవితం ఆధారంగా

ఆమె ధైర్యమే నడిపిస్తుంది

రూపొందిన 'నీర్జా' చిత్రంలో టైటిల్ పాత్రలో సోనమ్ నటించింది. ఈ సినిమా ఉత్తమ ప్రాంతీయ చిత్రం, ఉత్తమ నటి విభాగంలో జాతీయ అవార్డులనందుకుంది. 2016, ఫిబ్రవరి 19న విడుదలైన ఈ సినిమా రెండేండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోనమ్ స్పందిస్తూ, 'ఈ సినిమాలో నటించడం గౌరవమే కాదు, గొప్ప అనుభూతి కూడా. అందులోని నీర్జా చూపించిన ధైర్యం నన్ను ఇప్పటికీ నడిపిస్తుంది' అని ట్వీట్ చేసింది. ప్రస్తుతం సోనమ్ 'వీర్ ది వెడ్డింగ్', 'సంజు', 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా' చిత్రాల్లో నటిస్తుంది.


'రాజరథం'లో ఓ దృశ్యం

రొమాంటిక్ కామెడీగా రాజరథం

నిరూప్ భండారి, అవంతిక జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రానికి సంబంధించిన తన అనుభవాలను హీరో నిరూప్ తెలియజేస్తూ, 'కాలేజీ రోజుల్లో స్నేహితులతో కలిసి రాత్రుళ్లు మైసూర్‌లోని చాముండి హిల్స్‌లో ఉండే పాడుబడిన ఇంటికి వెళ్లేవాళ్ళం. అక్కడ దెయ్యాలు తిరుగుతుంటాయని చెప్పేవారు. ఓ పాత ఎస్టీమ్ కారులో అక్కడికి వెళ్ళినప్పుడు కారు స్టార్ అవడానికి టైమ్ తీసుకునేది. అందుకని కారుని ఆఫ్ చేసేవాళ్ళం కాదు. అయితే ఓ సారి కావాలని కార్ స్టార్ట్ అవనట్టు నటించాను. దీంతో మా ఫ్రెండ్స్‌కి భయంతో కాళ్ళు, చేతులు ఆడలేదు. ఇక చిత్రంలోని 'కాలేజ్ డేస్' పాటలో శ్రీవత్స వెనకాల టపాసులు అంటించే సీన్‌లో నిజమైన టపాసులు వాడటంతో అతను వణికిపోతూ కనిపించాడు. దీంతో సెట్‌లో అంతా నవ్వుకోవడం జరిగింది. ఇందులో ర్యాగింగ్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు చాలా సరదాగా అనిపించింది. సినిమా బాగా రావడం కోసం ఇదంతా చేశాం. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో అందమైన ప్రేమ కథగా రూపొందు తున్న ఈ చిత్రాన్ని మార్చి 23న విడుదల చేయనున్నాం' అని అన్నారు.

పుకార్లు నమ్మొద్దు

24 నుంచి టీఆర్టీ రాత పరీక్షలు

- అభ్యర్థులు ఆందోళన పడొద్దు
- సొంత జిల్లాలోనే పరీక్షా కేంద్రం
- పనిగట్టుకొని మాపై దుష్ప్రచారం తగదు
- త్వరలో గురుకుల టీజీటీ ఫలితాలు : టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మెన్ ఘంటా చక్రపాణి స్పష్టం చేశారు. టీఆర్టీ రాతపరీక్షలు వాయిదా పడతాయన్న పుకార్లను నమ్మొద్దని కోరారు. టీఆర్టీ రాతపరీక్షలపై అభ్యర్థులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. టీఆర్టీ హాల్‌టికెట్లలో గందరగోళం ఏర్పడిన విషయం తెలిసిందే. బుధవారం హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రపాణి మాట్లాడుతూ పనిగట్టుకొని సోషల్ మీడియాలో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. టీఆర్టీ రాతపరీక్షలు యథావిధిగా షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని చెప్పారు. హాల్‌టికెట్లలో ఇబ్బందులు ఏర్పడినందు వల్లే వాటిని నిలిపివేసి, కొత్త హాల్‌టికెట్లు ఇస్తున్నామన్నారు. ఈనెల 24న జరిగే రాతపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. తొలిరోజు పరీక్షకు 60 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24న పరీక్షలకు ఉదయం 17,975 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం 17,052 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని వివరించారు.

టీఆర్టీకి సంబంధించి 48 విడతల్లో రాతపరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్జీటీ రెండు పరీక్షలు, స్కూల్ అసిస్టెంట్ ఒక పరీక్ష మినహా మిగిలినవన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని వివరించారు. హెచ్ఎండీఏ, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్లగొండలో ఆన్‌లైన్ కేంద్రాలున్నాయని చెప్పారు. మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో ఆన్‌లైన్ కేంద్రాలు లేవని స్పష్టం చేశారు. పారదర్శకంగా రాతపరీక్షలు నిర్వహించడం, ఫలితాలు వేగవంతంగా ఇవ్వడం కోసమే ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏ జిల్లా వారిని ఆ సొంత జిల్లాలోనే పరీక్షా కేంద్రం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్‌లైన్ పరీక్షలకు మాత్రం పక్క జిల్లాలకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. మతాలు, కులాల వారీగా పరీక్షా కేంద్రాలను కేటాయిస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న వాటిని ఖండించారు. ఏడు రకాల ప్రాధాన్యతలతో జంబ్లింగ్ చేసి అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయించాలని సీజీజీని ఈనెల 15న కోరామని వివరించారు. తాము సూచించిన ప్రకారం కేటాయించలేదని చెప్పారు. సీజీజీ తప్పు చేసిందని తాము ఆరోపించడం లేదన్నారు. సీజీజీ, టీఎస్‌పీఎస్సీ ప్రభుత్వ సంస్థలేనని, సమన్వయంతో పనిచేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటి వరకు 89 పరీక్షలు నిర్వహిస్తే, మూడు పరీక్షల్లో మాత్రమే కొన్ని లోపాలు వచ్చాయని చెప్పారు. గ్రూప్-1 ఫలితాలు, గురుకుల మెయిన్స్, టీఆర్టీ హాల్‌టికెట్లలో ఇబ్బందులొచ్చాయని అన్నారు.

అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు ఎక్కడైనా వేసే అధికారం టీఎస్‌పీఎస్సీకి ఉందన్నారు. సీజీజీ కాకుండా వేరే సంస్థకు అప్పగించే అంశం అంతర్గతంగా, ప్రభుత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకే ఆదేశాలు వర్తిస్తాయని అన్నారు. కోర్టు ఆదేశాలను పాటిస్తామన్నారు. పీఈటీ అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లీష్ ప్రశ్నాపత్రాలు అందజేస్తామని చెప్పారు. ఆన్‌లైన్, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత టీఎస్‌పీఎస్సీకే దక్కుతుందని అన్నారు. ప్రత్యేక ఐటీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని చెప్పారు. ఐటీ కేంద్రం అభివృద్ధి బాధ్యతను టీఎస్‌టీఎస్‌కు అప్పగించిందని అన్నారు. ఏపీపీఎస్సీకి కేటాయించిన స్థలాన్ని కేటాయించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను, గవర్నర్ నరసింహన్‌ను కోరామన్నారు. 30,618 పోస్టుల భర్తీకి అనుమతి వచ్చిందని చెప్పారు. 3,455 పోస్టులకు ఆయా శాఖల నుంచి అర్హతలు, నిబంధనలు, రోస్టర్ పాయింట్లు ఇంకా తమకు అందలేదన్నారు. గ్రూప్-2 మినహా ఏదీ కోర్టు పరిధిలో లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ మాట్లాడుతూ టీఆర్టీ రాతపరీక్షల నిర్వహణలో భాగంగా అభ్యర్థుల ఫిర్యాదులను పరిష్కరించడం కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు టీఆర్టీ రాతపరీక్షలు జరుగుతాయని చెప్పారు. 8,792 ఉపాధ్యాయ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 2,77,574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. టీఎస్‌పీఎస్సీపై దుష్ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సభ్యుడు సి విఠల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ భ్యులు బానోతు చంద్రావతి, మతీనుద్దీన్ ఖాద్రీ, రామ్మోహన్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, చింత సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెండు భాషల్లో పీఈటీ ప్రశాప్రత్రం

- **టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)కి హాజరయ్యే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ) అభ్యర్థులకు తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషల్లోనూ ప్రశ్నాపత్రాలివ్వాలని ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. రెండు భాషల్లో ప్రశ్నాపత్రం ఇవ్వాలని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు రెండు భాషల్లో ప్రశ్నాపత్రాలివ్వాలని అభ్యర్థులకు అనుకూలంగా బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 28న టీఆర్టీలో భాగంగా తెలుగు మీడియం అభ్యర్థులకు పీఈటీ రాతపరీక్ష జరగనుంది. తెలుగు మీడియం అభ్యర్థులకు తెలుగుతోపాటు ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీని హైకోర్టు ఆదేశించింది.

నాలుగో మోడీ కూడా ఇలాగే..

(మొదటిపేజీ తరువాయి)

తాజా ట్విట్టర్ సందేశంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. శత్రుఘ్న జత చేసిన ట్వీట్..

మిత్రులారా ముగ్గురు మోడీలు వెళ్లారు...

లలిత్ మోడీ, జతిన్ మోడీ, నీరవ్ మోడీ

నాలుగో జోలె దాచి ఉంచండి. ఆయన చాలా సెంటిమెంటల్ మనిషి"

అని ఆ ట్వీట్ సారాంశం.

ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో వ్యంగ్యధోరణి సందేశాలతో తమ నిరసన వ్యక్తం చేయడం ట్రెండ్‌గా మారిపోయిందితమకు నచ్చని విషయాన్నైనా, వ్యక్తినైనా ఈ తరహాలో విమర్శిస్తుంటారు. దేశంలో సంచలనం సృష్టిస్తోన్న కుంభకోణాలపై సామాజిక మాధ్యమంలో వ్యంగ్యధోరణిలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా ఇండస్ట్రీయల్ పార్కులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా నాలుగు ఇండస్ట్రీయల్ పార్కులు, ఇండస్ట్రీయల్ టౌన్‌షిప్స్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మాధపూర్, ఇబ్రహీంపట్నం, కుత్బుల్లాపూర్, వరంగల్ ప్రాంతాలను గుర్తించింది. దీంతోపాటు నానక్ రామ్ గూడలో ఐటీ సెజ్, గచ్చిబౌలి ప్రాంతాలలో ఇండస్ట్రీయల్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ద్వారా వచ్చే రెవెన్యూలో 35శాతం మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ, నగర పంచాయతీలకు వస్తుందని పేర్కొన్నారు.

జైలుకైనా పోతం.. కానీ భూములివ్వం

నవతెలంగాణ-కూసుమంచి

'జైలుకైనా పోతం.. అవసరమైతే చావనైనా చస్తాం కానీ మా భూములు మాత్రం ఇవ్వం...వాటినే నమ్ముకొని బతుకుతున్నం... మా పొట్ట కొట్టాలని చూడొద్దు..కలెక్టర్ వచ్చి మా కష్టాలు వినాలే' అంటూ సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి కింద భూములు కోల్పోతున్న ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లింగారంతండాకు చెందిన రైతులు బుధవారం భూ సర్వేను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు వారిని బెదిరించారు. కేసులు పెడతామంటూ పోలీసులను రంగంలోకి దించారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఆర్డీఓ వచ్చి గిరిజనులతో చర్చలు జరిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదంటూ వారు తేల్చిచెప్పడంతో ఆయన వెనుదిరిగారు.

సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి కింద కూసుమంచి మండలానికి చెందిన 326మంది రైతులు 259 ఎకరాల భూమి కోల్పోతున్నారు. ఇందులో గిరిజనులు, చిన్నసన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. బైపాస్‌రోడ్డు వద్దని, గతంలో ఉన్న రోడ్డునే వెడల్పు చేయాలని, తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదంటూ రైతులు కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం లింగారంతండా వద్ద రెవెన్యూ అధికారు లు ఆర్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామునే రైతులకు తెలీకుండా ల్యాండ్ మార్కింగ్ చేసేందుకు సర్వేయర్‌తో సహా వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు సర్వేను అడ్డుకున్నారు. అధికారులు ఎస్సై రఘుకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి రావడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరింపులకు దిగారు. జైలుకైనా వెళ్తం.. కానీ తమ భూములు ఇచ్చేది లేదంటూ రైతులు వారితో వాగ్వివాదానికి దిగారు. కలెక్టర్ వచ్చి తమ బాధలు వినాలని డిమాండ్ చేశారు. దీంతో ఆర్ఐ లక్ష్మణ్ ఆర్డీఓ పూర్ణచందర్‌రావుకు సమాచారం అందించారు.

ఆయన ఖమ్మం నుండి కూసుమంచికి వచ్చారు. భూ నిర్వాసిత రైతులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఖమ్మం కలెక్టరేట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.కోటి ఇచ్చి తమకు ఎకరాకు రూ.10లక్షలే ఎలా ఇస్తారని, సాగు భూమికి బదులు సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తమ భూముల్లో ఆకుకూరలు సాగు చేసుకొని, అదే జీవనాధారంగా బతుకుతున్నా మని, ఇప్పుడు ఆ భూములు లాక్కుంటే తాము ఎలా బతకాలని ఆర్డీఓను ప్రశ్నించారు. ఎలాంటి సమాచా రమూ లేకుండా, నోటీసులివ్వకుండా, గ్రామసభలు నిర్వహించకుండా తమ పట్టా భూముల్లో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు. చేసేదేమీ లేక ఆర్డీఓ అక్కడి నుండి వెనుదిరిగారు. భూ నిర్వాసితుల ఆందోళనకు రైతుసంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాత్‌రావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకురాలు గట్టు రమాదేవి, తోటకూరి రాజశేఖర్ (రాజు) మద్దతుగా తెలిపారు. ఈ విషయంపై తహశీల్దార్ కృష్ణను వివరణ కోరితే రైతులెవరూ అభ్యంతరం చెప్పడం లేదని, సర్వే కొనసాగుతుందని చెప్పడం గమనార్హం.

ఇదేనా దళితాభివృద్ధి!

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చు చేయలేదని తెలిపారు. దళితుల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో కూడా నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. ఎస్సీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు రాష్ట్రంలో అమలు కావడం లేదని తమ పరిశీలనలో వెల్లడైందని చెప్పారు. ముద్ర, స్టార్టప్, స్టాండప్ లాంటి పథకాలకు బ్యాంకులు రుణాలు అందించడం లేదన్నారు.

దళితులపై పెరుగుతున్న దాడులు

రాష్ట్రంలో రోజు రోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని రామ్ శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు కూడా నమోదు చేయడం చేయకపోవడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫస్ట్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) నమోదు చేయకుంటే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లోనే ఉన్నాయని, ఇప్పటికీ నేరస్తులకు శిక్ష పడిన దాఖలాలు లేవన్నారు. దళితులపై దాడులను నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

భూ పంపిణీ అంతంత మాత్రమే

దళితులకు భూ పంపిణీ అంతంత మాత్రంగానే ఉందని వైస్ చైర్మెన్ మురుగన్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో దళితులకు అందడం లేదని చెప్పారు. భూ పంపిణీ, భూ సేకరణ విషయాలపై పరిశీలించామని తెలిపారు.

పెరుగుతున్న డ్రాప్‌వుట్స్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్‌వుట్స్ ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఫలితంగా వేలాది మంది విద్యార్థులు విద్యకు దూరం కావల్సి వస్తున్నదని కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మధ్యలోనే బడి మానేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించింది.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ

రాష్ట్రంలో దళిత సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కె జోషితో పాటు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్థిక శాఖ అధికారులతో కమిషన్ సమావేశమైంది. రాష్ట్రంలో దళిత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడం లేదని, అత్యాచార బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపింది. సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై ఎప్పటికప్పుడు ఆర్థిక శాఖ అధికారులు పరిశీలన జరపాలని కమిషన్ సూచించింది.

దళిత ఎమ్మెల్యేలు.. సంఘాలతో చైర్మెన్ భేటీ

దళిత సమస్యలపై దళిత ఎమ్మెల్యేలు, సంఘాల నేతలతో కమిషన్ చైర్మెన్ రామ్ శంకర్ కథేరియా భేటీ అయ్యారు అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని దళిత ఎమ్మెల్యేలు కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర , కేంద్ర క్యాబినెట్‌లలో ఎస్సీ ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కోరారు.

అనంతరం దళిత సంఘాల నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని పలు సంఘాల నేతలు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అత్యాచార బాధితులకు పరిహారం అందించడం లేదని తెలిపారు. దళితులపై దాడులను నివారించేందుకు కృషి చేయాలని కోరారు.

ఘోర రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-కొత్తకోట

వనపర్తి జిల్లా కొత్తకోటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు టైరు పగలంతో అదుపు తప్పి మరో కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మృతి చెందారు. మరికొంత మందికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరి స్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

హైదరాబాద్‌లోని ఉప్పల్ సమీపంలో నివసిస్తున్న బీరయ్య(26), మల్లేష్(28), రాజు(38), ఆంజనేయులు(40), నరేష్(40), ప్రసన్న (56), సూరిబాబు(30) కూలీలు. వీరందరూ వనపర్తి జిల్లా అమరచింత మండలంలో జరుగుతున్న జాతరకు స్విఫ్ట్‌కారులో బయలుదేరారు. వారు ప్రయాణి స్తున్న కారు కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామ సమీపం లోని పిరమిడ్ దాబా వద్దకు రాగానే టైరు పగిలి పోయింది. ఈ క్రమంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కర్నూల్ వైపునుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఇండికా కారును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులో ప్రయా ణిస్తున్న బీరయ్య, మల్లేశ్, రాజు, అంజనేయులు, నరేశ్, ప్రసన్న, సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందారు. ఇండికా కారులో ప్రయాణిస్తున్న సునీత(40), రాజేశ్వరమ్మ(35), మొగలన్న, కల్పనకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో మహబూబ్‌నగర్ ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్వరమ్మ, సునీత మృతి చెందారు. మొగులన్న, కల్పన పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఏఎస్పీ సురేందర్‌రెడ్డి, కొత్తకోట సీఐ సోంనారాయణసింగ్, ఎస్సై రవికాంత్‌రావు సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీపీఎఫ్ అమలు చేయండి

ఆర్థికమంత్రికి టీఎస్‌పీఈఏ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో 1999-2004 మధ్యకాలంలో నియమితులైన ఉద్యోగులకు జీపీఎఫ్ వర్తింపచేయాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం నాడు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పి సదానందం, అదనపు కార్యదర్శి కిరణ్‌కుమార్, ప్రశాంత్, సురేష్‌బాబు, వెంకటేష్ తదితరులు ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించి, తమ డిమాండ్‌ను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విభజనపై చొరవ చూపండి

విద్యుత్ ఉద్యోగుల విభజనపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కరించుకొనేలా చొరవ చూపాలని కోరుతూ టీఎస్‌పీఈజేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు బుధవారంనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్కె జోషి, ఇంధనశాఖ కార్యదర్శి అజయ్‌మిశ్రాలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఉద్యోగుల విభజనపై తక్షణం చర్యలు తీసుకోవాలని, తెలంగాణ ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరక్కుండా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారుల్ని కలిసినవారిలో జేఏసీ నేతలు భానుప్రకాష్, తులసి చంద్రుడు తదితరులు ఉన్నారు.

అవినీతి 'కట్టా' బావమరిది అరెస్ట్

హైదరాబాద్ : హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి కేసులో మరో బినామీ అయిన నిందితుడి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే, సంజీవరెడ్డి నగర్‌లోని శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని సోదా చేసి కొన్ని విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...కట్టా అక్రమాస్తుల కేసు వెలుగుచూసినప్పటి నుంచి శ్రీనివాస్‌రెడ్డి కూడా అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం తెలిసిందే. చివరికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఏసీబీ కార్యాలయానికి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డిని అరెస్ట్ చేసి అతని ఇంట్లో సోదాలు చేశారు. అయితే, తాను అజ్ఞాతంలోకి వెళ్లే సమయంలోనే తన నివాసంలోని విలువైన డాక్యుమెంట్లు, బంగారు నగలను వేరే చోటికి శ్రీనివాస్‌రెడ్డి తరలించినట్టుగా అనుమానిస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డిని గురువారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నారు. మరోవైపు గత ఐదు రోజులుగా తమ కస్టడీలో ఉన్న కట్టా మరో ఇద్దరు బినామీలు యాదవ్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డిలను బుధవారం కోర్టులో ఏసీబీ అధికారులు హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కాగా, ప్రధాన నిందితుడు కట్టా పురుషోత్తంరెడ్డిని ఏసీబీ కస్టడీకి తదుపరి విచారణ కోసం కస్టడీకి ఇచ్చే విషయమై గురువారం కోర్టు నిర్ణయం తీసుకోనుంది.

భూదందా..!

లింగారంతండా నుంచి వనం నాగయ్య

ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు ప్రభుత్వం ఇటీవల భూసేకరణ ప్రారంభించింది. కూసుమంచి మండలం నుంచి ఖమ్మం నగర శివారులో ఉన్న వరంగల్ క్రాస్ రోడ్డు వరకు భూసేకరణ ప్రక్రియ సాగుతోంది. మొత్తం 259 ఎకరాల భూమిని సేకరించేందుకు సుమారు 326 మంది రైతుల దగ్గర భూములను సేకరిస్తున్నారు. కూసుమంచి నుంచి వెళ్లాల్సిన ఈ రహదారికి సంబంధించి ప్రభుత్వం మొదట ఇచ్చిన రూట్ మ్యాప్‌ను మార్చి మరో రూట్‌ను ఖరారు చేసింది. దాంతో గిరిజనుల భూములను కారుచౌకగా గుంజుకునేందుకు సిద్ధమైంది. భూములను సేకరించే పనిలో భాగంగా పొట్ట దశలో ఉన్న వరి పైరు, చేతికందే దశలో ఉన్న కూరగాయల తోటలు, మిర్చి, పత్తి తదితర ఖరీదైన తోటలకు మార్కింగ్ చేశారు. ఈ రైతులందరూ పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్నారు.

విలువైన భూములకు అడ్డగోలుగా ధర..

ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారి వెంట భూముల విలువ ఆకాశాన్నంటుతోంది. ఇటీవల భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మాణం చేయడంతో ఈ భూములకు కూడా కాలువలు తీసి నీరందిస్తున్నారు. దీంతో ఈ భూములకు ధరలు బాగా పెరిగాయి. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.50 లక్షలు పలుకుతోంది. ప్రభుత్వం మాత్రం రూ.10 లక్షల వరకే చెల్లించేందుకు సిద్ధపడింది. దీనికి రైతులు ఒప్పుకోలేదు. అయినా బలవంతంగా సేకరించేందుకు ప్రభుత్వం కాలుదువ్వుతోంది. ఇటీవల ఖమ్మం నూతన కలెక్టరేట్‌కు సేకరించిన పడావుపడిన భూములకు ఎకరానికి రూ. కోటి చెల్లించి సేకరించారు. ఇదే సమయంలో గిరిజనుల విలువైన భూములకు మాత్రం ఎకరానికి రూ.10లక్షలకు మించి ఇవ్వడం కుదరదని తెగేసి చెపుతున్నారు. కలెక్టరేట్‌కు సేకరించిన భూములకు పక్కనే పలువురు టీఆర్ఎస్ ముఖ్యనేతల బినామీ భూములుండటం వల్ల అక్కడ భారీ పరిహారం చెల్లించారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల భూముల్లో సర్వే నిలిపివేయాలి

నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

సూర్యాపేట రహదారి విస్తరణ పేరుతో ప్రభుత్వం గిరిజనుల పొట్టకొట్టాలని చూస్తోంది. అలాంటి చర్యలను సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తోంది. అమాయక గిరిజనుల భూములు లాక్కోవాలని చూడటం అన్యాయం. దీనిపై సీపీఐ(ఎం) గిరిజనుల పక్షాన పోరాటం చేపడుతుంది. మరో మల్లన్నసాగర్ ఉద్యమంలా చేస్తాం.

నోటి కాడ కూడు లాక్కుంటున్నారు

వద్యా మోతి, గిరిజన మహిళా రైతు

మాకు ఈ భూమే ఆధారం. ఉన్న భూమిని లాక్కుంటే కుటుంబాలు రోడ్డున పడతాయి. మా భూములను ప్రభుత్వం తీసుకుంటే మరో చోట భూమి కొనివ్వాలి. బలవంతంగా లాక్కుంటే ప్రాణం తీసుకోవడానికైనా వెనుకాడం.

నిబంధనల ప్రకారమే పరిహారం

పూర్ణచంద్ర-ఆర్డీఓ

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రైతుల భూములకు నష్టపరిహారం చెల్లిస్తున్నాం. రైతులను ఒప్పించే పనిలో ఉన్నాం. నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తాం. ఇప్పటికే రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేయదు.


సర్వే జరిగే గ్రామాలివి...

గ్రామం పేరు	నిర్వాసితులు	సేకరించే భూమి
నాయకన్‌గూడెం	43 మంది రైతులు	24.01ఎకరాలు
భగత్‌వీడు	29మంది రైతులు	21.26 ఎకరాలు
కూసుమంచి	53మంది రైతులు	40ఎకరాలు
నేలపట్ల	60మందిరైతులు	58ఎకరాలు
జీళ్లచెరువు	54మందిరైతులు	46.15ఎకరాలు
జుజ్జులరావుపేట	80మందిరైతులు	51.39ఎకరాలు
మునిగేపల్లి	7మంది రైతులు	7.03ఎకరాలు

నాయకన్‌గాను రాణిస్తారని కమల్‌కు కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ : పలు కార్యక్రమాల వలన తమిళనాడులో కమల్‌హాసన్ పెట్టబోయే పార్టీ ప్రారంభానికి హాజరు కాలేకపోతున్నట్టు మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్ ద్వారా స్పందించారు. మధురైలో జరిగే మీపార్టీ లాంచింగ్‌కి నన్ను ఆహ్వానించినందుకు క తజ్ఞతలు. అనివార్య కారణాల వలన ప్రారంభోత్సవానికి రాలేకపోతున్నాను. కొత్త ఇన్నింగ్స్‌లోనూ మీరు రాణించాలి. రీల్ నాయకన్ గానే కాదు రియల్(జన జీవితంలోను) నాయకన్ గాను మీరు రాణిస్తారని ఆశిస్తున్నాను అని ట్వీట్ చేశారు. దీనికి కమల్ థ్యాంక్యూ కేటీఆర్. ఈ రోజు మిమ్మల్ని మిస్ అయినా, భవిష్యత్‌లో మా పార్టీ ఫంక్షన్స్ కి హాజరు అవుతారని ఆశిస్తున్నాను. దీనికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



నవతెలంగాణ-సిరికొండ

వాటర్‌షెడ్ పథకం కింద తవ్విన పారంపాండ్(బావి)లో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం ముత్యంపేటలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ముత్యంపేట గ్రామోకుమ్రం కోసురావు కుటుంబంలో మంగళవారం సంవత్సరికం కార్యక్రమం నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములైన కనక లచ్చు, కనక సుదర్శన్ కూడా హాజరయ్యారు. భోజనానంతరం అందరూ వెళ్లిపోగా లచ్చు, సుదర్శన్‌ల కుమార్తెలు కినక పరమేశ్వరి(4), కినక పుష్ప(5) ఆడుకుంటూ గ్రామ పొలిమేరకు వెళ్లారు. అక్కడ ఓ రైతు పొలంలో గతేడాది నీటి నిల్వ కోసం వాటర్‌షెడ్ పథకం కింద బావి తవ్వారు. నీరుపైకి కనిపించడంతో అక్కడికెళ్లిన ఇద్దరు చిన్నారులు కాలుజారి పడిపోయారు. సాయంత్రమైనా పిల్లలు తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలుసాని రాముగౌడ్ గ్రామానికి చేరుకుని అనుమానిత ప్రాంతాల్లో గాలించగా.. బావి వద్ద జారిపడ్డట్టు గమనించి ఈతగాళ్లను దింపారు. చిన్నారుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతాంగానికి మంత్రి నాయిని క్షమాపణ చెప్పాలి

- తెలంగాణ రైతుసంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎక్స్‌గ్రేషియో కోసమే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ రైతుసంఘం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి అర్థం లేని మాటలు మాట్లాడిన ఆయన రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతుసంఘం అధ్యక్షులు పి జంగారెడ్డి, కార్యదర్శి టి సాగర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 3,450 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ఆ సంఖ్యను అనేక నిబంధనల పేరుతో తగ్గిస్తున్నదని తెలిపారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి సిద్ధంగా లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతాంగ ఆత్మహత్యలను నివారించడానికి చర్యలు తీసుకోకపోగా, మిర్చి రైతులకు బేడీలు వేసిందని విమర్శించారు. కంది రైతులను మోసం చేసిందని తెలిపారు. పత్తికి గిట్టుబాటు ధర ఇవ్వలేదని పేర్కొన్నారు. నాసిరకం విత్తనాలు, పురుగుమందులు అమ్మిన కంపెనీలపై చర్యలు శూన్యమని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు ఒక్క ఎకరానికీ నష్టపరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలతో రైతాంగం సతమతమవుతుంటే వేల కోట్ల రూపాయలు పంటల బీమా పేరుతో రైతుల నుండి వసూలు చేసి కంపెనీలకు దోచిపెట్టిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలందరికీ ఎక్స్‌గ్రేషియో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ వడ్డీని రైతు ఖాతాలో జమ చేయాలని కోరారు. నాసిరకం విత్తనాలు అమ్మిన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలని కోరారు.

ఏఐఎఫ్‌డీవై అధ్యక్ష, కార్యదర్శులుగా రాజిరెడ్డి, వనం సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కర్రి రాజిరెడ్డి, వనం సుధాకర్ ఎన్నికయ్యారు. ఈనెల 18,19 తేదీల్లో వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన సమాఖ్య ప్రథమ మహాసభలో వీరిని ఎన్నుకున్నారు. మొత్తం 39 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్టు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 తీర్మానాలను మహాసభలో ఆమోదించామని పేర్కొన్నారు.

సీఎం అపాయిమెంట్ కోసం సచివాలయంలో మందకృష్ణ

హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు అపాయిమెంట్ కోసం ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బుధవారం సచివాలయం వచ్చారు. మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి సీఎం అపాయిమెంట్ కావాలని కోరారు. వర్గీకరణ విషయంలో ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని అడిగేందుకు సీఎంను కలవాలని అనుకున్నట్టు ఆయన తెలిపారు.

వర్గీకరణపై బీజేపీ మాట తప్పింది

అనంతరం మందకృష్ణ మీడియాతో ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మాట తప్పిందని అన్నారు. సీఎం కేసీఆర్, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. జగదీశ్‌రెడ్డి ఇంటి ముందు విద్యుత్ శాఖ మంత్రి అనే ఉందని.. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అని లేదని విమర్శించారు. జగదీశ్‌రెడ్డి బోర్డు మార్చకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

సొంత ప్రయోజనాల కోసం తాపత్రయం : పిడమర్తి రవి

మందకృష్ణ సొంత ప్రయోజనాల కోసం వర్గీకరణను వాడుకున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌తో తిరుగుతూ ఇప్పుడు సీఎం అపాయింట్‌మెంట్ కోరుతున్నారని పిడమర్తి రవి మండిపడ్డారు. వెంకయ్య కాళ్లు మొక్కి మాదిగల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన మందకృష్ణకు టీఆర్ఎస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు.

సీఎం సోదరి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

అల్వాల్‌లోని మంగాపురం కాలనీలో నివాసముంటున్నారు. కేసీఆర్‌కు మొత్తం ఎనిమిది మంది అక్కలు, ఒక చెల్లె, ఒక అన్న.కాగా విమలబాయి అంత్యక్రియలు తిరుమలగిరి శ్మశానవాటికలో జరిగాయి.మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు మంత్రులు, కుటుంబసభ్యులు ఆమె అంత్యక్రియలకు హాజరయ్యాయి.

బీజేపీకి నాగం గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

దామోదరరెడ్డి బృందం ఢిల్లీవెళ్లి ఫిర్యాదు చేసినట్టు ఆరోపణలొచ్చాయి. కానీ వారు వెళ్లింది మాత్రం టీపీసీసీ అధ్యక్షులుగా తనను నియమించాలని, లేకపోతే మరెవరిని నియమించినా తాము సహకరిస్తామని అధిష్టానానికి చెప్పినట్టు తెలిసింది. డికె అరుణకు, టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడిక్డి మధ్య ఉన్న అంతర్గత విభేదాల కారణంగా ఆయన అరుణకు చెక్ పెట్టేందుకు ఉత్తమ్ నాగంను ప్రోత్సహిస్తున్నట్టు ఆ జిల్లాల నేతలు అంటున్నారు.

ఢిల్లీకి వెళ్లిన కొత్త కోట దంపతులు?

టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు కొత్త కోట దయాకర్‌రెడ్డి, ఆయన భార్య కొత్త కోట సీతదయాకర్‌రెడ్డి బుధవారం ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వారు ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీని కలిసినట్టు తెలిసింది. ప్రజా చైతన్య బస్సుయాత్ర 26 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వారు ఏదో ఒకరోజు బస్సుయాత్రలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు తెలిసింది.

ఆడశిశువుల మరణాలే అధికం

(మొదటిపేజీ తరువాయి)

భారమని తల్లిదండ్రులు భావించటం,భ్రూణహత్యలకు ఒడిగట్టడలాంటి సామాజిక అడ్డంకులు ఎదుర్కొంటున్నారని ఇది స్పష్టం చేస్తున్నది' అని యూనిసెఫ్‌లో ఆరోగ్య నిపుణులు గుప్తా చెప్పారు. 'ఆడపిల్లలను చికిత్సకు తీసుకెళ్ళడంలో కూడా తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహిస్తారు. వరకట్న సమస్య నేపథ్యంలో ఆడపిల్లను వారిని భారంగా చూస్తున్నారు'

సెన్సెక్స్	నిఫ్టీ	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
▼141 33,844	▼37 10,397	64.79	రూ. 30,503	రూ. 40,600





కోడిగుడ్లు			
హైదరాబాద్	365	విజయవాడ	375
ఒక్కగుడ్డుకు	4.25	చెన్నై	415
వరంగల్	367	ముంబయి	410



కుంగుబాటును దరచేరనీయొద్దు: దీపిక



నవతెలంగాణ. వాణిజ్య విభాగం: హైదరా బాద్‌లో జరుగుతున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో బుధవారం బాలీ వుడ్ తార దీపికా పదుకొణె సందడి చేసింది. 'మానసిక దృఢత్వం' అన్న అంశంపై ఆమె మాట్లాడుతూ కుంగుబాటు ప్రపంచ వ్యాప్తంగా ఓ అంటువ్యాధిలా తయారైందని దీపిక ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక చైతన్యంతోనే కుంగు బాటుకు పరిష్కారం లభిస్తుందన్నారు.క్లిష్ట సమయాల్లో తన అమ్మ తనకు అండగా నిలిచారని పదుకొణె ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తాను ఒంటరిననే భావన దరిచేరనీయకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం మనతో కలిసి ఉండేవారు ఏం చెబుతున్నారో, వాళ్లలో వస్తోన్న మార్పులేమిటో గమనిస్తూ ఉండాలని, వారిలోని చిరాకను గమనించి, కుంగుబాటు లక్షణాలను గుర్తించి వారికి అండగా నిలవాలని అన్నారు. మానసిక ఆనందంపై పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ఐటీ స్టాక్స్ దన్నుతో లాభాల్లోకి..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు లాభాల బాట పట్టాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ మోసంతో మొదలుకొని వివిధ ప్రతికూలతల నేపథ్యంలో... దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా గత మూడు సెషన్ల నుంచి నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. చమురు మంట కొంత చల్లారడంతో పాటు ఐటీ భవిష్యత్తుకు డోకా లేదని నాస్కామ్ తాజా నివేదకలో వెల్లడించడం, రూపాయితో పోలిస్తే రూపాయి బలపడడం, విదేశీ మార్కెట్లలో ఈ సంస్థల రెవెన్యూలు పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ స్టాక్స్ రాణించాయి. ఈ రంగపు షేర్ల దన్నుతో మార్కెట్లు లాభాల వైపు నడిచాయి. మదుపరుల అనుకూలతల నేపథ్యంలో మార్కెట్లు ముగిసే సమయానికి బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ దాదాపు141 పాయింట్ల కుంగి 33,845 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 37 పాయింట్లు ఎగిసి దాదాపు 10,398 పాయింట్ల వద్ద ముగిసింది.

18 వేల మంది బ్యాంకు ఉద్యోగులు బదిలీ



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) వెలుగుచూసిన భారీ కుంభకోణం బ్యాంకు ఉద్యోగులకు పాలిట శాపంగా మారింది. స్కామ్ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా బదిలీలు జరుగుతున్నాయి. వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న దాదాపు 18వేల మంది బ్యాంకు అధికారులపై ఇప్పటికే బదిలీ వేటు పడినట్టుగా సమాచారం. గత సోమవారమే అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఈ బదిలీ విషయంపై 'సెంట్రల్ విజిలెన్స్ కమిషన్' (సీవీవీ)ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. 2017 డిసెంబర్ 31 నాటికి మూడేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలని బ్యాంకులను ఆదేశించింది. అదేవిధంగా క్లరికల్ స్టాఫ్ ఎవరైతే 2017 డిసెంబర్ 31 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్నారో వారిని కూడా బదిలీ చేయాలని సూచించింది. దీంతో బ్యాంకులు వెంటనే ఈ బదిలీ ప్రక్రియ చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాల మేరకు దాదాపు 18 వేల మంది బ్యాంకు అధికారులు బదిలీ అయినట్టు సమాచారం.

ఈపీఎఫ్‌వో వడ్డీ 8.55 శాతమే!

- ఈ ఏడాదికి ఇంతేనన్న 'మండలి'
- ఉద్యోగులకు మూడో'సారి' నిరాశే



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్‌వో) వడ్డీ రేటును వరుసగా మూడో సారి తగ్గించారు. ధర్మకర్తల మండలి ప్రస్తుత (2017-18) ఆర్థిక సంవత్సరానికి గాను ఈపీఎఫ్‌పై 8.55 శాతం వడ్డీని మాత్రమే చెల్లించాలని నిర్ణయించింది. తాజా నిర్ణయం దేశ వ్యాప్తంగా దాదాపు ఆరు కోట్ల మందికి పైగా ఈపీఎఫ్‌వో ఖాతాదారులు నిరుత్సాహానికి గురి చేసింది. తాము తీసుకున్న 8.55 వడ్డీ రేటు నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించగలదని మండలి ఆశాభావం వ్యక్తం చేసింది. అలాగే కార్మిక సంఘాలు సమ్మతం తెలియజేస్తాయని అనుకుంటున్నట్టు పేర్కొంది. ఈపీఎఫ్‌వో వడ్డీ చెల్లించేందుకు ఈటీఎఫ్‌లను విక్రయించనున్నట్టుగా వివరించింది. బాండ్లలో పెట్టుబడుల ద్వారా 8 శాతం రాబడి వచ్చిందని అయితే 8.55 శాతం వడ్డీ చెల్లించేందుకు ఈటీఎఫ్‌ల్లో కొన్ని పెట్టుబడులు విక్రయించినట్టు వెల్లడించారు. ఈటీఎఫ్‌లలో పెట్టుబడుల ద్వారా ఇప్పటి వరకు 20.65 శాతం రాబడి వచ్చిందన్నారు. ఇక జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈపీఎఫ్‌వో రూ.3,700 కోట్ల విలువైన ఈటీఎఫ్‌లను విక్రయించగా రూ.1,011 కోట్లు రాబడి వచ్చిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి గ్యాంగ్వార్ తెలిపారు.

దుకాణాలు 'మూతపడ్డాయి'!



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల భారీ మోసం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో విదేశాల్లో తలదాచుకుంటున్న ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, తమ సంస్థ ఉద్యోగులకు లేఖ (ఈమెయిల్) పంపారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో తాము సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులు ప్రత్యామ్నాయాలను చూసుకోవాలని ఆయన సిబ్బందిని కోరారు. అయితే సిబ్బందికి బకాయిపడ్డ సొమ్మును చెల్లించేందుకు గాను తమకు అనుమతి ఇవ్వాలంటూ తాను బ్యాంకులను కోరినట్టు కూడా ఆయన ఈ లేఖలో తెలిపారు. దర్యాప్తు సంస్థలు తన కంపెనీల స్టాక్స్‌ను సీజ్ చేశారని, ఆదాయపన్ను శాఖ తన బ్యాంకు ఖాతాలన్నీ పనిచేయకుండా చేసిందని, దీంతో తాను ఉద్యోగులకు వేతనాలు చెల్లించే పరిస్థితిలో లేనని ఆయన లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి కూడా స్పష్టత లేదన్నారు. ఈ పరిస్థితి నుంచి ఎప్పుడు బయటపడతానో తెలియదని, వేరే ఉద్యోగాలు చూసుకోవాలని ఉద్యోగులకు లేఖలో సూచించారు. దీనికి తోడు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని దుకాణాలను మూసివేస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. అయితే తమ కార్యకలాపాలను పునఃప్రారంభించడానికి చట్టపరమైన సహాయం తీసుకుంటామని తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు దాఖలు చేసిన ఫిర్యాదులతో నీరవ్‌మోదీ సంస్థలు తీవ్ర ఆందోళనలో పడిన సంగతి తెలిసిందే. నీరవ్‌మోదీ, ఆయన అంకుల్ మెహుల్ చౌక్సికి చెందిన గీతాంజలి జెమ్స్ షోరూంలు మూతపడుతున్నాయని, దీంతో 5000 మంది ఉద్యోగులు రోడ్డున పడబోతున్నారని రిపోర్టులు వచ్చాయి. మరోవైపు నీరవ్, మెహుల్ ప్రాపర్టీలు, షోరూంలపై సీబీఐ, ఈడీ భారీగా తనిఖీలు చేపడుతోంది. పలు దుకాణాలను సైతం సీజ్ చేస్తున్నాయి. నీరవ్ మోదీ ఎలాంటి మోసానికి పాల్పడలేదని ఆయన న్యాయవాది విజయ్ అగర్వాల్ పీఎన్‌బీ ఆరోపణలను ఖండిస్తున్నారు. తన బ్రాండ్‌ను, వ్యాపారాన్ని నాశనం చేసి.. డబ్బు తిరిగి చెల్లించే పరిస్థితి లేకుండా మీరే చేశారని ఆరోపిస్తూ నీరవ్ పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులకు కూడా లేఖ పంపిన విషయం తెలిసిందే.

దివాలా దిశగా ఎయిర్‌సెల్

ముంబయి: లాభాలు తగ్గి రుణభారం అంతకంతకు పెరుగుతున్న వేళ ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌సెల్ మూతపడే దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అందులో పని చేస్తున్న 5000 మంది ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. టెలికాం రంగంలోని తీవ్ర పోటీకర వాతావరణంలో నిధులు సమకూరడం క్లిష్టతరంగా మారిందని, ఈ క్రమంలో ఉద్యోగులు ప్రమాదకర పరిస్థితుల్లో పడబోతున్నట్టు స్వయంగా కంపెనీయే హెచ్చరించింది. కొన్ని రోజుల నుంచి నిధులు సమకూరడం లేదని, ప్రస్తుతం వ్యాపార కార్యకలాపాల నుంచే నిధులు రాబడుతున్నామని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కైజాద్ హేర్జీ చెప్పారు. మాత సంస్థ మ్యాక్సిస్‌కు చెందిన ఈ కంపెనీకి ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న పోటీకర వాతావరణం తీవ్రంగా దెబ్బకొడుతోందని, రెవెన్యూలు, లాభాలు అన్నీ కొట్టుకుపోతున్నాయన్నారు. పలువురు డైరెక్టర్లు కంపెనీ నుంచి వైదొలగడంతో, వారి స్థానంలో కంపెనీ బోర్డు సందీప్ వాట్స్, ప్రకాశ్ మిశ్రా, లక్ష్మి సుబ్రహ్మణ్యంను నియమించింది. వాటాదారులతో కూడా బోర్డు చర్చలు జరుపుతోంది. సుమారు రూ. 15,500 కోట్ల రుణాలు పేరుకుపోవడంతో కంపెనీ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు దివాలా పిటిషన్ దాఖలు చేయనున్నట్టు కూడా రిపోర్టులు వస్తున్నాయి.

సెల్‌ఫోన్ నంబర్లలో మార్పుండదు!



న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సెల్‌ఫోన్ వినియోగ దారులు వాడుతున్న 10 అంకెల సిమ్ నంబర్లు త్వరలో 13 అంకెలకు మారతాయని మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని సర్కారు వెల్లడించింది. ఈ మార్పు కేవలం మెషిన్ టు మెషిన్ (ఎం2ఎం) వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని టెలికాం శాఖ తెలియజేసింది. కొత్త చర్యతో సాధారణంగా మొబై ల్‌లో వాడుతున్న సిమ్ నంబర్లేమీ మారవని వెల్లడించింది. పదమూడు అంకె లుండే ఎం2ఎం మొబైల్ నంబర్లు జులై 1 నుంచి అమలులోకి రానుం దన్నారు. వీటి ప్రభావం ఇప్పటికే సాధారణ వినియోగదారులు వాడుతున్న మొబైల్ సిమ్‌లపై ఉండదని వాటితో ఎం2ఎం నంబర్లకు సంబంధమే లేదని తెలిపింది. ఇప్పటికే 10 అంకెల ఎం2ఎం మొబైల్ వినియోగదారుల నంబర్లు మాత్రమే అక్టోబర్ 1 నుంచి మారనున్నట్టుగా వివరించింది. సాధారణంగా ఎం2ఎం పరికరాలు ఇంటర్నెట్ సహాయంతో నడుస్తాయి. ఉదాహరణకు క్రెడిట్ కార్డు స్వైపింగ్ యంత్రాల్లాగా అన్నమాట. దీనికి తోడు రవాణా, విద్యుత్, సేవలు, రవాణా సామగ్రి, వైద్యం, సముద్ర రవాణా తదితర రంగాల్లో ఎం2ఎం కమ్యూనికేషన్‌కు విశేష ప్రాధాన్యం ఉంది.

ఎలాంటి తప్పు చేయలేదు..!

- సీబీఐ విచారణలో రోటోమాక్ విక్రమ్ కొఠారి



న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక వేత్త, రోటోమాక్ పెన్నుల కంపెనీ ప్రమోటర్ విక్రమ్ కొఠారి, ఆయన కుమారుడు రాహుల్ కొఠారిలను సీబీఐ అధికారులు బుధవారం ప్రశ్నించారు. ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో సంస్థ విచారణ అధికారులు వీరిద్దరిని ప్రశ్నించారు. అంతముందు రోజు కూడా సీబీఐ రాహుల్ కొఠారిని విచారించిన సంగతి తెలిసిందే. ఉత్తర్ ప్రదేశ్‌లోని కాన్పూర్‌లోని విక్రమ్ ఇంటిపై మంగళవారం సీబీఐ అధికారులు దాడులు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కాన్పూర్ నుంచి మంగళవారం రాత్రి న్యూఢిల్లీకి చేరుకున్న కొఠారి ద్వయం బుధవారం సీబీఐ తదుపరి విచారణకు హాజరయ్యారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి రూ.3,700 కోట్ల రూపాయలకు పైగా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని కేసులో వీరు నిందితులుగా ఉన్నారు. విచారణలో తాను ఎలాంటి తప్పు చేయలేదని విక్రమ్ కొఠారి చెప్పుకొచ్చినట్టుగా సమాచారం.. తాను బ్యాంకు నుంచి రుణం తీసుకున్నది నిజమే.. కానీ తిరిగి చెల్లించలదని.. మోసం చేశాననడం వాస్తవం కాదని తెలిపారు. కొఠారి రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ ఆయనపై కేసు నమోదు చేసింది.

2016లోనే నిరర్థకంగా మారింది...

రోటోమాక్ సంస్థపై ఆర్థిక మోసం ఆరోపణలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటన చేసింది. సంస్థకు ఎంత మొత్తంలో రుణాలను ఇచ్చిందన్న అంశం పై బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టతనివ్వలేదు. అయితే సదరు బ్యాంకు రుణం 2015-16లోనే నిరర్థక ఆస్తిగా మారిందని.. ఇందుకు సమానంగా తాము పుస్తకాల్లో కేటాయింపులు కూడా జరిపినట్టుగా బ్యాంక్ వెల్లడించింది.

ఆర్టిజన్లపై చిత్తశుద్ధి ఉంటే కౌంటర్ వేయాలి

లేదంటే సమ్మె బాట పడతాం

- ప్రభుత్వానికి హరగోపాల్ హెచ్చరిక
- 2/94 యాక్టును రద్దు చేయాలి : సీఐటీయూ ఉపాధ్యక్షులు సుధాభాస్కర్

నవతెలంగాణ - సిటీబ్యూరో

ఆర్టిజన్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కోర్టులో కౌంటర్ దాఖలు చేసి సమర్థవంతమైన వాదనలు విన్పించాలని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేకులు ప్రొ.హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ విద్యుత్ సంస్థల్లో పనిచేసే 'ఆర్టిజన్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి' అనే అంశంపై తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం యూనియన్ అధ్యక్షులు కుమారచారి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం నాగరికత ఉన్నా ఆర్టిజన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తెలంగాణ ఉద్యమం జరిగిందే ఉద్యోగాల కోసమైతే, కోర్టులో కౌంటర్ వేయడానికి ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగానున్న 23 వేల మంది కార్మికులు పనిచేయకపోతే అంతా చీకటిమయం అవుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలకు పెన్షన్లతో పాటు వాళ్ల వారసులకు విద్యాలయాల్లో సీట్ల రిజర్వేషన్ చట్టం తెచ్చిన ప్రభుత్వాలు సమాజానికి నిరంతరం వెలుగునిచ్చే కార్మికుల జీవితాలకు భద్రత కోసం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు విధానాల వల్లే 1.60 కోట్ల మంది ఉద్యోగులుండాల్సిన మన దేశంలో ప్రస్తుతం 47 లక్షలకు చేరినట్టు ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడానికి అడ్డుపడే 2/94 యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. అప్పటి వరకు ఆర్టిజన్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, ఇపీఎఫ్ పథకాల్లో యాజమాన్య వాటాను కూడా కార్మికుల నుంచే జమ చేయడం అనైతికమన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ మాట్లాడుతూ.. ఆర్టిజన్స్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టిజన్ కార్మికులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఇంక్రిమెంట్‌తోపాటు గుర్తింపు కార్డులు, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. టీఎస్‌యూఈఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో సమస్యలపై ఐక్యంగా పనిచేస్తున్న సంఘాలను ఎన్నికల పేరుతో ప్రభుత్వం కుట్రపూరితంగా విడదీసిందన్నారు. ఆర్టిజన్లు నిజంగా కంపెనీ ఉద్యోగులైతే జేఎల్ఎం రిక్రూట్‌మెంట్‌లో వెయిటేజీ ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆర్టిజన్ కార్మికులను సముద్రం మధ్యలో వదిలేశారని, కరెంట్ తీగలు నిప్పు రవ్వల కంటే ప్రమాదమని హెచ్చరించారు. 1535 యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వజీర్ మాట్లాడుతూ.. పంజాబ్ తరహాలో ఆర్టిజన్ కార్మికులను కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయగా, స్వరాష్ట్రంలో పర్మినెంట్ చేయకపోవడం ఇదేం న్యాయమని ప్రశ్నించారు. సమ్మె ద్వారానే కార్మికులను నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. 2871 యూనియన్ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ.. డిపార్టుమెంట్‌కు ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని డైరెక్ట్‌గా జీఎంను చేసినప్పుడు ఆర్టిజన్ కార్మికుల విషయంలో ఎందుకు కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం టీఎస్‌యూఈఈయూ ఉపాధ్యక్షులు ఈశ్వర్‌రావు.. ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు జేఎల్ఎం పోస్టుల భర్తీని వాయిదా వేయాలని, ఇపీఎఫ్, ఇఎస్ఐ కంపెనీ వాటాను యాజమాన్యమే చెల్లించాలనే తీర్మానం ప్రవేశ పెట్టారు. అన్ని కార్మిక యూనియన్ల నాయకులు ఆమోదించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు అంబదాస్, ఇంతిహాజ్ యూనియన్ నాయకులు అలీఖాన్, నందీశ్వర్, టీఎస్‌యూఈఈయూ సహాయ కార్యదర్శి జె.బస్వరాజ్, 1104 యూనియన్ నాయకులు సుధీర్, హెచ్ 52 యూనియన్ అధ్యక్షులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరగోపాల్

మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి హక్కు

- ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు భాషను పెంపొందించుకోవడం, కాపాడు కోవడం ప్రతి ఒక్కరి హక్కు అని ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. తెలంగాణ తెలుగు భాషకు గౌరవం తీసుకురావడం తెలంగాణ ప్రజల కర్తవ్యమన్నారు. మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో కాల్వ మల్లయ్య అధ్యక్షతన తెలుగు భాష- అన్ని రంగాల్లో అభివృద్ధి అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భూపతి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, నయినాల గోవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుమల్‌రావు మాట్లాడుతూ తెలంగాణ భాషలో దాగి ఉన్న పదజాలాన్ని సేకరించాలన్నారు. ఈ పదజాలాన్ని నిఘంటువులోకి ఎక్కించాలని తెలిపారు. మంది భాషగా ఉన్న తెలంగాణ నుడికార భాష ఎంతో విలక్షనమైనదని చెప్పారు. తెలంగాణ భాషను పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలిసిన అవసరం ఉందన్నారు. సంస్కృతి భాష ప్రభావంతో ఉన్న భాషను పక్కన పెట్టి నుడికారంతో సహజ భాషని రక్షించుకోవడం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. భాషను కాపాడితే ప్రాంతీయ అస్థిత్వ కేతనం సమున్నతంగా నిలబడుతుందన్నారు. భాష నిఘంటువును వెంటనే చేపట్టాలని తెలిపారు. తెలంగాణ కవులు, రచయితలు, పత్రికలు జీవ భాషలో రాయాలని తెలిపారు.

అడవుల్లో కూంబింగ్‌కు బ్రేక్..!

- నిరంతర హంటింగ్ కు సీఆర్‌పీఎఫ్ ఫుల్‌స్టాప్?
- మావోయిస్టుల కదలికలపై కచ్చితమైన సమాచారం ఉంటేనే ..

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలు మొదలుకుని దండకారణ్యంలో మావోయిస్టుల కదలికలపై కచ్చితమైన సమాచారం ఉంటేనే కూంబింగ్ ఆపరేషన్ జరపాలని సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్సు(సీఆర్‌పీఎఫ్) ఉన్నతాధికారులు విధాన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తమ బలగాలన్నింటికీ అంతర్గత సమాచారాన్ని పంపించినట్టు సమాచారం. మావోయిస్టుల మెరుపు దాడుల గురించి సరైన సమాచారం లేకుండా గుడ్డిగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టిన ప్రతిసారీ తీవ్ర స్థాయిలో బలగాలకు నష్టం ఏర్పడుతున్నదని ఉన్నతాధికారులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ లలో గత ఐదేండ్లలో తీవ్ర స్థాయిలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో 70 మందికి పైగా సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఊచకోతకు గురి కావడం ఇప్పటికే సీఆర్‌పీఎఫ్‌కు పీడ కలగానే వెంటాడుతున్నట్టు తెలిసింది. ఆయా ప్రాంతాల స్థానిక పోలీసులకు నక్సల్స్ కదలికల గురించి కొన్ని సార్లు వస్తున్న సమాచారం సైతం సీఆర్‌పీఎఫ్ బలగాలను తప్పు దోవ పట్టించేది గా ఉంటున్నదనే వాదన వినిపిస్తున్నది. దీంతో సొంతంగా నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని విధ్వంస కార్యకలాపాలకు చెక్ పెట్టేలా కార్యచరణను ఈ బలగాల ఉన్నతాధికారులు శ్రీకారంచుట్టినట్టు సమాచారం. కొన్ని సంధర్భాలలో ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా, దంతేవాడ, నారాయణ్‌పూర్ ,బీజాపూర్ జిల్లాల్లో పెద్ద సంఖ్యలో జరిపిన కూంబింగ్ ఆపరేషన్‌లలో కొన్ని మార్లు మంచి ఫలితాలను రాబట్టినప్పటికి చాలా వరకు ఎదురు దెబ్బలు తినాల్సి వచ్చిందని ఈ ఘటనలు పునరావృత్తం కాకుండా చూసే లక్ష్యంతో ఎత్తుగడలలో అనేక మార్పులు తీసుకు వస్తున్నట్టు తెలిసింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కమ్యూనికేషన్ వ్యవస్థలోనూ ప్రత్యకంగా మార్పులు తీసుకు వస్తున్నారని సమాచారం. అలాగే నిరంతరం దండకారణ్యం రూపు రేఖలు, కీలకమైన ప్రదేశాలు, నక్సల్స్‌కు సానుకూలంగా ఉన్న ప్రాంతాలు, నీరు దొరికే కుంటలు, బావులు, వారికి అండగా నిలస్తున్న గిరిజన తండాలు మొదలైన పూర్తి సమాచారంతో తాజాగా డేటా బెస్‌ను ఏర్పరచుకుంటున్నట్టు తెలిసింది. సీఆర్‌పీఎఫ్‌లోని యాంటీ నక్సలైట్ ఆపరేషన్ విభాగం కోబ్రా బలగాలలో నాయక శ్రేణిలోని అధికారులకు ఇందుకు సంబంధించిన ప్రత్యేక విక్షణను ఇప్పటికే ప్రారంభించినట్టు తెలిసింది. ఇందుకు తెలంగాణ, ఏపీలోని యాంటి నక్సలైట్ ఆపరేషన్‌లలో నిష్ణాతులైన కొందరు ఐపీఎస్ అధికారులు మొదలుకుని కింది స్థాయి అధికారుల సహకారాన్ని ఈ విషయంలో తీసుకుంటున్నట్టు సమాచారం. ఏది ఏమైనప్పటికి ప్రత్యేక పోలీసు బలగాలలో ఏ చిన్న నష్టం చోటు చేసుకున్నా అది మావోయిస్టుల మనోస్థైర్యాన్ని మరింతగా పెంచుతున్న దని, దానిని ఆధారంగా చూపిస్తు వారి కార్యకలాపాల విస్తరణ, కొత్త కేడర్ రిక్రూట్‌మెంట్ సాగడానికి దోహద పడుతున్నదని కూడా సీఆర్‌పీఎఫ్ తో పాటు వివిధ నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల పోలీసు వ్యూహకర్తలు ఒక అంచనాకు వచ్చినట్టు తెలిసింది. వీటన్నింటిని క్రోడీ కరించుకున్న తర్వాతే నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, దట్టమైన అడవు లలో కూంబింగ్ ఆపరేషన్‌పై తాజా నిర్ణయం తీసుకు న్నారని తెలిసింది. ముఖ్యంగా తమకు అందే సమాచా రానిన పూర్తిగా విశ్లేషించుకున్న తర్వాత ఆపరేషన్‌కు దిగాల ని కూడా ఉన్నతాధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. గతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఊచకోత జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్ర నిఘా విభాగం సైతం సీఆర్‌పీఎఫ్ బలగాల కదలికలపై మావోయిస్టులకు ముందుగానే సమాచారం వెళ్లడం, ఆపరేషన్‌కు వెళ్తున్న బలగాలకు సరైన దిశా నిర్ధేశం లేక పోవడం, ఆకస్మిక దాడులు జరిగి నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన శిక్షణ లేక పోవడం మూలాన భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తు న్నట్టు నివేదికలు ఇచ్చింది. దీని వల్ల మావోయిస్టుల కార్య కలాపాలకు పూర్తిగా చెక్ పెట్టినా తమ రాష్ట్రానికి తిరిగి వచ్చి బలపడటం వలన ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు కూడా స్పష్టం చేసింది.

ఈ నేప థ్యంలో ఇకపై సీఆర్‌పీఎఫ్ బలగాలకు మావోయిస్టుల వలన తీవ్ర స్థాయిలో ఎలాంటి ఎదురు దెబ్బలు తగల కుండా చూసే లక్ష్యంతోటే పకడ్బందీ వ్యూహరచన సాగుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు పలువురు సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు, యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో ఆరి తేరిన మాజీ ఐపీఎస్ అధికారుల సహకారాన్ని తీసుకుంటున్నారని తెలిసింది.


ఫైల్

తెలంగాణలో పండించే దుంప పంటల్లో మొరంగడ్డ చాలా ముఖ్యమైనది. తక్కువ కాల పరిమితిలో ఎక్కువగా ఉత్పత్తి నిచ్చే మంచి పోషకాలు ఉన్న ఈ గడ్డలను పచ్చివి తినడమే కాకుండా కూరగాను వండుకుంటారు. సహజంగా ఉడకబెట్టుకొని తింటారు. అంతే కాకుండా ఆల్కహాల్ తయారీలోనూ ఉపయోగిస్తారు



మొరంగడ్డ రైతులకు వరం

మొరంగడ్డ శాస్త్రీయ నామం 'ఐపోమియా బటాటస్' అంటారు. తెలంగాణలో 'మొరంగడ్డ' అని కూడా పిలుస్తారు. ఈ దుంపలను ఉడికించిగానీ, కాల్చిగానీ తింటారు. కూరగాయగా కూడా ఉపయోగిస్తారు. తీగలను పశువులకు మేతగా వాడతారు. ఆల్కహాల్ తయారీలో కూడా చిలగడ దుంపలను ఉపయోగిస్తారు.

వాతావరణం: మొరంగడ్డ ఉష్ణమండలపు పంట. 24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో బాగా పెరుగుతుంది. సమృద్ధిగా ఉండే సూర్యరశ్మి, మధ్యస్థంగా ఉండే వర్షపాతంతో పాటు రాత్రి, ఉదయం వేళలో చల్లగా ఉండడం ఈ పంటకు బాగా అనుకూలం.


పంట కాలం: వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి వరకు వేసుకోవచ్చు.

నేలలు: సారవంతమైన మురుగు నీటి పారుదల సౌకర్యం గల ఇసుకతో కూడిన ఒండ్రు నేలలు బాగా అనుకూలం. నల్లరేగడి నేలలు లోతైన ఇసుక నేలలు ఈ పంట సాగుకు ఈనుకూలం కావు.

రకాలు: స్రామాట్, కిరణ్, ఆర్ఎన్ఎస్పి-1.

వ్యాప్తి: ఒక మోస్తారు లేతగా ఉన్న తీగలను నాటడానికి ఉపయోగిస్తారు. మధ్యస్థ పరిమాణం గల దుంపలను నారు తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. 30 నుంచి 40 సెం.మీ పొడవు ఉండి, 5నుంచి 6 ఆకులు గల తీగలను నిలువుగా నాటాలి. మొక్కకు మొక్కకు మధ్య దూరం 60ఇంటు 20 సెం.మీ దూరం ఉండే విధంగా చూడాలి.

నారుమడి తయారీ: పొలంలో నాటడానికి మూడు నెలల ముందుగా ఈ నారును నాటుకోవాలి. ఒక ఎకరానికి 40 చ.మీలో పెంచిన నారు లేదా 125 నుంచి 150 గ్రా. పరిమాణం గల 40 కిలోల దుంపలు (గడ్డలు) సరిపోతాయి. ఈ దుంపలను లేదా తీగలను 25 ఇంటు 60 సెం.మీ గల బోదెలను తయారు చేసి వాటిపై నాటుకోవాలి. 20 నుంచి 30 సెం.మీ పొడవుగల తీగలను 45 రోజుల తర్వాత కత్తిరించి రెండో దశ నాడుమడిలో నాటుకోవాలి.



రెండో దశ నారు: మొదటి దశ నారుమడి నుండి ఎన్నుకున్న నారును 60 ఇంటు 20 సెం.మీ బోదెలలో నాటాలి. ఒక ఎకరానికి 200 చ.మీల రెండో దశ నారు అవసరం. పెరుగుదల త్వరగా ఉండాలంటే 2 కిలోల యూరియా 2 దఫాలుగా, నాటిన 15 నుంచి 30 రోజుల తర్వాత వేయాలి. తీగలు బాగా నాటుకోవడానికి వీలుగా 10 రోజుల వరకు రోజు విడిచి రోజు నీటిని ఇవ్వాలి. ఆ తర్వాత వారం రోజులకొకసారి నీరు పెట్టాలి. నారు 45 రోజులకు తయారవుతుంది. ప్రతి 4-5 పంటలకు తీగలతో వ్యాప్తి చేసిన తర్వాత, కొత్త నారును దుంపల ద్వారా పెంచుకొని వాడుకోవాలి. అందువల్ల ముక్కు పురుగు తీవ్రత తగ్గుతుంది.

ప్రారంభకృషి: నేలకు 4-5 సార్లు బాగా దున్నాలి. అనువైన పరిమాణంలో మడులను తయారు చేయాలి. నీటి పారుదలకు, మురుగు నీటి పారుదలకు కాల్వలను చేసుకోవాలి.

తీగల ఎన్నిక: రెండో దశ నారుమడి నుండి తీగలను ఎన్నిక చేసుకోవాలి. తీగలను కొమ్మల చివర్ల నుండి తీసుకుంటే మంచి నాణ్యత కలిగి ఉండి ముక్కు పురుగు తీవ్రత తక్కువగా ఉండి, దుంపలు బాగా రావడానికి అవకాశం ఉంటుంది. తీగలు 20 నుంచి 30 సెం.మీ పొడవుతో 3నుంచి 4 కణుపులు కలిగినవి కోసి, నీడలో రెండు రోజులు ఉంచి నాటడం వల్ల వేర్లు బాగా వచ్చి బాగా నాటుకుంటాయి. మంచి దిగుబడి వస్తుంది.

నాటుట: 60ఇంటు 20 సెం.మీ దూరంలో 20నుంచి 25 సెం.మీ ఎత్తుగల బోదెలపై తీగలను 2.5 నుంచి 7.5 సెం.మీ లోతుగా నాటుకోవాలి. ఒక ఎకరంలో నాటడానికి 33,200 తీగలు సరిపోతాయి.

ఎరువులు: ఎకరానికి 6నుంచి 8 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. ముందుగా 24 కిలోల భాస్వరం, 16 కిలోల నత్రజని, పొటాష్ లను ఆఖరి దుక్కిలో వేసి దున్నాలి. మిగిలిన 16 కిలోల నత్రజని, పొటాష్లను రెండు దఫాలుగా నాటిన 40 నుంచి 69వ రోజున వేయాలి.

అంతర కృషి: తీగలు నాటిన 30, 60 రోజులకు కలుపు తీసి, బోదెలపైకి మట్టిని ఎగదోయాలి. తీగెలను అప్పుడప్పుడు తిప్పుతూ ఉండాలి. దాని వల్ల వేర్లు పాతుకోకుండా ఉంటాయి. కలుపు నివారణకు ఎకరానికి పెండిమిథాలిన్ 30 శాతం, 1.2 లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

నీటి యాజమాన్యం: తీగలు నాటిన వెంటనే నీరు ఇవ్వాలి. తర్వాత వారం రోజుల కొకసారి చొప్పున నీరు పెడుతూ ఉండాలి. దుంపలు ఏర్పడే దశలో అంటే నాటిన 60 నుంచి 90 రోజుల మధ్యలో నీరు తప్పకుండా ఇవ్వాలి. ఆ తర్వాత 10 నుంచి 15 రోజుల వ్యవధిలో నీటిని ఇస్తే సరిపోతుంది.

సస్యరక్షణ: మొరంగడ్డ ఆశించే పురుగలలో ముక్కు పురుగు ముఖ్యమైనది. ఈ పురుగులు తీగలకు, దుంపలకు నష్టం కలుగ చేస్తాయి.

ముక్కు పురుగు- సమగ్ర సస్యరక్షణ చర్యలు

నాటుకునే ముందు ముక్కు పురుగు ఆశించిన తీగలను వాడాలి. నాటే ముందు తీగలను 2 మి.లీ ఫెనిట్రోథియాన్ మందు లీటరు నీటిలో కలిపిన ద్రావణంలో 10 నిమిషాలు ఉంచాలి. ఫెనిట్రోథియాన్ 2 మి.లీ లీటరు నీటిలో కలిపిన మందును నాటిన 30,50,70 రోజులకు పిచికారి చేయాలి. 100 చ.మీకు ఒకటి చొప్పున లింగాకర్షక బుట్టలను పెట్టి మగ పురుగులను పట్టి నాశనం చేయాలి. పంటను నాటిన 120 రోజులకు తప్పనిసరిగా తవ్వితీయాలి. ఆలస్యం అయితే ఈ పురుగు ఉధృతి ఎక్కువ అవుతుంది. కోత కోసిన తర్వాత మిగిలిన తీగలను కాల్చి నాశనం చేయాలి. పంట మార్పిడి తప్పకుండా పాటించాలి.

పంట కోత: నాటిన 4 నెలల్లో పంట కోతకు సిద్ధంగా ఉంటుంది. ఆకులు పసుపు రంగుకు మారడం ద్వారా పంట కోతకొచ్చిందని తెలుసు కోవచ్చు. దుంపలను ఆలస్యంగా తీస్తే ముక్కు పురుగు తీవ్రత పెరుగుతుంది. తీగలను కోసివేసి, గడ్డ పారలతో తవ్వి దుంపలను తీయాలి. తేలికపాటి నేలల్లో నాగలితో దున్ని కూడా దుంపలు తీసుకోవచ్చు.

నిల్వ చేయడం: దుంపలను శుభ్రపర్చి మార్కెట్కు పంపాలి. 5నుంచి 7 రోజుల వరకు నీడలో నిల్వ చేసుకోవచ్చు.



- కె. భవ్యశ్రీ,
సీనియర్ రీసెర్చ్ ఫెల్లో
(హార్టికల్చర్)

వ్యవసాయ సూచనలు

వ్యవసాయం- వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 21-36 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 09-21 డిగ్రీల సెల్సియస్గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 26 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే రాత్రి ఉష్ణోగ్రతలు 15 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అయ్యే అవకాశం ఉంది.

వరి: వరి నాటిన 20నుంచి 30 రోజుల మధ్య ఎకరానికి 10 కిలోల కార్బోప్యూరాన్ 3జి గుళికలు లేదా 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 గుళికలను పల్చగా నీరు ఉంచి వేయాలి.

మొక్కజొన్న: పైరు మొలిచిన 10 నుంచి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుండి 30 రోజుల దశలో కార్బోప్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వేరుశనగ: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆకు మచ్చ తెగులు, కాండం కుళ్ల వైరస్ తెగులు ఆశించుటకు అనుకూలం. అకుమచ్చ తెగులు నివారణకు 2 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1గ్రా. కార్బండజిమ్ లేదా 2 గ్రా. క్లోరోథాలోనిల్ 2 మి.లీ హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం కుళ్ల వైరస్ తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తగా పంట పొలం, గట్లపై ఉన్న వయ్యారిభామ కలుపు మొక్కలను నిర్మూలించుకోవాలి. పొలం చుట్టూ 4 నుంచి 5 వరుసల్లో సజ్జ, జొన్న, మొక్కజొన్న పంటలను వేయడం వల్ల తామర పురుగులు పంటను ఆశించకుండా నివారించవచ్చు. పొగాకు లద్దె పురుగు గమనించినట్టయితే నివారణకు ఈ కింది సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి అడుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 10 నుంచి 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చాలి. లద్దె పురుగులు ఉన్న జల్లెడ ఆకులను ఏరివేసి నాశనం చేయాలి. మొదటి దశలో ఉన్న లద్దె పురుగుల నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ క్వినాల్ఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. బాగా ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరలను (5 కిలోల తవుడు, 500గ్రా. కార్బరిల్ మందును కలిపి తయారు చేసి పాయంత్రం పూట పొలంలో చల్లాలి.

మిరప: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు కానోఫోరా కొమ్మ కుళ్ల తెగులు, బూడిద తెగులు, తామర పురుగులు సోకుటకు అనుకూలం. నివారణకు కానోఫోరా కొమ్మకుళ్ల తెగులుకు 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రా. ప్లాంటామైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 గ్రా. మి.లీ కారాథీన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. తామర పురుగుల నివారణకు 1.5 గ్రా. అసిపెట్ లేదా 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ కారాతేన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్టయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలో డైమండ్ రెక్కల పురుగు గమనించడమైంది. నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ స్పినోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పంట కోతకు 15 రోజుల ముందు పిచికారి చేయాలి.

పశుపోషణ: గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, అవులు, బర్రెల్లో గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబో తులలో జబ్బువాపు వ్యాధి సోకేందుకు అనుకూలం కనుక వీటి నివారణకు టీకాలు వేయించాలి.

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

మొక్కజొన్నలో కలుపు నివారణ తెలపండి?

ప్ర. గులాబి మొక్కలు ఎండిపోతున్నాయి నివారణ చెప్పండి?
- జయ, మొయినాబాద్, గ్రా, మం, రంగారెడ్డి జిల్లా

జ. ఎండు రోగం సోకిన మొక్కలు పైభాగం నుండి కిందికి ఎండిపోతాయి. తెగులు సోకిన మొక్కలు నలుపు రంగుకు మారుతాయి. ముఖ్యంగా ముందుగా కత్తిరించిన కొమ్మ నుండి ఈ వ్యాధి మొదలవుతుంది. ముందుగా కత్తిరించిన కొమ్మకు వెంటనే బ్లైటాక్స్ మందు కత్తిరించిన ప్రాంతంలో పూయాలి. పచ్చి పెండ, మట్టితో చేసిన పేస్టును కూడా పూయవచ్చు. నివారణకుగాను కార్బండజిమ్ 1.5గ్రా. లీటరు నీటిలో కలిపి మొదలు తడిసేలా పిచికారి చేయాలి.

ప్ర. మిర్చి పంటలో తలమాడు తెగులు నివారణ తెలపండి?
- భాస్కర్, కొత్తగూడెం, భద్రాది జిల్లా

జ. లేత చిగుర్లు మాడిపోయి కొమ్మల కణుపుల వద్ద కుళ్లు కనబడి కొమ్మలు విరిగిపోతాయి. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 1గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

ప్ర. నిమ్మరకాలు తెలపండి?
- శేఖర్, చిట్యాల, నార్కెట్పల్లి మ, నల్లగొండ జిల్లా

జ. బాలజీ, పెట్లూరు, సెలక్షన్1 వంటి రకాలున్నాయి. ఇవి గజ్జి తెగులు తట్టుకుంటాయి.

ప్ర. పుచ్చలో ఆకులు మందంగాపెళుసుగామారి ముడుచుకుంటున్నాయి ఏం చేయాలో చెప్పండి?
- కనకయ్య, ఇటిక్యాల గ్రా, జగదేవ్పూర్ మం, సిద్ధిపేట జిల్లా

జ. వెర్రి తెగులు సోకిన పుచ్చ ఆకుల ఈనెల మధ్య మందంగా చారలు ఏర్పడి పెళుసుగా మారి గిడసబారిపోతుంది. పూత, పిందె ఆగిపోతుంది.నివారణకు తెగులు సోకిన మొక్కలు పీకి నాశనం చేయాలి. లీటరు నీటికి 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ కలిపి పిచికారి చేయాలి.

ప్ర. మొక్కజొన్నలో కలుపు నివారణ తెలపండి?
- రాధాకిషన్, గండిమాసనిపేట్, ఎల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా

జ. అట్రజిన్ అనే మందును ఎకరానికి 1.0కి.గ్రా విత్తిన 24 గంటల నుండి 48 గంటల్లోపు లీటరు నీటికి 5 గ్రా. చొప్పున పిచికారి చేయాలి. విత్తిన 30 రోజులు దాటకుండా 2.4డి సోడియం సాల్ట్ ఎకరానికి 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

అడగండి.. చెబుతాం!

మా చిరునామా
'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్: 8332995392, kisan@navatelangana.com

వేసవిలో కూరగాయల సాగు

ప్రత్యేక యాజమాన్య పద్ధతులు

వేసవిలో ఉండే అధిక ఉష్ణోగ్రత, వాతావరణంలో కూరగాయల సాగు చేసి అధిక లాభాలు పొందాలంటే, వేసవికి ఉండే తక్కువ తేమ కూరగాయల సాగుకు అనువైన కూరగాయలను, వాటిలో అధిక వేడిని తట్టుకుని ప్రతిబంధకమవుతుంది. వీటిని అధిగమించి రైతులు వేసవిలో దిగుబడినిచ్చే ప్రత్యేక రకాలను ఎన్నుకోవాలి.

వేసవిలో పండించడానికి అనువైన కూరగాయ రకాలు.

టమాట: పూసా ఎర్లీడ్వార్ఫ్,మారుతమ్, అర్కవికాస్, పూసా-120.

టమాటలో సంకర రకాలు: రష్మి, నవీన్,అవినాష్-2, లక్ష్మీ,బిఎస్ఎస్ 20, అన్నపూర్ణ.

బెండ: అర్కఅనామిక,అర్క అభయ్, పర్బని క్రాంతి. సంకర రకాలు వర్ణ,మహికో 10, ప్రియ, సుప్రియ.

క్యాబేజి: పూసా సింథటిక్ - సంకర రకాలు శ్రీగణేష్ గోల్,నాథ్ 401, క్విస్టో మీనాక్షి.

కాలిఫ్లవర్: పూసా ఎర్లీ సింథటిక్ సంకర రకాలు పూసా హైబ్రీడ్-2, పూసా శుభ్ర, అర్క కోమల్.

ఫ్రెంచి బీన్: సంకర రకాలు ప్రీమియర్, బౌంటిపుల్, నాంటిస్, పూసాకేసర్.

ఉల్లి సాధారణ రకాలు : ఎన్-53(ఖరీఫ్,రబీ) అగ్రిఫౌండ్ లైట్ రెడ్.

గోరు చిక్కుడు సంకర రకాలు : గౌడి, పూని

నవబహార్,పూసా సదా బహార్.బీర: సాధారణ రకాలు : పూసానస్దర్, జైపూర్లాంగ్, సంకర రకాలు ఎన్ఎస్ -3, ఎన్ఎస్ 401, సురేఖ, సంజీవని, మహిమ.

సోర: పూసా సమ్మర్ ఫ్రొలిఫిక్లాంగ్, అర్క బహార్, సంకర రకాలు వరద్,కావేరీ, ఇండమ్ 104, స్వాతి.

కాకర: కోయంబత్తూర్ లాంగ్ గ్రీన్, అర్క హరిత, సంకర రకాలు ఎంబిటిహెచ్ 101, 102, ఎన్ఎస్ 431,432, మహికో 10,13.


వంగ: పూసా పర్పుల్ క్లస్టర్, భాగ్యమతి, ఎస్ఎమ్59-1 సంకర రకాలు మార్ కిరణ్, ఉత్కర్ష, కల్పతరు, హరిత, (అకుపచ్చ) గ్రీన్లాంగ్.

కేవలం సాధారణ రకాలు

తోటకూర : ఆర్ఎన్ఎ-1, అర్కఅరుణ (ఎరుపు), పాలకూర: ఆల్గ్రీన్, మెంతి: పూసా ఎర్లీ బంచింగ్, కొత్తిమీర: స్వాతి, సాధన, గోంగూర: ఎర్ర గోంగూర.

వేసవిలో నారు నీడ కింద పెంచాలి. తప్పనిసరిగా రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్తో 5గ్రా. కిలో విత్తనానికి విత్తన శుద్ధి చేయాలి. నారుమళ్లపై నైలాన్ వల ఏర్పాటు చేసుకుంటే కూడా రసం పీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ల సమస్యను అరికట్టవచ్చు. పొలంలో మొక్కలకు నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్న లాంటి పంటలను ఉత్తర, దక్షిణ దిశలో నాటుకోవాలి. లేదా వీలైన రైతులు 35 శాతం షేడ్నెట్లను ఏర్పాటు చేసుకుంటే ఎండ తీవ్రతను తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో కొత్తగా నాటిన మామిడి, జామ, కొబ్బరి లాంటి పండ్లతోటల్లో మొదటి మూడు, నాలుగు సంవత్సరాలు అంతర పంటగా బెండ, సోర, బీర, గుమ్మడి, దోస, ఫ్రెంచి చిక్కుడు, గోరుచిక్కుడు వంటి కూరగాయ పంటలను సాగుచేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చు.

నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియపు ఎరువులు, వాటితోపాటు జీవన ఎరువులను వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియపు ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నేల గుల్లబారి, తేమను ఎక్కువ రోజులు పట్టివుంచి మొక్కకు అందుబాటులో ఉండేటట్టు చేస్తుంది. ఉన్న కొద్దిపాటి నీరు బిందు (డ్రిప్) లేదా తుంపర్ల (స్ప్రింక్లర్) పద్ధతిలో ఇవ్వడం వల్ల కొద్ది నీటితో ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండించవచ్చు.



ఒక ఎకరానికి సరిపడ నీరుతో డ్రిప్పు ద్వారా 2 1/2 ఎకరాల్లో, తుంపర్ల పద్ధతిలో 1 1/2- 2 ఎకరాల్లో సాగు చేయ వచ్చు. అతేకాకుండా నీరు సక్రమంగా ఇవ్వడం వల్ల తుంపర్ల ద్వారా ఎండ వేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు. సాధారణ పద్ధతిలో నీరు ఇచ్చే పంటలలో ఎండ తీవ్రత తగ్గించడానికి అప్పుడప్పుడు సాయంత్రం వేళల్లో నీటిని పిచికారి చేయాలి.

టమాట, పుచ్చలో నీటి యాజమాన్యం సరిగా లేకపోతే కాయపగుళ్లు కన బడతాయి. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండేటట్టు చూడాలి. ఆ తర్వాత కాయపగుళ్ల నివారణకు బోరాక్స్ లేదా ఆల్బోర్ 3 గ్రా. లీ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. తీగజాతి కూర గాయలలో అధిక ఉష్ణోగ్రతకు మగపూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు పూత దశలో సైకోస్లిల్ (సిసిసి) 2.5 గ్రా లేదా 0.5 గ్రా. మాలిక్ హైడ్రజైడ్ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా గింజ విత్తిన 15 రోజులకు 2-4 ఆకుల దశలోనే 3-4 గ్రా. బోరాక్స్ లీ. నీటికి లేదా ఇథరిల్ 2.5 మి.లీ 10 లీ. నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే తర్వాత దశలో ఆడపూల సంఖ్య పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. ఆకు కూరల పంటలలో ఆకు దిగుబడి పెంచడానికి 2 శాతం యూరియా (20గ్రా.లీ నీటికి), 50 పిపిఎం జిబ్బరిల్లిక్ ఆసిడ్ (50 మి.గ్రా, బిఎ -3 లీ నీటికి) ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి.పొటాష్ను సరైన మోతాదు లో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకునే గుణం మొక్కలలో ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతి కిలో యూరియాకు అరకిలో పొటాష్ను తప్పనిసరిగా వాడాలి.

యూరియా ఎండవేడికి త్వరగా ఆవిరి కాకుండా మొక్కకు ఎక్కువ రోజులు అందుబాటులో ఉండేలా 9 కిలోల యూరియాకు ఒక కిలో వేపపిండి కలిపి వేయాలి. లేదా ప్రతి 25 కిలోల యూరియాకు కిలో వేపనూనె కలిపి అరగంట సేపు ఆరబెట్టి పంటలకు వేయాలి.

పూత పిందె రాలకుండా పిందెబాగా పట్టడానికి టమాట, వంగలాంటి పంటకు ఒక మి.లీ ప్లానోఫిక్స్ (ఎన్ఎఎ) 4.5 లీటర్ల నీటిలో కలిపి పూతదశలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

మిరపలో పూత దశలో ట్రైకాంటినాల్ 2.0 మి.గ్రా. లేదా 2.5 మి.లీ ప్లానోఫిక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచి కారి చేస్తే పిందె నిలిచి కారత బాగా ఉంటుంది. కాయగూరలను, ఆకు కూరలను, చల్లటి పూత కోసి, తడిగోనె సంచి కప్పి మార్కెట్ పంపించాలి.

కలుపు నివారణ మందులు

ముల్లంగి: అలాక్లోర్ అనే మందును 1.0 నుండి 1.25 లీటర్లు అంటే లీటరు నీటికి 5.0-6.0 మి.లీల చొప్పున కలిపి విత్తిన రెండు రోజుల్లోపు తేమగల నేలపై పిచికారి చేయాలి

ఉల్లి/వెల్లుల్లి: అక్సిఫ్లోర్ఫెన్ అనే మందును ఎకరానికి 300 మి.లీ లీటరు నీటికి 1.5-2.0 మి.లీ లేదా ఆక్సాడయార్జిల్ 600-800 మి.లీ లీటరు నీటికి 3.0-4.0 మి.లీ లేదా పెండిమిథాలిన్ లేదా అలా క్లోర్ అనే మందును 1.25 లీటర్లు లీటరుకు 6.0 మి.లీ చొప్పున కలిపి రెండు రోజుల్లోపు పిచికారి చేయాలి.

పోస్ట్ ఎమర్జెన్స్

క్విజాల్ఫాస్ ఇథైల్ 400 మి.లీ లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి నాటిన 20 రోజులకు పిచికారి చేయడం వల్ల గడ్డిజాతి కలుపును నివారించకోవచ్చు.

టమాట

ప్రీ ఎమర్జెన్సీ

పెండిమిథాలిన్ లేద అలాక్లోర్ ఎకరానికి ఒక లీటరు (లీటరు నీటికి 5.0.మి.లీ) చొప్పున కలిపి విత్తిన /నాటిన రెండు రోజుల్లోపు తేమగల నేలపై పిచికారి చేసుకోవాలి. 25 రోజుల మధ్యన ఒకసారి అంతరకృషి చేసుకోవాలి. లేదా మెట్రి బ్యూజిన్ అనే మందును 300 గ్రా. ఎకరానికి లీటరు నీటికి 1.5 గ్రా. చొప్పున కలిపి ఒకటి లేదా రెండురోజుల్లోపు పిచికారి చేయాలి.

పోస్ట్ ఎమర్జెన్స్


క్విజాల్ఫాల్ ఇథైల్ 400 మి.లీ ప్రొపాక్విజాఫాస్ 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి నాటిన 20 రోజులకు పిచికారి చేయడం వల్ల గడ్డి జాతి కలుపును నివారించవచ్చు.

తుంగలాంటి కొనిన మొండి జాతి కలుపు నివారణ

భూమిని దున్నక ముందు లేదా మొదటి పంట తర్వాత రెండవ పంట వేయక ముందు చేపట్టాల్సిన పద్ధతి తుంగ, ఇతర కలుపును 15 నుంచి 20 రోజుల వరకు పెరగనీయాలి. అవసర మైతే నీటిని పెట్టి త్వరగా పెరిగేటట్టు చేయాలి. కలుపు బాగా పెరిగిన తర్వాత గ్లైఫోసేట్ అనే మందును ఎక రానికి 2-2.5 లీటర్లు అంటే లీటరు నీటికి 10 మి.లీ చొప్పున కలిపి కలుపు బాగా తడి సేటట్టు పిచికారి చేయాలి. 15 రోజులు ఆగి కలుపు చనిపోయిన తర్వాత దున్నినట్టయితే తుంగను కొంత వరకు నివారించవచ్చు. ఈ విధంగా రెండు మూడు సార్లు చేసినట్టయితే కలుపు మొక్కలు నివారించు కోవచ్చు.

- జె. సురేష్కుమార్
శాస్త్రవేత్త

సమీర్ వర్మ శుభారంభం



బేసెల్ (స్విట్జర్లాండ్) : అగ్ర శ్రేణి షట్లర్లు పోటీలో లేని వేళ స్విస్ ఓపెన్‌లో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో దిగిన భారత యువ షట్లర్ సమీర్ వర్మ ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. సమీర్ సహా మిగతా షట్లర్లు శుభారంభం చేశారు. రెండో సీడ్ సమీర్ వర్మ.. థామస్ రౌగ్జెల్‌ను తొలి రౌండ్‌లో 22-20, 21-10తో ఓడించాడు. మరో షట్లర్ సౌరభ్ వర్మ 21-11, 21-18తో వరుస సెట్లలో మిషా జిల్‌బెర్మన్‌పై గెలుపొందాడు. గురుసాయదత్ 21-16, 21-11తో మూడో సీడ్ యాగర్ కోయెల్హోను చిత్తు చేసి ఔరా! అనిపించాడు. పురుషుల సింగిల్స్‌లో అభిషేక్ యెలెగర్‌కు నిరాశ ఎదురైంది. తొలి పోరులోనే టాప్ సీడ్‌ను ఢీకొన్న అభిషేక్ 14-21, 13-21తో రాజీవ్ ఔసెఫ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మహిళల సింగిల్స్‌లో చుక్క సాయి ఉత్తేజిత మినహా అందరూ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. కుదురవల్లి శ్రీ కృష్ణ ప్రియ, రియా ముఖర్జీ, జక్క వైష్ణవి రెడ్డిలు తమ తమ మ్యాచుల్లో ఓడారు.



అమ్మాయిల మ్యాచ్ వర్షార్పణం



భారత్, దక్షిణాఫ్రికాల నాల్గో టీ20 వర్షం కారణంగా రద్దు

నవతెలంగాణ-సెంచూరియన్

జోరుమీదున్న కౌర్ సేన పొట్టి సిరీస్ గెలిచే అవకాశానికి వరుణుడు మోకాలడ్డాడు. మ్యాచ్ జరిగిన సెంచూరియన్ సూపర్ స్పోర్ట్స్ పార్క్ మైదానంలో సఫారీ ఇన్నింగ్స్‌లో భారీ వర్షం కురిసింది. కౌర్ సేన ఈ మ్యాచ్ గెలిస్తే 3-1తో సిరీస్ కైవసం చేసుకునేదే. భారత బౌలర్ దీప్తి శర్మ రెండు వికెట్ల మెరవటంతో 15.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. వాన ఆగితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన భారత్ ఛేదనకు బరిలోకి దిగేది కానీ వరుణుడు తెరపినివ్వకపోవటంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో భారత్ ఆఖరు పోరు నెగ్గితే సిరీస్ సొంతమవుతుంది. ఒక వేళ సఫారీలు గెలిస్తే సిరీస్ సమం అవుతుంది. ఆఖరు మ్యాచ్ శనివారం కేప్‌టౌన్‌లో జరగనున్నది.

దీప్తి శర్మ మెరిసే : తొలుత టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ సేన ఫీల్డింగ్ ఎంచుకుని, ప్రత్యర్థులను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దక్షిణాఫ్రికా ఓపెనర్లు లిజెలి లీ (58 నాటౌట్, 38 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), సారథి డేన్ వాన్ నికెర్క్ (55, 47 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) బౌండరీలతో చెలరేగారు. కానీ 13వ ఓవర్లో భారత బౌలర్లు పుంజుకున్నారు. వరుస ఓవర్లలో మూడు కీలక వికెట్లు కూల్చారు. జట్టు స్కోరు 103 వద్ద ఉన్నపుడు దీప్తి శర్మ వేసిన బంతికి సఫారీల కెప్టెన్ వాన్ నికెర్క్ ఔటైంది. తదుపరి ఓవర్లోనే వన్‌డౌన్ బ్యాట్స్‌ఉమన్ చోలె ట్రయాన్ (2)ను పూనమ్ యాదవ్ బలి గొన్నది. ఆపై సునె లుస్ (5) సైతం దీప్తి శర్మ బౌలింగ్‌లో వెనుదిరింగింది. దీంతో ఆ జట్టు 15.3 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. 16వ ఓవర్‌లో వర్షం ప్రారంభం అయింది. మూడు బంతులు వేయగానే వర్షం తీవ్ర రూపం దాల్చింది. దీంతో మ్యాచ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పేశారు. అయితే ఔట్‌ఫీల్డ్‌లో కొంత భాగం వదిలేశారు. ఇక వరుణుడు ఎంతకీ తెరపనివ్వకపోగా.. ఓ మోస్తారుగా ప్రారంభమైన వర్షం జోరందుకున్నది. దీంతో ఎలాంటి ఫలితం తేలకుండానే మ్యాచ్ రద్దయింది. మ్యాచ్‌ను నిలిపి వేసే సమయానికే దక్షిణాఫ్రికా స్కోరు బోర్డు నెమ్మదించింది. ఇదే జోరులో టీమ్ ఇండియా బౌలింగ్ కొనసాగి ఉంటే సఫారీలను తక్కువ పరుగులకే చుట్టేసేవాళ్లు. భీకర ఫామ్‌లో ఉన్న భారత్‌కు ఛేదనలో ఏమంత ప్రయాసం ఉండేదికాదు. అయితే తదుపరి ఇదే మైదానంలో మెన్స్ మ్యాచ్ నిర్వహించాల్సి ఉండటంతో డక్‌వర్త్‌కు అవకాశం లేకుండా మ్యాచ్‌ను రద్దు చేశారు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : లిజెలి లి నాటౌట్ 58, డానె వాన్ నికెర్క్ (సి) రుమెలి ధర్ (బి) దీప్తి శర్మ 55, చౌలె ట్రయాన్ (సి) రుమెలి ధర్ (బి) పూనమ్ యాదవ్ 2, సునె లుస్ ఎల్‌బిడబ్ల్యూ (బి) దీప్తి శర్మ 5, మిగ్నన్ డు ప్రీజ్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (15.3 ఓవర్లలో 3 వికెట్లకు) 130.

వికెట్ల పతనం : 1-103, 2-106, 3-121.

బౌలింగ్ : పూజ వస్త్రాకర్ 3-0-10-0, రుమెలి ధర్ 3-0-22-0, రాజేశ్వరి గైక్వాడ్ 2-0-31-0, పూనమ్ యాదవ్ 3-0-23-1, దీప్తి శర్మ 3-0-33-2, హర్మన్‌ప్రీత్ కౌర్ 1.3-0-6-0.

ఈసారి సఫారీలు

భారత్‌తో రెండో టీ20 పోరులో ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం

- ధోని, పాండే అర్థ శతకాలు వృథా
- రాణించిన డుమిని, క్లాసెన్



మనీశ్ పాండే (79 నాటౌట్)

నాల్గో పొట్టిపోరులో కోహ్లి సేన తృటిలో ఓటమిపాలైంది. మ్యాచుకు ముందు పడిన వర్షంతో మైదానం తేమగా మారటంతో టాస్ నెగ్గిన ప్రత్యర్థి బౌలింగ్‌కు మొగ్గుచూపినా.. టీమ్ ఇండియా కీలక వికెట్లు చేజార్చుకున్నా.. మనీశ్ పాండే, ఎమ్ఎస్ ధోనిలు ధనాధన్ అర్థ శతకాలతో రాణించటంతో భారత్ కాపాడుకోగల స్కోరు చేసింది. అయితే హోరాహోరీగా సాగిన పోరులో సఫారీలను కట్టడి చేయటంలో మన బౌలర్లు విఫలమయ్యారు. ఆఖరు క్షణం ఉత్కంటభరితంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఆరువికెట్ల తేడాతో గెలుపొంది, సిరీస్‌లో 1-1తో నిలిచింది.

నవతెలంగాణ-సెంచూరియన్

బ్యాట్స్‌మెన్ రాణించినా బౌలర్ల వైఫల్యంతో దక్షిణాఫ్రికాతో సూపర్ స్పోర్ట్ పార్క్ వేదికగా జరిగిన రెండో టీ20లో భారత్ ఓటమిపాలైంది. ఆరు వికెట్ల తేడాతో గెలుపొందిన సఫారీలు మూడు మ్యాచుల టీ20 సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచారు. సిరీస్ విజయాన్ని తుది పోరుకు తీసుకొచ్చారు. భారత్ తరపున కెప్టెన్ కోహ్లి సహా, టాప్ ఆర్డర్ మెరుపుల లేని వేళ మనీశ్ పాండే అర్థ శతకంతో ఆకట్టుకున్నాడు. మిస్టర్ కూల్ ధోని సైతం హాఫ్ సెంచరీతో చెలరేగాడు. దీంతో భారత్ నిర్ణీత ఓవర్లలో నాల్గు వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. మ్యాచ్ ముందు వరకూ కురిసిన వర్షం కారణంగా బంతి స్వింగ్ తిరిగటంతో సఫారీ బౌలర్లు చేతివాటం చూపారు. అదే పని టీమ్ ఇండియా బౌలర్లు చేయలేకపోయారు. లక్ష్య ఛేదనలో చాహల్ భారీగా పరుగులు సమర్పించుకోవటం సఫారీ శిబిరానికి కలిసొచ్చింది. దీంతో సఫారీల ఛేదన సులువైంది. ఇక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగగా, భారత్ మాత్రం ఫాస్ట్ బౌలర్ బుమ్రా స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకుంది. సిరీస్ నిర్ణాయక ఆఖరు టీ20 శనివారం కేప్‌టౌన్‌లో జరుగుతుంది.

మిడిలార్డర్ మెరుపులు : టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్‌కు శుభారంభం దక్కలేదు. భారత ఓపెనర్ బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ ఎదుర్కొన్న తొలి బంతికే ఎల్బీగా వెనుదిరిగాడు. ఇన్నింగ్స్ ప్రారంభ బంతికే ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న ఓపెనర్ శిఖర్ ధావన్ (24) ధాటిగా ఆడే క్రమంలో 4.2 ఓవర్‌లో డుమిని బౌలింగ్‌లో వెనుదిరిగాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసిన ధావన్.. బెహార్డీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. మరోవైపు భారత సారథి కోహ్లి (1) కూడా జూనియర్ డాలా చేతికి చిక్కి నిరాశ పరిచాడు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ మూడు వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. కానీ నిలకడగా ఆడుతున్న సమయంలోనే మరో వికెట్ చేజార్చుకుంది. ఫెలుక్వాయో వేసిన 11వ ఓవర్ మూడో బంతికి సురేశ్ రైనా (30) ఔటయ్యాడు. అయితే మనీశ్ పాండే (79 నాటౌట్, 48 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఎమ్ఎస్ ధోని (52 నాటౌట్, 28 బంతుల్లో 4 ఫోర్లు 3 సిక్స్‌లు). షంషీ వేసిన తొమ్మిదో ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన మనీశ్ ధాటిగా ఆడాడు. వచ్చిన బంతిని వచ్చిరాగానే బాదిన ఈ జోడీ ధనాధన్ ఇన్నింగ్స్‌తో కష్టాల్లో పడిన భారత జట్టును ఆదుకు న్నారు. ఐదో వికెట్‌కు అజేయంగా 56 బంతుల్లో 98 పరుగుల అమూల్య భాగస్వామ్యాన్ని జత చేశారు.



డుమిని (69 నాటౌట్)

డుమిని అజేయంగా : ఆరంభంలో భారత్ గెలుపుపై ధీమాగానే ఉన్నది. ఉనద్కత్, శార్దూల్‌లు ఐదు ఓవర్లలోపే రెండు సఫారీ ఓపెనర్ల వికెట్లు పడగొట్టారు. ఓపెనర్ జేజే స్మట్స్ (2)ను ఉనద్కత్ సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం చేయగా.. మరో ఓపెనర్ హెండ్రిక్స్ (26) శార్దూల్ బంతికి పాండ్యకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. వన్‌డౌన్‌లో జేపీ డుమిని (69 నాటౌట్) అజేయ అర్థ శతకంతో మెరిశాడు. ఇతనికి హెన్రిచ్ క్లాసెన్ (69) జత కలిశాడు. వీరిద్దరూ చాలా సేపు భారత బౌలర్ల ఓపికను పరీక్షించారు. హెన్రిచ్‌ను ఉనద్కత్ ఔట్ చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బెహార్డీన్ (16నాటౌట్) తోడుగా డుమిని లాంఛనం పూర్తి చేశాడు. భారత బౌలర్లలో చాహల్ నాల్గు ఓవర్లు వేయగా సఫారీలు 64 పరుగులు పిండుకున్నారు. ఇదే టీమ్ ఇండియా ఓటమిలో కీలకమైంది. మిగిలిన బౌలర్లు సైతం ఆశించిన మేర రాణించలేదు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ శిఖర్ ధావన్ (సి) బెహార్డీన్ (బి) డుమిని 24, రోహిత్ శర్మ ఎల్‌బిడబ్ల్యూ (బి) జూనియర్ డాలా 0, సురేష్ రైనా ఎల్‌బిడబ్ల్యూ (బి) ఫెలుక్వాయో 30, విరాట్ కోహ్లి (సి) క్లాసెన్ (బి) జూనియర్ డాలా 1, మనీశ్ పాండే 79 నాటౌట్, ఎమ్ఎస్ ధోని 52 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం : (18 ఓవర్లలో 4 వికెట్లకు) 188.

వికెట్ల పతనం : 1-0, 2-44, 3-45, 4-90.

బౌలింగ్ : క్రిస్ మోరిస్ 4-1-42-0, జూనియర్ డాలా 4-1-28-2, డానె ప్యాటర్సన్ 4-0-51-0, జేపీ డుమిని 2-0-13-1, తబ్రైజ్ షంషి 2-0-23-0, ఆండిలె ఫెలుక్వాయో 2-0-15-1, జెజె స్మట్స్ 2-0-15-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : రీజ్ హెండ్రిక్స్ (సి) హార్దిక్ పాండ్య (బి) శార్దూల్ ఠాకూర్ 26, జెజె స్మట్స్ (సి) రైనా (బి) ఉనద్కత్ 2, జేపీ డుమిని నాటౌట్ 64, హెన్రిచ్ క్లాసెన్ (సి) ధోని (బి) ఉనద్కత్ 69, డెవిడ్ మిల్లర్ (సి) శార్దూల్ ఠాకూర్ (బి) హార్దిక్ పాండ్య 5, ఫర్హాన్ బెహార్డిన్ నాటౌట్ 16, ఎక్స్‌ట్రాలు 7, మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 189.

వికెట్ల పతనం : 1-24, 2-38, 3-131, 4-141.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 3-0-19-0, శార్దూల్ ఠాకూర్ 4-0-31-1, జైదేవ్ ఉనద్కత్ 3.4-0-42-2, హార్దిక్ పాండ్య 4-0-31-1, యుజ్వేంద్ర చాహల్ 4-0-64-0.

హైదరాబాద్ ఇంటికి

- క్వార్టర్స్‌లో కర్నాటక చేతిలో ఓటమి
- విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ : అంబటి రాయుడు సేన క్వార్టర్స్‌పోరులో తడబడింది. ప్రతిష్టాత్మక విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్‌లో గ్రూప్ డి అగ్ర జట్టుగా క్వార్టర్స్‌కు అర్హత సాధించినా.. ఫామ్‌లో ఉన్న కర్నాటక చేతిలో 103 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (140, 111 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్స్‌లు), రవికుమార్ సామర్థ్ (125, 124 బంతుల్లో 13 ఫోర్లు) శతకాలతో విజృంభించటంతో 347 పరుగులు చేసింది. మిగిలిన బ్యాట్స్‌మెన్ అంతా హైదరాబాద్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ (5/59) ధాటికి స్వల్ప స్కోర్లకే వెనుదిరిగినా.. క్రీజులో కుదురుకున్న మయాంక్, రవికుమార్‌లు శతకం కొట్టాకే వికెట్ కోల్పోయారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఎనిమిది వికెట్లు కూలినా జట్టు స్కోరు మాత్రం మూడొందలు దాటింది. ఇక ఛేదనలో హైదరాబాద్ బ్యాట్స్‌మెన్ పరుగుల చేయడానికి ఇబ్బంది పడ్డారు. తెల్కుపల్లి రవితేజ (53, 57 బంతుల్లో 9 ఫోర్లు), అంబటి రాయుడు (64, 62 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ శతకాలతో రాణించినా ప్రయోజనం లేకపోయింది. కర్నాటక బౌలర్ శ్రేయాస్ గోపాల్ (5/31) నిప్పులు చెరిగే బంతులతో హైదరాబాద్ బ్యాట్స్‌మెన్‌ను ముప్పు తిప్పలు పెట్టాడు. స్టువర్ట్ బిన్ని (3/45) అతనికి జతకలవటంతో హైదరాబాద్ జట్టును 43 ఓవర్లలోపే ఆలౌట్ చేసింది కర్నాటక. అన్ని వికెట్లు కోల్పోయిన రాయుడు సేన 244 పరుగులే చేయగల్గింది.

సంక్షిప్త స్కోర్లు : కర్నాటక ఇన్నింగ్స్ : 347/8 (మయాంక్ అగర్వాల్ 140, రవికుమార్ సామర్థ్ 125, సిరాజ్ 5/59)

హైదరాబాద్ ఇన్నింగ్స్ : 244/10 (తెల్కుపల్లి రవితేజ 53, భవనాక సందీప్ 42, అంబటి రాయుడు 64, తనయ్ త్యాగరాజన్ 20, శ్రేయాస్ గోపాల్ 5/31, స్టువర్ట్ బిన్ని 3/45).

క్వార్టర్స్‌లో దివిజ్ జోడీ



ఫ్లోరిడా : లోకల్ ఆటగాడు స్కాట్ లిప్‌స్కీ జతగా డెల్‌రే బీచ్ ఓపెన్‌లో దివిజ్ శరణ్ ముందడుగు వేశాడు. బుధవారం జరిగిన ప్రీ క్వార్టర్స్ పోరులో 7(7)-6(2)తో సిటాక్, కూల్‌హోఫ జంటపై గెలుపొంది క్వార్టర్స్‌లో కాలుమోపాడు. హోరాహోరీగా సాగిన తొలి సెట్‌ను టైబ్రేకర్ ద్వారా గెల్చుకున్న దివిజ్ జంట రెండో సెట్‌లో అదే జోరు కొనసాగించింది. డబుల్స్‌లో లియాండర్ పేస్, పూరవ్ రాజాల జోడీ టోర్నీ నుంచి నిష్క్రమించింది. అమెరికా ఆటగాళ్లు జాక్ సాక్, జాక్సన్ విత్రోల చేతిలో 3-6, 2-6తో ఓడారు.

మిలీనియల్స్..మస్తీ

విభిన్న దృక్పథంతో సహస్రాబ్ది యువత ముందుకు

డెలాయిట్ ఇండియా, సీబీఆర్‌ఈ సర్వేల్లో తేలిన పలు ఆసక్తికర అంశాలు



18 - 34 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఉప్పొంగే ఉత్సాహం తొణికిసలాడే యువతకు వివిధ రంగ నిపుణులు పెట్టిన ముద్దుపేరు.. సహస్రాబ్ది యువత (మిలీనియల్స్ లేదా వై-జనరేషన్). ప్రస్తుతం.. ప్రపంచవ్యాప్తంగా మిలీనియల్స్ మస్తీ జోరుగా సాగుతున్న రోజులివి! వారు ఫాలో అయ్యేదే ట్రెండ్. వారు చేసిందే క్రేజీ ఇన్వెన్షన్ అన్నట్టు మారింది నేటి పరిస్థితి. ఈ నేపథ్యంలో.. మిలీనియల్స్ ఏజ్‌గ్రూప్ పై ప్రముఖ సంస్థలు నిర్వహించిన వివిధ అధ్యయనాల్లో పలు ఆసక్తికర విషయాలు వెలువడటం విశేషం.

దేశంలో పని చేసే జనాభాలో 47 శాతం వాళ్లే!
ప్రపంచ సగటుతో పోలిస్తే, భారత్ లోనే ఎక్కువ
ఫ్యామిలీ బంధాలకే మొగ్గుచూపుతోన్న యువతరం

కడవేర్గు

"ట్రెండ్ సెట్టింగ్ మిలీనియల్స్" పేరిట డెలాయిట్ ఇండియా మరియు లాబీ గ్రూప్ రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థలు వై-జనరేషన్(మిలీనియల్స్)పై నిర్వహించిన సంయుక్త అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఇక సర్వే ప్రకారం.. ప్రస్తుతం మన దేశంలో పని చేసే జనాభాలో 47 శాతం వాటాను మిలీనియల్స్ ఆక్రమించడం విశేషం. ఇక, ఈ యంగ్ తరంగ్ తమకు వచ్చే వేతనాన్ని ప్రాథమిక అవసరాలు, విద్య, వైద్యానికి ప్రధానంగా వెచ్చిస్తుండగా, ఇంక్రిమెంటల్ ఇన్ కంలో (పెరిగిన వేతనంలో) వినోదం మరియు బయటి ఫుడ్ కొరకు 32.7శాతం, దుస్తులు, ఫ్యాషన్లకు 21.4శాతం, కంప్యూటర్, మొబైల్ తదితరాలకు 11.2శాతం ఖర్చు పెడుతున్నట్టు తేలింది. ఇక, జనరేషన్ - జడ్ తరం (2000 సంవత్సర అనంతరం పుట్టినవారు) ఆలోచనలు, అభిరుచులు వై-జనరేషన్ వారితో పోలిస్తే భిన్నంగా ఉన్నట్టు సర్వే ప్రతినిధులు తెలపడం గమనార్హం. కాగా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సుమారు 740 కోట్ల జనాభాలో మిలీనియల్స్ వాటా 27శాతం కాగా.. మన ఇండియాలో అది 34శాతంగా ఉండటం ఆహ్వానించదగ్గ పరిణామం.

కుటుంబ బంధాలకు ప్రాధాన్యత:

రాబోయే మూడేండ్లలో మిలీనియల్స్ ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశమున్నదని సీబీఆర్‌ఈ ఇంటర్నేషనల్ గ్రూప్ చేసిన సర్వేలో తేలింది. ప్రస్తుతం 24శాతం మిలీనియల్స్ తమ సంపాదనలో పొదుపు చేస్తుండగా, 2020చివరి నాటికి వీరి సంఖ్య 40శాతానికి పెరిగే అవకాశమున్నదని సదరు సర్వే పేర్కొంది. ఇక, రానున్న కాలంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారి సంఖ్య క్రమంగా తగ్గే అవకాశమున్నదని.. ప్రస్తుతం ఆన్‌లైన్ లో కొనుగోళ్లు చేస్తున్నవారి సంఖ్య 70శాతం ఉండగా, అది రాబోయే మూడేండ్లలో 47శాతానికి పైగా పడిపోవచ్చని సర్వే ప్రతినిధులు అంచనా వేశారు. అన్నిటికీ మించి రానున్న కాలంలో మన యువ కెరటాలు ఫ్యామిలీ బంధాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ.. కుటుంబంతో కలిసి సరదాగా గడిపే సంస్కృతికి అలవాటు పడతారని సర్వే ద్వారా తెలియడం నిజంగా ఆనందించాల్సిన విషయం.

మిలీనియల్స్ - కొన్ని విషయాలు

- స్థిరాస్తుల ధరలు అధికంగా ఉండడం మూలంగా సుమారు 82 శాతం మంది భారత మిలీనియల్స్.. పెండ్లి వరకు తల్లిదండ్రులతో కలిసి ఉండేందుకే ఇష్టపడుతున్నారట!
- సీబీఆర్‌ఈ సర్వే ప్రకారం.. ఆఫీసుకు చేరుకునేందుకు 45 నిమిషాలకు మించి టైం కేటాయించేందుకు ఇష్టపడని మిలీనియల్స్ 73 శాతం!
- ప్రస్తుతం.. దాదాపు 24 శాతం మంది మిలీనియల్స్ రేపటి కోసం ఇప్పటి నుంచే పొదుపు మంత్రాన్ని జపిస్తున్నారట!

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.